సాహిత్య

# ప్రస్థానం

మార్చి 2016

వెల రూ. 10



సాహితీస్రవంతి



సాహిత్య ప్రస్థానం
మార్చి 2016
సంపుటి : 15
సంచిక : 3

# రాజ్యాంగ విలువల రక్షణ

బహుళ జాతులు, మతాల సమ్మేళనం మన దేశం. అందుకే ఏదో ఒక మత ప్రాతిపదికన కాక ఆధునిక లౌకిక రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. వ్యక్తిగత విశ్వాసాలకు ఆటంకం లేకుండా వ్యక్తిగత మతస్వేచ్ఛను మన రాజ్యాంగం అనుమతిస్తుంది. ప్రభుత్వం విభిన్న విశ్వాసాలు గల ప్రజలకు ప్రతినిధి. ప్రభుత్వంలో ఉన్నవారు ఏదో ఒక మత ధోరణికి అనుకూలంగా వ్యవహరించడం మన రాజ్యాంగాన్ని ధిక్కరించడమే. మన దేశ స్వాతంత్ర్యానంతరం ప్రజలందరూ అంగీకరించి ఆమోదించుకున్న రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైన ఘటనలు ఇటీవల దేశంలో చోటుచేసుకోవడం అందరినీ ఆందోళనకు గురిచేస్తుంది.

హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలంలో రోహిత్ ఆత్మహత్య నేపథ్యం, ఢిల్లీలోని జవహార్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడు కన్నయ్య కుమార్ తదితరుల అరెస్టు తర్వాత సాగుతున్న దేశ ద్రోహ ఆరోపణలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. అనేక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా కేంద్రంలో బి.జె.పి ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూత్వ పేరిట మతతత్వ రాజకీయాలను రుద్దటానికి తీవ్రంగా ప్రయత్నం జరుగుతున్న ఫలితమే ఈ ఘటనలు. ప్రతిష్టాకరమైన విద్యా సంస్థలను మతతత్వ పూరితం చేయడానికి, ఉద్రిక్తతలు పెంచడానికి ఈ విధానాలే కారణమవుతున్నాయి. సామాజిక న్యాయ కోణాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేసే దాడులు జరుగుతున్నాయి. హేతువాద ఉద్యమకారులు కల్‌బుర్గి, గోవింద్ పన్సారే, దబోల్కర్‌ల హత్యలు, అంతకుముందు తమిళనాడుకు చెందిన పెరుమాళ్ మురుగన్ వంటి దళిత రచయితకు ఎదురైనా అవమానకర సంఘటన వంటివి దేశంలోని లౌకిక ప్రజాస్వామిక వాదులను తీవ్ర వేదనకు గురిచేస్తున్నాయి. ఈ ధోరణి మన దేశ రాజ్యాంగ స్ఫూర్తికే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థకే విరుద్ధమైనది. లౌకిక ప్రగతిశీలవాదులు, దళిత ఉద్యమ కారులు, మేధావులు ఈ పరిస్థితులను ఎదిరిస్తూ ఐక్యంగా ముందుకు రావడం సంతోషించవలసిన విషయం. ఇప్పటికైనా ప్రభుత్వంలో ఉన్న పాలకులు దేశ రాజ్యాంగాన్ని గౌరవించి బహుళ విశ్వాసాలు గల దేశ ప్రజలకు విరుద్ధంగా ప్రవర్తించడం మానాలి.

దేశద్రోహం నేరం మీద అరెస్టు చేసిన కన్నయ్యను బేషరతుగా విడుదల చేయాలి. వేముల రోహిత్ ఆత్మహత్యకు కారణమైన పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలి. ఈ దేశంలోని బహుళ సంస్కృతిని పరిరక్షించడానికి రచయితలు, బుద్ధిజీవులు తమ వంతు కృషిచేయాలి. భిన్నత్వంలో ఏకత్వం అని చెప్పుకునే వైవిధ్య భరితమైన దేశ వారసత్వాన్ని కాపాడుకోవాలి.

**కవర్ డిజైన్ : గిరిధర్**

**బొమ్మలు : తుంబలి శివాజి, గంగాధర్, మీరా**

## ఈ సంచికలో ...

కవిత ........ 4
కవి, జర్నలిస్ట్ అరుణ్ సాగర్ ........ 5
రాగాలు – భోగాలు (కథ) ........ 6
కవిత ........ 11
ఆధునిక తెలుగుకథ –
బ్రిటీషు పాలన ఆర్థిక దోపిడీ ........ 12
కవితా వసంతం ........ 18
కవిత ........ 21
అర్ధజీవి (కథ) ........ 22
సీత పాత్రను తీర్చిదిద్దిన ఓల్గా ........ 27
కవిత ........ 32
ఒక మేలుకొలుపు పాట ........ 33
పుష్కర కెరటం (కథ) ........ 35
మహిళను అష్టావక్రంగా
చూపిస్తున్న దృశ్య మాధ్యమాలు ........ 40
స్వీకారం ........ 44
సంక్రాంతి బాలల కవి సమ్మేళనం ........ 45
డాక్టర్ అద్దేపల్లి సాహిత్య దర్శనం ........ 46
డైరీ ........ 48

సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** (సంపాదకుడు)
**కె.ఆనందాచారి**
**వొరప్రసాద్**
**వల్లభాపురం జనార్దన**
**కె.లక్ష్మయ్య, మేనేజర్**

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఆర్‌టిసి
కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ – 500 020

మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి. విజ్ఞానకేంద్రం,
డో.నెం. 27-30-4, 3వ అంతస్తు, ఆకులవారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ – 520 002,
సెల్: 9490099059
ఇ–మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

**కవిత**

# జీవన భాష

- డా॥ ఎన్.గోపి



క్రియలన్నీ
పొలాల్లోనే మొలుస్తాయి
బురదకాళ్లే
నామవాచకాలు.
పదాలు
సందుగొందుల్లోంచి
పరుగెత్తుకొస్తాయి.
ధాతువుల చర్చ
వాడిసేది కాదు,
విశేషణాలకు
నిజాయితీ తక్కువ.

జొన్న కంకులు
మైమరచి ఊగుతుంటాయి
బహుశా జానపద నాట్యానికి
ఇవే మాతృకలు.

తంగెడుపూలు
ముద్దకొప్పుల కోసం
ఎదురుచూస్తుంటాయి
ఎదలో చిలిపి కోరికలు
మట్టి తిని పాడే కోకిలలు.

ఉచ్చారణ
కొండలూ, సముద్ర ఘోషల నుంచి
శిల్పీకరణ పొందిందేమో
యాస మాత్రం
శ్వాస లోంచే

భాష తన
ఉత్పత్తి దగ్గరే ఆగిపోదు
పొలం దాటిన క్రియలు
హాలాహలాన్ని కురిపిస్తాయి
నామవాచకాల సంఖ్య
పెరిగిపోతూనే వుంటుంది.
విశేషణాలకే
నిజాయితీ తక్కువ.

# నడక

నాంపల్లి సుజాత
9848059893



నిన్న ధగ ధగ లాడిన సూరీడే
ఈ రోజు మబ్బు చాటున గజగజలాడుతున్నాడు
మంచుదుప్పటి కప్పుకున్న మైదానం
తూర్పు కాంతి కోసం తపస్సు చేస్తుంది
శీతలానికి ముడుచుకున్న చెట్ల వరుసలు
మా రాకతో చిరునవ్వులు చిందిస్తున్నాయి
వాటి భాష మనకర్థం కాదు కానీ
వచ్చీ పోయేవాళ్ళకేవేవో ముచ్చట్లు చెపుతున్నాయి
చెట్లమీది చిన్ని పిచ్చుకలు
ఎక్కాలు బట్టీ పట్టే చిన్నారుల్లాగున్నాయి
రంగురంగుల సీతాకోకలు
తంగేడు పూలపై సయ్యాటలాడుతున్నయి
మనుష్యుల హృదయాల కన్నా
ఈ మైదానం ఎంత విశాలమో!
కొత్త కొత్త వాకర్స్‌కిది పుష్పకవిమానం
కొందరు జింక పిల్లల్లా జాగింగు చేస్తే
మరికొందరు వాకింగులతో సరిపెట్టుకుంటారు
పైసా చుట్టూ పరుగెత్తే నగరాన్ని

పొద్దున్నే తన చుట్టూ తిప్పుకుంటుందీ మైదానం
ఎవరి కక్ష్యలో వాళ్లు ప్రవహిస్తుంటారు
ఒకళ్లను మించి మరొకళ్లు
గాల్లో దూది పింజల్లా తేలిపోతుంటారు
నిజానికిది గమ్యం లేని నడకే
కానీ రేపటి శిఖరాలకిది రాచబాట
ఎంతద్భుతం ! కాంక్రీటుజంగల్లో మట్టిజాడ
తొవ్వనిండా పరుచుకున్న పాదముద్రలు
ఒకదాన్ని చెరిపేస్తూ మరొటి
చిత్రకారుని కుంచె నుంచి
జాలువద్ద పాటర్న్ ఆర్ట్‌లాగుంది
ఇప్పుడీ మైదానం మూమూలుదే కావచ్చు
కాలాన్ని నిద్రపోనివ్వని ఓ మహోద్గ్రంథం
వెలుగురేఖలు చిమ్ముతూ నడుస్తుందీ మట్టిమీదే
రేపది పరిమళాన్ని వెదజల్లుతూ
సువర్ణాక్షరాలుగా చరిత్ర పుటల్లో నిలుస్తుంది

**నివాళి**

# కవి, జర్నలిస్ట్ అరుణ్ సాగర్



విలక్షణ కవి, సీనియర్ జర్నలిస్టు, అరుణ్ సాగర్ (49) హైదరాబాద్ అమీర్‌పేటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిబ్రవరి 12న తుదిశ్వాస విడిచారు. ఆయన భద్రాచలంలో 1967 జనవరి 2న జన్మించారు. తండ్రి టివిఆర్ చంద్రం ఖమ్మం జిల్లా సిపిఎం సీనియర్ నేత. తల్లి భారతీదేవి. భార్య ప్రసన్న. కుమార్తె శ్రీలత. వీరిది కమ్యూనిస్టు కుటుంబం. భద్రాచలంలో పాఠశాల విద్య, విజయవాడలో కాలేజీ చదువు, విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఆంత్రోపాలజీ పూర్తిచేసుకుని సుప్రభాతం మేగజైన్‌తో జర్నలిస్టు జీవితాన్ని ప్రారంభించాడు సాగర్. ఆంధ్రజ్యోతి ఫీచర్స్ ఇంచార్జ్‌గా, వీక్లీ బాధ్యుడిగా కొంతకాలం పనిచేశారు. టివి9 అవుట్‌పుట్ ఎడిటర్‌గా, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా పనిచేశారు. 10టివి సిఇఒగా ప్రారంభం నుంచి ఛానల్ రూపకల్పనలో కీలకపాత్ర వహించారు. టివి5 ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మ్యాగ్జిమమ్ రిస్క్, మియర్ మేల్, మ్యూజిక్ డైస్ కవితా సంపుటాలు, మేల్‌కొలుపు వ్యాస సంపుటి వెలువరించారు. చనిపోవడానికి కొద్దిరోజుల ముందు 'మ్యూజిక్ డైస్' కవితా సంపుటిని ఖమ్మంలో ఆవిష్కరించారు. ముంపు గ్రామాల నిర్వాసిత ఆదివాసీల జీవితాలను ఈ కవితల్లో గొప్పగా చిత్రించారు.

చిన్నప్పటి నుండి వామపక్ష ఉద్యమాలతో సన్నిహితంగా అరుణ్‌సాగర్ జీవితం సాగింది. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద భావజాలం ఉధృతంగా ఉన్నప్పుడు 'మేల్ కొలుపు' అంటూ ఆంధ్రజ్యోతిలో 25వారాలు కాలమ్ నిర్వహించారు. ఆ వ్యాసాలను 2003లో తన తొలిపుస్తకంగా తీసుకొచ్చారు. ఆ పుస్తకంతో తెలుగు ఇంగ్లీష్ మిక్సింగ్‌తో కూడిన అరుణ్‌సాగర్ విలక్షణ వచన శైలి అందరి దృష్టికి వచ్చింది. ఈ వ్యాసాలలో స్త్రీ, పురుష సంబంధాలకు సంబంధించిన అనేక అంశాలను వైవిధ్యంగా విశ్లేషించాడు. తెలుగు పాఠకులకు తెలియని కొత్త విషయాలను ఈ కాలమ్ ద్వారా అరుణ్ అందించాడు. పలు విమర్శలు కూడా వచ్చాయి. 'మేల్‌కొలుపును నేను 'మోడరన్ టాకింగ్ బై యాన్ అర్బన్ ఎడ్యుకేటెడ్ మేల్' (విత్ సమ్ ఎక్స్‌పోజర్ ఇన్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ అండ్ లిటరేచర్) అని పిలవడాన్ని ఇష్టపడతాను.' అని ముందుమాటలో రాసుకున్నాడు. ఈ పుస్తకానికి కె. శ్రీనివాస్ ముందుమాట రాస్తూ – 'మేల్‌కొలుపు' కాలమ్స్ అనేకం నేను యథాతథంగా ఆనందించినవి ఉన్నాయి. కొద్దిపాటి రిజర్వేషన్స్‌తో అంగీకరించినవి ఉన్నాయి. చాలా అభ్యంతరం ఉన్నా సహించినవి ఉన్నాయి. కొన్ని ఏ మాత్రం ఒప్పుకోలేనివి ఉన్నాయి. అభిప్రాయంతో సంబంధం లేకుండా అన్నిరకాల కాలమ్‌లలోనూ శైలిని విడిగా ఆనందించాను. సాగర్ ఎంతగా ఎదిగిందీ సూచించే అనేక గొప్ప ఎక్స్‌ప్రెషన్స్ ఈ కాలమ్స్‌లో నేను చూశాను.' అని అంటారు. అరుణ్‌సాగర్‌ని చదివిన చాలామంది ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తారు.

మ్యాగ్జిమమ్ రిస్క్, మియర్ మేల్ కవితా సంపుటాలలోని కవితలు కూడా వైవిధ్యాన్ని, శైలీ విన్యాసాన్ని చాటేవే. తెలుగు వచనంలో అలవోకగా ఇంగ్లీషు వాక్యాలను జొప్పించే సాగర్ 'మ్యాగ్జిమమ్ రిస్క్' సంపుటిలో 'సంక్రాంతి' కవితలో ఒక్క ఇంగ్లీషు పదాన్ని కూడా వాడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది– 'గుప్పెడు నక్షత్రాలు/ అరచేతి నిండా/ ధాన్యం / నా నల్లని నగ్నపాదాల కింద / పొలం మట్టి పూసుకున్న / చీర నిండా/ మంచు రాల్చిన ఆకులు / నా చుట్టూ నిగనిగలాడే / చిత్తడి నేల/ తల తెగిన కోడి/ ఎగిరే పతంగం/ నా సరికొత్త ఆశ' 'సంక్రాంతి' శీర్షికతో రాసిన చిన్న కవిత ఇది.


జర్నలిస్టుగా, కాలమిస్ట్‌గా, కవిగా వైవిధ్యానికి, విభిన్నతకు పెద్దపీట వేసాడు సాగర్. తను పనిచేసిన ప్రతీచోటా తనదంటూ ముద్ర అందుకే వేయగలిగాడు. ప్రింట్ మీడియా నుండి ఎలక్ట్రానిక్ మీడియాకు మారి మరింతగా తన ప్రతిభను చాటుకోగలిగాడు. తీవ్ర అనారోగ్యం వెంటాడినా ఎదుర్కొంటూ సృజన చాటుతూనే వచ్చాడు. జీవించింది కొద్ది కాలమే అయినా విస్మరించలేని గుర్తులు వేసి మరీ నిష్క్రమించాడు అరుణ్‌సాగర్.

హైదరాబాద్‌లోని మోతీనగర్‌లో అరుణ్‌సాగర్ ఇంటివద్ద ఉంచిన ఆయన భౌతిక కాయాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రవి, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్, అల్లం నారాయణ, తమ్మినేని వీరభద్రం, ప్రజాశక్తి సాహితీ సంస్థ చైర్మన్ వి. కృష్ణయ్య, 10టివి ఎం.డి. కె.వేణుగోపాల్, టివి5 ఎండి బిఆర్. నాయుడు తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు అనేక మంది ప్రముఖులు అరుణసాగర్ మృతికి సంతాపం తెలిపారు. సాహితీస్రవంతి, సాహిత్య ప్రస్థానం తరపున అరుణ్‌సాగర్‌కి జోహార్లర్పిస్తున్నాం.

## కథ

# రాగాలు - భోగాలు

- గనారా
9949228298



చెన్నై ఎక్స్‌ప్రెస్ విజయవాడలో ఆగి, కదలడానికి సిద్ధంగా ఉంది, బండి చివరిలో ఉండే గార్డ్ విజిల్ వేసి, సిగ్నల్ ఇచ్చాడు. కిన్‌లే మంచి నీళ్ళ సీసా కొని, చిల్లరకూడా లెక్కచెయ్యకుండా పరుగులాంటి నడకతో మొదటి తరగతి పెట్టి వైపుకు వెళ్ళాడు రఘోత్తమరావు. అప్పటికే, ఓ డెబ్బై ఏళ్ళు దాటిన, వృద్ధుడు కంగారుగా ముందుకు పోబోయి, ఆగి, కదులుతున్న రైలును లెక్క చెయ్యకుండా మొదటి తరగతి పెట్టెలోకి చొరబడ్డాడు. అతని సంకలో ఉన్న పొడవాటి మూట, ఫ్లాట్ ఫారంపై పడిపోతుంటే, రఘోత్తమరావు క్షణంలో అందుకుని చాకచక్యంగా లోపలికి ప్రవేశించాడు.

"ఈ వయస్సులో అంతరిస్క్ తీసుకోవాలా!" అంటూ ఆ పెద్దాయనకు మూట చేతిలో పెట్టాడు.

ఆత్రంగా తీసుకొని

"సంతోషం నాయనా!" అంటూ కళ్ళకు హత్తుకున్నాడు.

"ఏమిటది?" అడిగాడు రఘు

"వయొలిన్.. తిరుపతిలో ప్రోగ్రాం చేసి వస్తున్నాను!"

చూస్తే పెద్దాయనే! గౌరవంగా కనిపిస్తున్నాడు. తెల్లటి లాల్చి, పంచె బాగా నలిగిపోయివున్నాయి. రెండు రోజుల నుండి షేవింగ్ లేని తెల్లని గెడ్డం! పాత కళ్ళజోడు, భుజాన ఉన్న తువ్వాలుతో ముఖాన్ని వత్తుకున్నాడు!

"ఎక్కడికి పోవాలి?"

"పిఠాపురం!"

"అక్కడ ఆగదే!"

"అయ్యో!" అన్నాడు ఆశ్చర్యంగా

"ఇక్కడే కూర్చోండి... ఇక దిగలేరు! టి.టి. వస్తే గొడవచేస్తాడు. పైగా ఇది ఫస్ట్‌క్లాసు!" అంటూ రఘోత్తమరావు తన కూపీలోకి వెళ్ళాడు.

"ఏమిటోయ్ రఘు! ఎవరితో మాట్లాడుతున్నావు!" అడిగాడు ప్రముఖ సంగీత విద్వాంసుడు కుమారస్వామి పిళ్ళై.

"ఎవరో పెద్దాయన, బండి కదిలిందని, తొందరలో మన బోగి ఎక్కాడు!"

కుమారస్వామి పిళ్ళై, దక్షిణ భారతదేశంలో కర్నాటక, హిందూస్థానీ, సంగీత కళాకారుల్లో ప్రసిద్ధుడు! ఆయన నోట వెలువడే ప్రతీ సంగీత ధ్వని, రాగం, వేలకు వేలు ఆర్జించి పెడతాయి. సెకనుకు నాలుగు వేల రూపాయిలు ఆదాయం

పొందే అంబానీలా!

రఘు కొద్ది కాలం క్రితం ప్రభుత్వ సాంస్కృతిక, శాఖకు రాజీనామా చేసి, పెద్ద పాకేజీతో, మల్టినేషనల్ కంపెనీలో అధికారిగా చేరాడు. ఇప్పుడు పిళ్ళై బృందాన్ని మదరాసు నుండి కంపెనీ స్పాన్సర్ చేస్తున్న సంగీత కార్యక్రమానికి తీసుకువస్తున్నాడు.

బయట ద్వారం దగ్గర కూర్చున్న పెద్దాయన దగ్గు వినపడుతూవుంది! రొప్పుతున్నాడు!

పాపం! బాగా బతికిన వాడే కాబోలు ! సంస్కారవంతుడు వలె వున్నాడు! తన తాత వయస్సు. రైలు ఎక్కుతూ కంగారుపడ్డాడు! ఏమైనా తిన్నాడో! లేదో! పైగా రెండు గంటలు దాటింది. రఘు మనసులో మెదిలిన వెంటనే బ్యాగ్‌లో ఉన్న బ్రిటానియా కేకు, రెండు అరటిపళ్ళు, మంచినీళ్ళ సీసా తీసుకుని వెళ్ళాడు!

"సంతోషం నాయనా!"

"మీ పేరు?"

"రామచంద్రయ్య!"

అంటూ రెండు అరటిపళ్ళు తీసుకున్నాడు.

"కళాకారులందరమూ, తిరుపతి వెళ్ళాం! ఈ వూళ్ళో అమ్మాయివుందని దిగాను! రెండు ముద్దలు తిన్నానులే!" అంటూ వుండగానే ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

రఘు వెళ్లి తన బెర్త్ మీద నడుం వాల్చాడు.

***

సన్నటి వయోలిన్ రాగం... కుమారస్వామి పిళ్ళై చెవిని తాకింది! అంతటి రైలు శబ్దంలో కూడా పిళ్ళై ఆ మాధుర్యాన్ని వడిసి పట్ట గలిగాడు!

"రఘు! ఎక్కడ నుంచోయ్, ఆ రాగం!"

రఘుకు మాత్రం స్పష్టంగా వినిపించలేదు. కానీ, అతని గుండెపై ఏదో సన్నటి రాపిడి!

"చాలా హృదయ విదారకంగా లేదూ! వెళ్ళి చూడు! బహుశా మన పెట్టిలోనే కాబోలు!"

రఘు వెంటనే గ్రహించాడు.

"ఈ పెట్టి ఎక్కిన పెద్దాయనే కావచ్చు!"

– రఘు లేచి బయటకు వెళ్ళాడు.

రామచంద్రయ్య కళ్ళల్లో నీరు ధారా ప్రవాహంలా వస్తూవుంది. ఆ దు:ఖాన్ని వయోలిన్ మరింత ప్రవాహంగా మార్చింది! ఆశ్చర్యపోయాడు రఘు. దగ్గరగా వెళ్ళి ఆ పెద్దాయన భుజంపై చెయ్యివేసాడు!

సెలయేరు కన్నీరు కార్చినట్లు, మంచు కరిగి జరుగుతున్నట్లు, ఆ రాగం... అలా సాగిపోతూనే ఉంది!

రఘు, పిళ్ళై దగ్గరకు తీసుకువెళ్ళాడు.



"ఏమిటది?" అడిగాడు పిళ్ళై

గుడ్డ కప్పిన వాయిద్యాన్ని చూపి

''మా అమ్మ!'' అంటూ గుడ్డను తొలగించాడు రామచంద్రయ్య!

ఒక కళాకారుడు, తన వాయిద్యాన్ని అమ్మతో పోల్చడం, అరుదైన భావన! పిళ్ళై ఆశ్చర్యపోయాడు.

ప్రసిద్ధ వైణికుడు, తుమరాడ సంగమేశ్వరశాస్త్రి ఆవసాన దశలో ఉండగా, చిన్నతనంలో 'అవంత్స సోమ సుందర్ని' ఉద్దేశించి 'అమ్మను' (వీణను) జాగ్రత్తగా తీసుకురారా!" అన్నారని వ్రాసిన అవధానుల మణిబాబు వ్యాసం గుర్తుకు వచ్చింది రఘుకు.

"కూర్చో!" అని ఎదురు సీటు చూపించాడు పిళ్ళై – రామచంద్రయ్య సంశయించాడు.

"పర్వాలేదు! పెద్దవారు కూర్చోండి!"

రఘు చేయి పట్టి రామచంద్రయ్యను కూర్చో బెట్టాడు.

పిళ్ళై రామచంద్రయ్యను పై నుంచి క్రిందికి చూసాడు. అతని మోచేతికి బ్యాండేజి కట్టి ఉండటం గమనించాడు. మాసిన గెడ్డం, నలిగిన దుస్తులు..

"ఏ ప్రాంతం?"

"తూర్పు గోదావరి.... పిఠాపురం!"

"కవులు గాయకులు పుట్టిన చోటే" తమిళ యాస ఉన్నప్పటికిని తెలుగు స్పష్టత ఉంది. ఆయన తిరగని ప్రాంతమూ లేదు! రాష్ట్రమూ లేదూ.!

"చేతికి దెబ్బ తగిలిందా?" రఘురామ చంద్రయ్యను ప్రశ్నించాడు.

"తిరుపతిలో... చిన్న గాయమే!"

"ప్రోగ్రాం ఏదైనా చేసి వస్తున్నావా?" అడిగాడు పిళ్ళై!

"లేదు! వృత్తి కళాకారుల మీటింగ్ తిరుపతిలో జరిగింది!"

"ఏమిటో... విశేషం?"

పిళ్ళై వెటకారం ధ్వనింపజేసాడు.

"స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు కూడా ఇప్పుడే

జరుగుతున్నాయి! ముఖ్యమంత్రి గారు వచ్చారు! మా గోడు వినిపించాలనుకున్నాం! పోలీసులు అనుమతించలేదు. కనీసం వినతి పత్రం కూడా చూడలేదు!" మేము వాయిద్యాలతో నిరసన తెలిపితే! పోలీసులు లాఠీచార్జీ చేసారు! కళామతల్లి నెత్తురు చూసారు!"

రఘు కూడా రెండు రోజుల క్రితం ఆ వార్త పేపర్లో చూసాడు, మాడ వీధుల్లో కళాకారులు ప్రదర్శన చేసారని, ప్రజా కళలను రక్షించాలని, వృద్ధ కళాకారులకు ఫించన్‌లు ఇవ్వాలని కోరారు.

"టి.వి.లు, ఇంటర్‌నెట్‌లు వచ్చిన తరువాత వీధి బాగోతాలు ఎవరు చూస్తారు?"

రామచంద్రయ్యకు కోపం వచ్చింది. 'సాటి కళాకారుడే ఇలా నిరాదరణంగా మాట్లాడితే ఎలా?' అనుకున్నాడు. అవమానం అనిపించింది అక్కడ నుంచి వెళ్ళాలనుకున్నాడు.

మనసు మరింత నొచ్చుకుంది!

భారతీయ సంస్కృతికి ప్రతినిధులమని చెప్పుకొనే ఈ శాస్త్రీయ, సాంప్రదాయ వాదులే మన ప్రతినిధులా?

'మానవ సహజ ధ్వనికి కొన్ని పేర్లు పెట్టి, హద్దులు నిర్ణయించి, భక్తిని కలిపి, శాస్త్రీయత అంటే సరిపోతుందా?' అనుకున్నాడు రామచంద్రయ్య.

"ఎన్ని కష్టాలు వచ్చినా ఎంత దారిద్రం అనుభవించినా నేను నిబ్బరంగానే వున్నాను! కారణం నా సాధన సంగీతం నాకిచ్చిన మనశ్శాంతి!"

రామచంద్రయ్య, పిళ్ళైకు కరుకుగానే సమాధానం ఇచ్చాడు.

"ఏది ఒక రాగం వాయించు!" అంది పిళ్ళై సహకారిణి బొద్దుగా, ముద్దుగా డైమెండ్‌లో లోలక్కులుతో ఉన్న శమంతకమణి!

రఘు ప్రక్కన కూర్చుని శివరంజని రాగంలో విషాద గేయం పలికించాడు రామచంద్రయ్య!

సహజంగానే పిళ్ళై హృదయం కూడా తొణికిసలాడింది. శమంతకమణి కళ్ళల్లో నీటిచార! రఘు గుండెను హత్తుకున్న రాగం, అందరి మనసులకు మట్టి గోడల చెమ్మదనం చేరింది.

రామచంద్రయ్య ఆ వాతావరణాన్ని, మార్చి వేశాడు. పిళ్ళైకు రెండు గంటల కాలక్షేపం!

రైలు సామర్లకోట చేరింది. అందరూ దిగారు, రామచంద్రయ్య నమస్కారం చేసి, బయటకు దారి తీసాడు. కొంతమంది అభిమానులు స్వాగతం చెప్పి పిళ్ళైకి పూలదండలు వేసారు!

చివరి భోగిలో ఉన్న పిళ్ళై వాయిద్య బృందం దిగి వచ్చారు!



''వయోలిన్ మాస్టారు, రైలు అందుకోలేకపోయాడు," భయం భయంగా చెప్పారు,

పిళ్ళై నెత్తిన పిడుగు పడినట్లు అయ్యింది.

''ఏమి మాట్లాడుతున్నారురా? ప్రోగ్రాం చేసేది ఎలా?"

ఎవరి ముఖానా నెత్తురు చుక్కలేదు!

"వాడు టైముకు వచ్చే అవకాశం ఉందా!"

"లేదయ్యా!"

"ఎనిమిది గంటలకు ప్రోగ్రాం!" అంటూ పిళ్ళై నుదుటన చెమట తుడుచుకుని, అక్కడే ప్లాట్‌ఫారం సిమ్మెంట్ బల్లమీద చతికిలబడ్డాడు.

"ఇక్కడ అంతటి సమర్థులు దొరుకుతారా?" అంటూ నిట్టూర్చాడు.

రఘోత్తమరావుకు కూడా ఆందోళనకరంగా ఉంది! ప్రాగ్రాం ఏర్పాట్లు భారీగా, ప్రతిష్ఠాకరంగా కంపెనీ స్పాన్సర్ చేసింది. అధికారులు బొంబాయి నుండి కూడా వచ్చారు. ఆధ్యాత్మిక సభలు మొదలుకొని, ప్రజల్ని, మత్తులో ఉంచే ప్రతీ కళను ఆదరిస్తూ ఉండే పాలసీ కంపెనీది.

తన మెరుపు ఆలోచనలోకి రామచంద్రయ్య వచ్చాడు, రఘులో ఆశ వెలిగింది!

"మనతో వచ్చిన పెద్దాయన సమర్ధుడే కాబోలు! ఆయన అనుభవాలు మనతో పంచుకున్నప్పుడు ప్రసిద్దులతో కలిసి ప్రోగ్రాంలు చేసానన్నాడు. కదా!" పిళ్ళై ఆలోచనలో అవమానం అంతలోనే –

"ఏమిటి ఆ బజారు వాడా?" వెటకారంగా అన్నాడు.

"జీవితకాలం అతను సంగీతం తోనే గడిపిన వాడు కదా!" పిళ్ళైకు ఆలోచించే వ్యవధి లేదు.

"సరే ప్రయత్నించండి!" అన్నాడు. వేరేదారి లేక.

రఘు ప్లాట్‌ఫారం కలయచూసాడు, దూరంగా సంధ్య

వెలుగులో కలిసి పోయే రామచంద్రయ్య కనిపించాడు. పరుగున వెళ్ళి పరిస్థితిని వివరించాడు.

"ఆయనకు సపోర్టుగా సరిపోతానా!

"పరవాలేదు, పిళ్ళై గారు సర్దుకుపోతారు!"

"అలాగని సాహసం చెయ్యలేను కదా!"

"కాదనకండి!" అంటూ, రామచంద్రయ్యను పిళ్ళై దగ్గరకు తీసుకెళ్ళాడు రఘు.

"ఏమైనా పెద్ద ప్రోగ్రాంలు చేసావా?" పిళ్ళై అడిగాడు. "పదేళ్ళ వయస్సు నుండి ప్రోగ్రాంలు చేస్తున్నాను. వినయంగా చెప్పాడు రామచంద్రయ్య. "ఎవరి దగ్గర నీశిష్యరికం?"

"మదరాసులో ఉన్నప్పుడు ద్వారం వెంకట స్వామి నాయుడు, పాలఘాట్ మణిగారి దగ్గర వారి పాద ధూళితో నా శిరస్సు పునీతం అయింది!"

"సరి – సరే – పదండి!"

ఎంతో కొంత అనుభవం లేకుండా ఉండదు కదా! అనుకుంటూ ముందుకు నడిచాడు పిళ్ళై!

***

సాయంకాలం ఐదు అయింది, ఇంకో రెండు గంటలు వ్యవధి ఉంది. కంపెనీ వారి గెస్ట్‌హౌస్‌కు కార్లు.. పరుగులు తీశాయి.

రఘు డ్రైవర్‌ను పంపి, ఒక కొత్తపంచె, లాల్చీ, మెత్తటి కండువా, తెప్పించి, వప్పించి రామచంద్రయ్యకు ఇచ్చాడు. థియేటర్ బయట పోలీస్ బందోబస్త్ ఎక్కువగానే ఉంది. వందలాది వాహనాలు, కార్లు, రోడ్లకిరువైపుల ఆక్రమించాయి. ట్రాఫిక్ నియంత్రణ కాస్త కష్టసాధ్యం అయ్యింది. సాంస్కృతిక శాఖా మంత్రి వచ్చారు. కళామందిరం ప్రేక్షకులు కళాపోషకులు, రసహృదయులు, సాటి కళాకారులు, పెద్దలు, అధికారులతో కిక్కిరిసిపోయింది.

సంగీత కార్యక్రమ నిర్వహణ కమిటీ వారు తొలుత మంత్రి పిళ్ళైని సాదరంగా ఆహ్వానించి, వి.ఐ.పిల వరుస కుర్చీలలో కూర్చోడానికి ఏర్పాటు చేసారు. కొంతమంది ప్రముఖులు మర్యాద పూర్వకంగా లేచారు.

ఆర్గనైజర్, ఆనాటి కార్యక్రమ విశేషాలు వివరించారు. తదుపరి, కళల మీద మంత్రి ఉపన్యాసం. ఈనాటికీ సాంప్ర దాయాలు నిలబడ్డాయంటే, కారణం, శాస్త్రీయ సంగీతం, కళలు అని పిళ్లైను కాసేపు పొగిడాడు! వీటిని ప్రజల మధ్యకు తీసుకువెళుతున్న కంపెనీల ఆశయాన్ని కొనియాడి, శాస్త్రీయ సంగీత కళాశాల ఏర్పాటుకు వాగ్దానం చేసాడు. అందుకోసం ప్రతీ జిల్లాకు కోటి రూపాయలను కేటాయించినట్లు ప్రకటించాడు.



రామచంద్రయ్యకు ఆశ్చర్యం వేసింది. తాము ఎంత నిరాదరణకు గురైంది తలచుకుంటే బాధకలిగింది. లాఠీ విరిగిన సంఘటన అతనిలో ద్వేషం పెంచింది!

పిళ్ళై బృందం వేదిక మీదకు వెళ్ళగానే, శ్రోతలు గౌరవంగా లేచారు.

ప్రార్ధనా గీతం 'వాతాపి గణపతింభజే'! ఎత్తుకోగానే, థియేటర్ అంతా నిశ్శబ్దంగా మారిపోయింది. రామచంద్రయ్య వయోలిన్ శృతిని కలిపాడు. పిళ్ళై అతని వంకకు తిరిగి అభినందనగా చూసాడు!

తరువాత 'నగుమోము గనలేని' (ఆ భేరిరాగం) అలా వరుసగా తనకు పేరు తెచ్చిన కీర్తనలను ఆలపించాడు. చివరగా వైద్యానంద భాగవతార్‌కు ఇష్టమైన,

శివ శివ అనరాదా!...

ఓ భవభయబాధలను

కామాంధులను తెగకోసి

సమగ మగరి సరిగ మగరి, నిపద పనిసని మగమగ దపని దపనిద

ఇరువైపుల మృదంగం, రామచంద్రయ్యతో పాటు మరో జూనియర్ వయోలిన్ కుర్రాడు, మరోప్రక్క శృతి, బాక్సు మధ్యమధ్యలో పిళ్ళైకు తీర్ధం అందిస్తున్న శమంతకమణి.

క్రమంగా థియేటర్‌లో వాతావరణం గంభీరంగా మారిపోయింది. పిళ్ళైకు రాగం, తాళం, లయ, స్వరం మీద ఎంత అధికారం వుందో రుజువు చేసాడు!

గమకాలు ప్రదర్శించే అలవాటు ఉందనుకుంటాను! ఒక దశలో శ్రోతలను కూడా లక్ష్యం చేయకుండా గాత్ర నియంత్రణ చేస్తూ తనని తాను ఆవిష్కరించుకుంటున్న తీరు రామచంద్రయ్యకు ఆశ్చర్యం వేసింది, ఆ స్వర విన్యాసానికి మధ్య మధ్యలో హాలు చప్పట్లతో మారుమ్రోగింది!

కానీ, మృదంగంలో ఎక్కడో వినీ వినిపించని అపశృతి దొర్లుతుందని పిళ్ళై, రామచంద్రయ్య ఇద్దరు కూడా గమనించారు.

పిళ్ళై విరామ సమయంలో వాయిద్య కారుల ప్రతిభ

## కవిత

# నానీలు



తగుళ్ళ గోపాల్
9505056316

నిరంతరం రాస్తున్నాను
కవిత్వం
తపస్సు అంటే
ఇదేనా అన్పిస్తుంది

ఈడూ జోడూ
బాగానే కుదిరింది
వరకట్నమే
శాపమయ్యింది

పగలు రాత్రిని
గుర్తించలేకపోతున్నా
మకాం
పట్నానికి మారాక

అమ్మ ప్రేమను
వర్ణించాలని తపన
ఏ పద్యంలోనూ
అది పట్టలేదు

---

ప్రదర్శించాల్సి వచ్చినప్పుడు రామచంద్రయ్య తన సత్తా ఏమిటో నిరూపించాడు.

తిరిగి వెనువెంటనే లేచి, మృదంగం తన చేతిలో తీసుకొని, తానే వాయించడం... ప్రారంభించాడు, శ్రోతలు చాలా మంది అకస్మాత్తుగా జరిగిన ఆ పరిణామానికి చాలా విస్మయం చెందారు!..

ఒక పక్క రామచంద్రయ్య చాలెంజ్ విసురుతున్నాడు, సమాధానం కూడా అదే స్థాయి. ఆనంద పారవశ్యం పొంగుతుంది. పిళ్ళై మధ్యమధ్యన సెభాష్... శెభాష్... అంటున్నాడు.

అదొక యుద్ధ వాతావరణం. కళాకారుడు తనలో వున్న కళను, పతాక స్థాయిలో ప్రదర్శించే అద్భుత దృశ్యం!

రాగం, తానం, పల్లవి, లాంటి సుదీర్ఘమైన తన్యా వర్తనాల్లో రాణించాలంటే లెక్కల్లో అది తేలాలి. మృదంగం గణితంలో మాష్టారు అయితే తప్ప తనంతటి సామర్థ్యాన్ని హత్తుకొనేలా పలికించడు, తనదైన శైలి ప్రదర్శిస్తుంటే పిళ్ళై నివ్వెరపోయాడు. రామచంద్రయ్యను మనసారా అభినందించ లేకుండా ఉండలేకపోయాడు.

రెండు గంటల కచ్చేరి ముగిసింది, పిళ్ళై రామచంద్ర య్యను అభినందన పూర్వకంగా భుజం తట్టాడు! చాలామంది ప్రముఖులు పిళ్ళైను దండలతో ముంచెత్తారు కంపెనీ వారు పెద్ద మొత్తం పారితోషికం పిళ్ళైకి పర్సులో పెట్టి బహూకరించారు.

రామచంద్రయ్య దుస్తులు మార్చుకుని కొత్తవి డ్రైవర్‌కి ఇచ్చేసి, హాలు మధ్య నుంచి బయటకు దారి తీసాడు. ఎవ్వరూ కూడా అతన్ని పలుకరించలేదు.

పేద కళాకారులను ఎవరు ఆదరిస్తారు? రాగాలు అర్థం చేసుకున్నవాడు వర్చువల్ రియాలిటి జగత్తులో భావోద్రేకంతో ఉంటారు. సామాన్యులకు మాత్రం గందరగోళంగా ఉంటుంది. ఇందుకే శాస్త్రీయ సంగీతానికి సామాజిక స్పృహ లేదన్నాడు రోహిణీ ప్రసాద్! రఘు, రామచంద్రయ్య కోసం హాలు అంతా వెదికాడు కనిపించలేదు. బయటకు వచ్చాడు, అప్పటికి రోడ్ మీద ఆగివున్న కార్లను తప్పించుకుంటున్నాడు రామచంద్రయ్య.

"లోపలికి రండి"

"లేదు నాయనా, 'నాకు ఆలస్యం అవుతుంది!"

"మా గౌరవాన్ని స్వీకరించకుండా!"

"సాటి కళాకారుడిని, ఆదుకుని గౌరవించేందుకే వచ్చాను కానీ, ఏదో ఆశించికాదు!"

"పారితోషికం తీసుకోండి!"

అని రఘు అయిదు వేలు కట్టను చేతిలో పెట్టాడు.

"కళకు చారిత్రక లక్షణం పోయి, కృత్రిమత్వం పెరిగింది, డబ్బు ఉన్న ఇంట ఊడిగం చేస్తూవుంది! మా సమస్యలకు వ్యక్తుల ఔదార్యం కాదు, నా రోజు కిరాయి మూడు వందలే!" అంటుండగా రామచంద్రయ్య పెదవులు వణికాయి. ఆ సొమ్ములోంచి మూడు వందలు తీసుకుని ముందుకు పోతూవుంటే, ఎవరో బిచ్చగత్తె చిడతను వాయిస్తూ మధురమైన కంఠంతో పాటలుపాడుతుంది. ఆమె బొచ్చెలో రామచంద్రయ్య రెండువందనోట్లు వేసి ముందుకు కదిలాడు.

"గతంలో ప్రజల గౌరవాభిమానాలకు పాత్రమైన వృత్తులన్నిటిని, ఈ వ్యవస్థ అధోగతికి తీసుకువచ్చింది, కవులు, కళాకారులు, న్యాయవాదులు, వైద్యులు, శాస్త్రవేత్తలనూ తన కూలీలుగా మార్చివేసింది!" ఈ వాఖ్యానం ఎప్పుడో, ఎక్కడో చదివింది గుర్తుకు వచ్చింది రఘుకు.

**కవిత**

# ఆత్మ స్థైర్యమే జీవితానికి ఆయుష్షు

- డా॥ కత్తి పద్మారావు
9849741695

నిశ్శబ్దం ఓ సంగీతం
నిశ్శబ్దం ఓ మంచు అల
నిశ్శబ్దం ఓ జీవన గీతం
నిశ్శబ్దం లో ఓ కేకవుంది
సముద్రం నర్మగర్భంగా మూలుగుతోంది
అలకి అలకి మధ్య ఒక వైరుధ్యం
ఆకాశం కడలిని ముద్దాడుతున్న
ఓ సృజన
సుడిలో చిక్కుకున్న ఒక చిరుచేప
ఊపిరి ఆడక ఎగిరిదూకింది.
మునక ఈత వేస్తున్న చేపలన్నీ
అంతరంగికంగా మాట్లాడుకొంటున్నాయి
వేటగానికి అందని ఓ ఆట
పడవ మీదున్న జాలరి వేస్తున్న
ఈలపాటకు తలలూపుతున్న అలలు
చీకటి అలలమీద కాసేపు నిద్రించింది
ఆకాశంలో నక్షత్రాల జాతర
కడలి ఒడ్డున గవ్వల మొలతాడుతో
ఓ బుడ్డోడి చిందుల్లోను
ఓ లయ తప్పని శ్రుతి
తడిసిన ఇసుకలో ఓ చారిత్రక ముద్రలు
ఒడ్డునే తిరిగి తిరిగి అలసిన ఓ పడవ
ఎన్నో కన్నీటి గాథలు వినిపిస్తుంది.
ఆ చెలియలి కట్టపైన ఓ గుడిసె
అందులో ఓ ముదుసలి కర్రలేకుండ
నడుస్తుంది
సముద్రంలో వేటకని వెళ్ళిన కొడుకు
మళ్ళీ తిరిగిరాలేదు
కడలి 'జీవితాన్ని ఇచ్చింది తీసుకొంది'
అని నిట్టూర్చింది.
ఆ చలిమంట చుట్టూకూర్చున్న
పిల్లలగుంపు మధ్యలో చలిగాచుకొంది
అవును! ముసలితనం కూడా ఓ శైశవమే!
బాల్యాన్ని గుర్తుపెట్టుకోనివాడు
భవితవ్యాన్నేమి గుర్తుపెట్టుకొంటా
ఆమె! బొటనవేలుతో తాటిముంజెను
జుర్రుతుంది
గోరుగుజ్జును తాటి డొప్పను తాకింది



మనుష్యులు లోభీలవుతున్నారు
పెదాలు ఆడించి బతుకుతున్నారు
జీవితానికి ఆయువైన స్థైర్యాన్ని
పోగొట్టుకొంటున్నారు
నదులకు ఆనకట్టలు కడుతున్నారు
కోరికలకు హద్దులు లేవు
ఈత బొత్తిగా రాదు
సుడిగుండంలో మునక
అర్ధరాత్రిలో కూడా వారు సందడే
చేస్తున్నారు.
సూర్యోదయం వారికి లేదు ఆ యువకుల
ఎముకలు గుల్లబారుతున్నాయి
వెలుగులో చీకటి బతుకుతోంది
చీకటిలో వెలుగు కునుకు తీస్తుంది
ఆ పక్షులు ఆ కొలనుపై అడుగులేస్తూ
నడుస్తున్నాయి
ఆత్మవిశ్వాసం వాటి నడకకు ప్రాణం
ఆ పక్షులు గుంపులుగా జీవిస్తున్నాయి
వాటికనుల్లో నక్షత్రమండలాలున్నాయి
అవి వేటగాడికందనంత ఎత్తుకు
ఎగురుతున్నాయి.
ఎల్లలు చెరిపేస్తున్నాయి
ఆకాశంలో మబ్బులను వాహనాలు
చేసుకొంటున్నాయి
ఆ చిలకలు చిగురాకులను మేసి
జీవిత సత్యాలు పలుకుతున్నాయి

ఆ గోరింటాకు చిదిమే కొద్దీ
ఆనందాన్ని చిమ్ముతోంది
ఆత్మీయతను చిమ్ముతోంది
ఆ తెల్లవారుజామున మెరిసే ఒకే ఒక
చుక్క
దిశానిర్దేశం చేస్తుంది
కృతజ్ఞత జీవితానికి ఊపిరి సుమా!
ఆ కొండపైకి ఎక్కుతున్న గొర్రెపిక్క
బలంగా ఉంది.
ఏ మత్తుమందులు లేకుండానే
అది విజేత అవుతోంది.
వధకు అందనంతకాలం అది విజేతే
మీరు శిధిలమవుతున్న సమాధుల చుట్టూ
తిరగకండి
భవిష్యత్తుమీద ఆశ నశిస్తుంది
మీ వాహనానికి మీరే సారథులుకండి!
ఇతరుల వాహనం ఎక్కినంత కాలం
మీ గమ్యం సుదూరమవుతోంది!
అమరావతిలో బుద్ధుని విగ్రహం
తోడుకోసం చూస్తుంది
అంబేద్కర్ తోడుతో 'కరుణ'ను
పండించాలని ఆశిస్తుంది.
అవును! కడలి, పక్షి, గొర్రె
మనకు ఆత్మస్థైర్యాన్నిస్తున్నాయి
బుద్ధుడు, అంబేద్కర్
మనల్ని పునరుజ్జీవింప చేస్తున్నారు.
అని నన్ను నడిపిస్తాయి.
మనుష్యులారా! ప్రేమను పెంచుకోండి!
చీకటిని వెలుగును అధ్యయనం
చేయండి!
మనస్సును ఆర్ద్రం చేయండి!
మెదడుకు పదును పెట్టండి!
విజేతలు కండి!
జ్వలిత జ్వలనంగా నడవండి
ఆత్మస్థైర్యమే జీవితానికి ఆయుస్సు

**విశ్లేషణ**

# ఆధునిక తెలుగుకథ - బ్రిటిషు పాలన ఆర్థిక దోపిడీ

**- జయంతి పాపారావు**
**0891-2557961**

***ఈ అంశం మీద పది, పన్నెండు కథలు మాత్రమే వచ్చినట్లు తెలుస్తుంది. బ్రిటిషుపాలనలో ఎంత తీవ్రమైన దోపిడీ జరిగిందో, ఎంత హింసాత్మకమైన దోపిడీ జరిగిందో- అంతకంటే తీవ్రమైన, అంతేకాకుండా అంతకంటే హింసాత్మకమైన దోపిడీ ఇప్పుడూ జరుగుతోంది. మేధావర్గం దాన్ని గుర్తించి, విశ్లేషించి, ప్రజల ముందు పెట్టడం లేదు! ఆర్థిక శాస్త్ర నిపుణులు మౌనంగా మునుల్లా జీవిస్తున్నారు! ఇదో విషాద చరిత్ర,***



**భా**రతదేశపు ఆర్థిక హీనస్థితికి బ్రిటిషు పాలనే కారణమన్న వాస్తవాన్ని భారత మేధావివర్గం గుర్తించారు. అదే జాతీయోద్యమానికి పునాది. బ్రిటిషు పాలన భారతదేశ సంప్రదాయక ఆర్థిక వ్యవస్థను నాశనం చేసింది. స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్తను విధ్వంసం చేసింది. భారతదేశపు వనరులు కొల్లగొట్టి, దేశ సౌభాగ్యాన్ని మూటగట్టుకు పోయారు. ఆ లక్ష్యంతోనే దరిదాపుగా 200 సంవత్సరాలు (1750 - 1947) పరిపాలించారు. దోపిడీ క్రమం గురించి నాలుగు మాటలు మాట్లాడుకుందాం.

**చేతి వృత్తులు :**

చేతి వృత్తులను పథకం ప్రకారం విధ్వంసం చేశారు. నూలు – పట్టు – ఊలు – చేనేత పరిశ్రమ – ఇనుములోహాలు– గ్లాసు– కాగితం – కుండలు – నూనె – తోలు– అద్దకం– మున్నగు చేతివృత్తులు విధ్వంసం చేసారు. వాళ్ళకు అతి తక్కువ కూలి ఇచ్చి, కూలీలుగా మార్చి వాళ్ళ పరిశ్రమల్లో పని చేయించుకున్నారు. మన దేశానికి దిగుమతి చేసే సరుకులమీద సుంకాలు లేకుండా చేసి, మన వస్తువుల మీద భారీగా సుంకాలు విధించి మన ఆర్థిక వ్యవస్థను పతనం చేశారు. మిల్లులు పలు యంత్రాలతో తయారు చేసిన వస్తువులను మన మార్కెట్లలో ముంచెత్తారు. మన వస్తువులకు యూరోప్ దేశాల్లోనూ, ఇతర దేశాల్లోనే కాకుండా, మనదేశంలో కూడా మార్కెట్లు లేకుండా చేశారు. ఆ విధంగా మన ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు.

**వ్యవసాయం :**

ప్రభుత్వం–జమీందారు–భూస్వామి భూమి శిస్తు ఆక్రమంగా అపరిమితంగా పెంచేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. రైతుల చేత వెట్టి చాకిరీ చేయించుకున్నారు. పండిన పంటలో సగం భూమి శిస్తుగా పెంచేశారు. అయితే భూమిని బాగుచేసి, సారవంతం చేసే పనులుకానీ, నీటి సదుపాయం మున్నగు సదుపాయాలు కానీ ఏ మాత్రం చేయలేదు. వీలైనంత కొల్లగొట్టడమే లక్ష్యంగా, క్రూరంగా రైతులను పీడించారు. శిస్తులు చెల్లించలేని రైతుల భూములను అక్రమంగా అమ్మేస్తూ ఉండేవాళ్లు, లేదా రైతే భూమిని అమ్మేసి శిస్తులు చెల్లించేవారు. భూమి కోల్పోడం ఇష్టంలేని రైతులు వడ్డీవ్యాపారస్థుడి నుండి విపరీతమైన ఎక్కువ వడ్డీ రేటుకి అప్పులు తెచ్చి శిస్తులు చెల్లించేవాళ్లు. ఆ అప్పులు అక్రమంగా దొంగలెక్కలతో

పెరిగిపోతూ ఉండేవి. ఆ భూమి ఆఖరికి ఆ వడ్డీ వ్యాపారస్థుడి చేతుల్లోకి పోయేది. బ్రిటిషు పాలకులు భూమి బదలాయింపు ప్రవేశపెట్టి, భూస్వామికీ, వడ్డీ వ్యాపారికి మేలు జరిగేటట్టు చేశారు. ఆ విధంగా రైతు అప్పుల్లో కూరుకుపోయారు. పేదరికంలో మునిగిపోయాడు. భూమిని కోల్పోయాడు. వెట్టి చాకిరీ కూలీగానో, చాలా తక్కువ కూలి దొరికే కూలీగానో మార్చివేయబడ్డాడు. కొందరు పారిశ్రామిక కూలీలుగా మారిపోయారు. రైతులు లక్షల సంఖ్యలో ఆకలి చావులకు బలైపోయారు. పన్ను భారం మొత్తం రైతు నెత్తి మీదే మోపారు. ప్రభుత్వం ఏ మాత్రం వ్యవసాయం కోసం ఖర్చుపెట్టలేదు. అంతేకాకుండా, జమీందార్లు – కొత్తతరం భూస్వాములు కౌలుదారులు– ఉపకౌలుదారులు– ఆ విధంగా భూమి చిన్నచిన్న ముక్కలుగా చీలిపోయింది. వ్యవసాయం – రైతు – పతనదశలో హీనస్థితిలో పడిపోయింది.

***బ్రిటిషు పాలన ప్రవేశపెట్టిన పారిశ్రామికీకరణ వల్ల భారత ఆర్థిక వ్యవస్థలో జరిగిన అభివృద్ధి కానీ, సమాజంలో జరిగిన మేలు కానీ ఏమీలేదు. అది మన సహజ వనరులను కొల్లగొట్టడానికి, మనకార్మికులను బానిసలుగా మార్చి శ్రమ శక్తిని నిలువుదోపిడీ చెయ్యడానికే పరిమితమైపోయింది.***

**పరిశ్రమలు :**

భారతదేశంలో యంత్రాల ఆధారంగా భారీ పరిశ్రమలు 19వ శతాబ్ది రెండో భాగంలో ప్రారంభమయ్యాయి. 1850 ప్రాంతంలో నూలు, బట్టలు, జనపనారమిల్లులూ, గనుల నుంచి బొగ్గు తవ్వి తీసే పరిశ్రమలూ ప్రారంభమయ్యాయి. యంత్ర యుగం ప్రారంభమయింది. కౌస్జీ నానాభాయ్ 1853లో బొంబాయిలో మొట్టమొదటి బట్టల మిల్లు నెలకొల్పాడు. అలాగే మొట్టమొదటి జనపనార మిల్లు 1855లో బెంగాల్‌లోని రిష్రాలో నెలకొల్పబడింది. 1879లో 56 బట్టల మిల్లులు పనిచేశాయి. 1882లో 20 జనపనార మిల్లులు పనిచేశాయి. 1901 నాటికి 36కి పెరిగింది. 19వ శతాబ్ది రెండో భాగంలో ప్రారంభమైన యంత్ర ఆధారపరిశ్రమలు 20వ శతాబ్ది రెండో భాగంలో అభివృద్ధి చెందాయి. ప్రత్తి నుంచి గింజల్ని వేరు చేసే యంత్రాలు, బియ్యం మిల్లులు, పిండిమరలు, కలప కోత మిల్లులు, తోళ్లను శుభ్రపరిచే మిల్లులు, కాగితం మిల్లులు, పంచదార మిల్లులు, ఇనుము ఉక్కు పరిశ్రమలు, ఉప్పు పరిశ్రమ, ఖనిజ పరిశ్రమలు, సిమెంటు గ్లాసు పరిశ్రమలు ఆ విధంగా పారిశ్రామికీకరణ ప్రారంభమయ్యి నత్త నడకన ముందుకు సాగింది.

ఈ పరిశ్రమల్లో ఎక్కువ భాగం బ్రిటిషు పెట్టుబడిదారీ వర్గానికి చెందినవే. కొద్ది పరిశ్రమలు భారతపెట్టుబడిదారీ వర్గానికి చెందినవే అయినా, అవి కూడా బ్రిటిషు వారి పెత్తనం కిందే సాగాయి. మేనేజింగ్ ఏజెన్సీలు శాసించాయి. రుణాలు ఇవ్వడంలో పన్నులు సుంకాలు విధింపులో భూమి మున్నగు సదుపాయాలు కల్పించడంలో, మార్కెట్లను ఏర్పరచడంలో, అప్పులు మీద వడ్డీ రేట్లలో, రవాణా సౌకర్యాలు ఏర్పరచడంలో, బ్రిటిషు ప్రభుత్వం వివక్ష చూపి, విదేశీ పెట్టుబడిదార్ల కొమ్ముకాసి, భారత పెట్టుబడిదార్లను అణగదొక్కింది. అంతేకాకుండా, నీలిమందు తయారు, కాఫీతో తోటలకు సంబంధించిన పరిశ్రమలన్నీ బ్రిటిషువాళ్లవే. భారత కార్మికులను నిలువుదోపిడీ చేసి, భారీ ఎత్తున లాభాలు కొల్లగొట్టారు. భారత కార్మికులను బానిసల స్థాయికి దిగజార్చారు. ప్రారంభదశలో నున్న పరిశ్రమలకు సుంకాల రూపంలో రక్షణ కల్పించలేదు. ఏ విధమైన ఆర్థిక సాయం చేయలేదు. పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన సాంకేతిక విద్యాభివృద్ధికి కృషి చేయలేదు. పారిశ్రామికాభివృద్ధి నిరాశ జనకంగా సాగింది. బ్రిటిషు పాలన ప్రవేశపెట్టిన పారిశ్రామికీకరణ వల్ల భారత ఆర్థిక వ్యవస్థలో జరిగిన అభివృద్ధి కానీ, సమాజంలో జరిగిన మేలు కానీ ఏమీలేదు. అది మన సహజ వనరులను కొల్లగొట్టడానికి, మనకార్మికులను బానిసలుగా మార్చి శ్రమ శక్తిని నిలువుదోపిడీ చెయ్యడానికే పరిమితమైపోయింది. దానివల్ల బ్రిటిషు వాళ్లే బాగుపడ్డారు. భారత పెట్టుబడిదారీ వర్గానికి చెందిన పరిశ్రమలు అభివృద్ధి కాకుండా, ఆర్థిక అణచివేత విధానాలు అమలు జరిపారు. వాటి ఉత్పత్తులకు మార్కెట్లు లేకుండా చేశారు.

**పొరుగు రాజ్యాలతో యుద్ధాలు :**

యూరప్‌లోని ప్రతి సామ్రాజ్యవాద దేశం 19, 20 శతాబ్దాల్లో మూడు ప్రధాన లక్ష్యాలతో యుద్ధాలు చేశాయి. 1. దురాక్రమణ చేసి సాధించుకున్న వలస రాజ్యాధికారం నిలబెట్టుకోవడం. 2. సామ్రాజ్య విస్తరణ. 3. వాణిజ్య విస్తరణ. బ్రిటిషు సామ్రాజ్యం కూడా అవే లక్ష్యాలతో పొరుగు రాజ్యాలతో యుద్ధాలు చేసింది. యూరప్‌లోని ఇతర సామ్రాజ్యవాద దేశాలు

వాటిని దురాక్రమణ చేయకుండా, ముందుగానే బ్రిటిషు సామ్రాజ్యం దురాక్రమణ ప్రారంభించింది.

1814లో నేపాల్‌తో యుద్ధం చేసింది. 1815, 1816లో జరిగిన యుద్ధాల్లో బ్రిటిషు సామ్రాజ్యం విధించిన షరతులకు లొంగిపోయింది. శాంతి సంధి చేసుకుంది. ఆ విధంగా బ్రిటిషు ఇండియా సామ్రాజ్యం హిమాలయాలకు చేరుకుంది. బర్మాలో 1824, 1852, 1885ల్లో మూడు యుద్ధాలు చేసింది. 1885 యుద్ధంలో బర్మా లొంగిపోయింది. అయితే బర్మాలో సాగుతున్న ప్రజల స్వాతంత్ర్య పోరాటాన్ని బలహీనపరచడానికి 1935లో బర్మాను భారతదేశం నుండి విడగొట్టింది. ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు యుద్ధాలు చేసింది. 1921లో శాంతి సంధి కుదిరింది. టిబెట్, 17వ శతాబ్ది ప్రారంభం నుంచి చైనా నామమాత్ర సార్వభౌమాధికారాన్ని గుర్తించింది. 1907లో బ్రిటన్, రష్యాలు టిబెట్‌పై చైనా ఆధిపత్యాన్ని అంగకరించాయి. అయితే ఆ రెండు దేశాలు కూడా అవకాశం కోసం కన్నేసే ఉంచాయి. సిక్కిం 1890లో బ్రిటిషువారి రహిత రాజ్యం అయింది. భూటాన్ 1865లో పాక్షికంగా బ్రిటిషు సామ్రాజ్యానికి వశమైపోయింది.

ఆ విధంగా బ్రిటిషు వాళ్లు సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు. ఆ విధంగా తన సామ్రాజ్య వాద ప్రయోజనాల కోసం మన దేశాన్ని బలిపశువును చేసింది. ఆ యుద్ధాల ఖర్చుని భారతదేశం నెత్తిన రుద్దింది. భారత ప్రభుత్వ ఆదాయంలో సగం కంటే ఎక్కువ భాగం సైనిక ఖర్చులకే అయిపోయింది. 1904లో లెక్క ప్రకారం, ఆదాయంలో 52 శాతం సైనిక ఖర్చే అయిపోయింది. జరిగింది బ్రిటిషు సామ్రాజ్య విస్తరణ, వాళ్ల ప్రయోజనాలు! ఖర్చు భారతదేశానిదీ! వేలాది మంది భారత సైనికులు మరణించారు. సైనిక ఖర్చు వల్ల, భారతదేశంలో పేదరికం పెరిగిపోయి, ఆకలి చావులకు దారితీసింది.

**మొదటి ప్రపంచ యుద్ధం (1914 - 1918) :**

మొదటి ప్రపంచ యుద్ధం 1914, జూన్‌లో మొదలయి, 1918 నవంబరులో ముగిసింది. గ్రేట్ బ్రిటన్, ఇటలీ, రష్యా, జపాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఒకవైపు. జర్మనీ, ఆస్ట్రియా, హాంగరీ, టర్కీ మరోవైపు. భారతదేశం తమ సొంత దేశం అయినట్లు భారత జాతీయ నాయకులకూ, ప్రజలకూ చెప్పకుండా భారత సైన్యాలను రహస్యంగా యుద్ధ రంగంలోకి తరలించి, భారతదేశం యుద్ధంలో ఉన్నట్లు బ్రిటిషు ప్రభుత్వం ప్రకటించింది. దొంగిలించిన ధనం పంపకాల్లో దొంగల మధ్య కొట్లాట జరిగినట్లు, దురాక్రమణ చేసిన వలస రాజ్యాల పంపకాల్లో సామ్రాజ్యవాద దేశాల మధ్య ఈ యుద్ధం జరిగింది. బ్రిటన్‌కి యుద్ధంలో సహకరిస్తే, అది కృతజ్ఞతతో భారత దేశానికి స్వపరిపాలన ఇస్తుందని జాతీయ నాయకులు నమ్మి, బ్రిటన్‌కు దన్నుగా నిలిచారు. భారత సైన్యం బ్రిటన్ పక్షంగా యుద్ధంలో పాల్గొంది. ఈ సామ్రాజ్యవాద దేశాలు తమ వలసలనూ, ప్రయోజనాలనూ కాపాడుకోవడానికే ఈ యుద్ధం చేస్తున్నామని మన జాతీయ నాయకులు గుర్తించినట్లు కనబడదు. యుద్ధం ముగిసాక, భారతజాతీయ నాయకులూ, ప్రజలూ ఆశించినట్లు స్వపరిపాలన ఊసే లేకపోగా, పౌరహక్కులను హరించే రౌలట్‌చట్టం 1919 మార్చి 18న అమల్లో పెట్టారు. చరిత్రలో మిగిలిపోయే బ్రిటన్ విద్రోహాల్లో ఇది కూడా ఒకటిగా పరిగణింపబడింది. ఈ చట్టం అమానుషమైన అణచివేతకూ, రక్తపాతానికి దారితీసింది. ఈ యుద్ధం భారతదేశంలో కరువుకు దారి తీసింది. లక్షల్లో ప్రజలు ఆకలిచావులు చచ్చారు.

> ***1904లో లెక్క ప్రకారం, ఆదాయంలో 52 శాతం సైనిక ఖర్చే అయిపోయింది. జరిగింది బ్రిటిషు సామ్రాజ్య విస్తరణ, వాళ్ల ప్రయోజనాలు! ఖర్చు భారతదేశానిదీ! వేలాది మంది భారత సైనికులు మరణించారు. సైనిక ఖర్చు వల్ల, భారతదేశంలో పేదరికం పెరిగిపోయి, ఆకలి చావులకు దారితీసింది.***

**రెండో ప్రపంచయుద్ధం (1939-1945) :**

ఈ యుద్ధం 1939 సెప్టెంబర్‌లో ప్రారంభమయింది. నాజీజర్మనీ పోలండు మీద దండెత్తింది. అంతకు ముందే హిట్లర్ 1938లో ఆస్ట్రియాను, 1939లో చెకోస్లోవియాను ఆక్రమించాడు. హిట్లర్‌తో మంచి సంబంధాలు పెట్టుకోవడం కోసం బ్రిటన్, ఫ్రాన్స్ పోలండుకి సాయం చేయడానికి యుద్ధంలోకి దిగాయి. జాతీయ కాంగ్రెస్‌తో కానీ, కేంద్ర శాసనసభ సభ్యులతో కానీ చెప్పకుండా, బ్రిటిషు సామ్రాజ్యం బ్రిటిషు ఇండియాను యుద్ధంలోకి దింపింది. జాతీయ కాంగ్రెస్ వ్యతిరేకించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించమని కోరింది. గాంధీజీ 1940, అక్టోబర్‌లో పరిమిత సత్యాగ్రహానికి పిలుపునిచ్చాడు. ఆ సందర్భంలో వైస్రాయికి ఒక లేఖ రాశాడు.

"...భారత ప్రజానీకంలో అత్యధిక భాగానికి మీ యుద్ధ కృషిలో ఎటువంటి ఆసక్తి లేదు. నాజీయిజానికి – ఇండియాను పాలించే రెట్టింపు స్థాయిలోనున్న బ్రిటిషు నిరంకుశత్వానికీ మధ్య వాళ్ళు తేడా చూడరు...." అని రాశాడు. ఈ యుద్ధం భారతదేశంలో తీవ్ర ఆర్థిక పవనాన్ని సృష్టించింది. 1943లో బెంగాల్లో భయంకరమైన కరువు ఏర్పడింది. 30 లక్షల మందికి పైగా ఆకలితో ప్రాణాలు కోల్పోయారు.

**పేదరికం – ఆకలి చావులు :**



బ్రిటిషు పాలకుల దోపిడీ విధానాల వల్ల ప్రజలకు బతుకుదెరువు కరువయింది. ఆ కరువు దుర్భర పేదరికానికీ, ఆకలి చావులకూ దారి తీసింది. మన దేశంలోని సంప్రదాయ ఆర్థిక వ్యవస్థ విధ్వంసమైపోయింది. పన్నుల భారం పెరిగిపోయింది. ప్రభుత్వం, జమిందార్లు, భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, వర్తకులు రైతుని దోపిడీ చేయడం వల్ల వ్యవసాయ వ్యవస్థ పతనమైపోయింది. యుద్ధాలు మన ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేశాయి. ఆ విధంగా ఎన్నెన్నో కారణాల వల్ల ప్రజలు దుర్భర పేదరికంలోకి నెట్టివేయబడ్డారు. ఆకలి చావులకు దారి తీసింది. కరువువల్ల 1860–61లో రెండు లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 1865–66లో 20 లక్షల మంది, 1868–70లలో 14 లక్షల మంది, ఆకలి చావులకు బలైపోయారు. కొన్ని సంస్థానాల్లో నూటికి ముప్పయి మందికి పైగా ఆకలివల్ల మరణించారు. 1876–78లో 55లక్షల మంది మరణించారు. మైసూరు జనాభాలో అయిదో వంతు మరణించారు. 1896–1900లలో 70లక్షల మంది రాలిపోయారు. కోట్లాదిమంది కరువు బారినపడి పడరాని కష్టాలు పడ్డారు. 1854–1901 మధ్యకాలంలో 2 కోట్ల, 88 లక్షల 25వేల మందికి పైగా మరణించినట్లు లెక్క తేల్చారు. 1943లో బెంగాల్లో 30లక్షల మంది మరణించారు. ఇంత అమానుషమైన ఆర్థిక దోపిడీ ప్రపంచ చరిత్రలో మరెక్కడా కనిపించదు! జాతీయోద్యమ అణచివేతలో బ్రిటిషు వాళ్లు కాల్చి చంపిన, గాయపరిచిన ప్రజల సంఖ్య లక్షల్లో ఉంటుంది.!

**ప్రముఖుల కొన్ని వ్యాఖ్యానాలు :**

అమెరికన్ రచయిత, డి హెచ్. బుఖనన్ "బైటి ప్రపంచంతో సంబంధం లేకుండా వేరుగా ఉన్న స్వయం సంపూర్ణ గ్రామ కవచాన్ని ఉక్కు పట్టాలు తూట్లు పొడిచాయి. వాటి జీవరక్తం కారిపోయింది."

గవర్నర్–జనరల్ విలియం బెంటింక్ 1834–35లో ఒక నివేదికలో ఇలా పేర్కొన్నాడు. "ఇటువంటి దైన్యస్థితికి వాణిజ్య చరిత్రలో ఎక్కడా పోలిక దొరకదు. చేనేత పనివాళ్ల ఎముకల్తో భారత మైదాన సీమలు తెల్లబారిపోయాయి."

గవర్నర్–జనరల్ కారన్ వాలిస్, "బెంగాల్లో మూడోవంతు క్రూరమృగాలు సంచరించే అరణ్యంగా మారిపోయింది.

బిషప్ హెబర్ 1826లో ఇలా అన్నాడు. "భారతదేశంలో కానీ, యూరప్‌లో కానీ ఇప్పటి పన్ను రేటు తట్టుకుని రైతు పైకి రాగలడని నేననుకోను. పంటలో సగం ప్రభుత్వమే డిమాండు చేస్తోంది... మనం విధించినంత భూమి శిస్తు ఏ స్వదేశరాజు కూడా విధించలేదనేది వాస్తవం."

గవర్నర్–జనరల్ సలహా మండలి సభ్యుడు, చార్లెస్ ఇవియట్ ఇలా అన్నాడు. "వ్యవసాయం మీద జీవించే ప్రజల్లో సగం మంది ఏడాది మొత్తంలో కడుపు నిండా భోజనం అంటే ఏమిటో ఎరగరని చెప్పడానికి నేను వెనకాడను."

ఇంపీరియల్ గజెట్ సంకలన కర్త విలియం పాంటర్ ఇలా అన్నాడు. "భారత దేశ జనాభాలో నాలుగు కోట్ల మందికి అర్ధాకలితో బతుకు వెళ్లబుచ్చటం అలవాటు."

భారత వర్తక మండలి అధ్యక్షుడు, ఎం.ఎ.మాష్టరు 1945లో ఇలా వ్యాఖ్యానించాడు. "భారతదేశం పారిశ్రామికంగా అభివృద్ధి కాకపోయినా సరే, కొత్త తూర్పు ఇండియా కంపెనీలు మళ్లీ ఈ గడ్డమీద వేళ్లూనటానికి అనుమతించకూడదు. ఇవి భారతదేశ ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రతికూలంగా పనిచెయ్యడమే కాకుండా, రాజకీయ స్వాతంత్ర్యం రాకుండా గట్టిగా అడ్డుకుంటాయి.

జాతీయోద్యమ నిర్మాతల్లో ఒకరైన సురేంద్రనాథ్ బెనర్జీ ఆనాటి పరిస్థితిని ఇలా వర్ణించాడు. "బార్డ్‌విట్టన్ అభివృద్ధి

నిరోధక పరిపాలన నిర్లిప్తంగా ఉండిపోయిన ప్రజల్ని మేల్కొల్పింది. ప్రజా జీవితంలో చురుకుపుట్టించింది. రాజకీయంగా అభివృద్ధి చెందే పరిణామంలో చెడుపాలన కూడా ఒక పరోక్షలాభం. దుష్టపాలకులు సమాజానికి కదలిక, చైతన్యం కలిగిస్తారు. సంవత్సరాల తరబడి పాటు పడ్డా బహుశా ఆ ఫలితం దొరకదు."

భారతదేశంలో ఆస్తికీ ప్రాణానికి బ్రిటిషు పాలన వల్లే భద్రత చేకూరిందని బ్రిటిషుపాలకులు ప్రచారం చేసుకుంటూ ఉండేవాళ్లు. భారతదేశ మొట్టమొదటి ఆర్థిక శాస్త్రవేత్త, జాతీయ నాయకుడు దాదా భాయ్ నౌరోజీ ఆ సందర్భంలో ఇలా వ్యాఖ్యానించాడు. "... బ్రిటిషు కబంధ హస్తాల నుంచి భారతదేశంలో ఆస్తికి రక్షణలేదు. తద్వారా ప్రాణానికి భద్రత కాదు. భారతదేశ సంపదకు భద్రత లేదు. ఏది భద్రంగా, కడు భద్రంగా ఉందంటే, ఇంగ్లండు కడుపులో నీళ్లు కదలకుండా క్షేమంగా భద్రంగా ఉంది. భారతదేశం నుండి సంపదని తరలించుకుపోవడానికీ, ఇక్కడ కూర్చుని తేరగా మెక్కడానికి ఇంగ్లండుకు సంపూర్ణ భద్రత ఉంది. ఏటా భారతదేశపు ఆస్తిని మూడు, నాలుగు కోట్ల పౌండ్ల వంతున కొల్లగొట్టుకుపోవడానికి భద్రత ఉంది. కాబట్టి, భారతదేశంలో ఆస్తికి, ప్రాణానికి భద్రత లేదని మనవి చెయ్యడానికి సాహసిస్తున్నాను. భారతదేశంలో కోట్లాది ప్రజలకు జీవితం అంటే అర్ధాకలి పస్తులు, కరువులు, రోగాలు.." అంతేకాకుండా, ఈ విధంగా కూడా అన్నారు. "... ప్రజల జీవనాధారం తన్నుకు పోతున్నారు. కానరాకుండా, చప్పుడు కాకుండా, అతి గోప్యంగా ప్రజలు పస్తులు పడి ఉండటానికి శాంతి ఉంది. పస్తుల్లో చావడానికి శాంతి ఉంది. శాంతి భద్రతల కేం భేషుగ్గా ఉన్నాయ్!" ఆ విధంగా పలువురు ప్రముఖులు బ్రిటిషు పాలనలోని క్రూరమైన ఆర్థిక దోపిడీని, దానివల్ల ఏర్పడ్డ దుర్భరమైన ఆర్థిక దుస్థితిని, అమానుషమైన ఆర్థిక హింసనూ తమ వ్యాఖ్యానాల్లో అద్దంలో చూపించినట్లు చూపించారు.

***పలువురు ప్రముఖులు బ్రిటిషు పాలనలోని క్రూరమైన ఆర్థిక దోపిడీని, దానివల్ల ఏర్పడ్డ దుర్భరమైన ఆర్థిక దుస్థితిని, అమానుషమైన ఆర్థిక హింసనూ తమ వ్యాఖ్యానాల్లో అద్దంలో చూపించినట్లు చూపించారు.***

ఈ అంశాలపై వచ్చిన ఆనాటి కొన్ని కథలను ఇప్పుడు విశ్లేషించుకుందాం.

**వంశాపావనుడగు తనయుడు** - రచయిత పేరు ప్రచురించలేదు. (ఆంధ్రపత్రిక - సంవత్సరాది సంచిక - 09-04-1913).

ఆనాటి మన రాజ వంశీయులను, జమిందారులను బ్రిటిషుపాలకులు ఏ విధంగా వ్యసనాలకు బానిసలుగా చేసి దోపిడీ చేశారో ఈ కథ చిత్రించింది. బొంబాయిలో పేరు పొందిన హోటల్లో మద్యపానం మున్నగు వ్యసనాలకు రాజవంశీయులు జమీందారులు బలైపోయారు. మన ధనం గిన్నెల్లో బ్రిటీషు సామ్రాజ్యం చేతుల్లోకి ప్రవహిస్తూ ఉండేది. దినకరరావు రాజవంశీయుడు. ఆ వంశం జాగీరులన్నీ దోపిడీకి గురైపోగా, బ్రిటిషువాళ్లు దినకరరావుకి సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం ఇచ్చారు. డబ్బు లేకపోయినా, అతడు లేనిపోని దర్పం, దాబుదంబమూ ప్రదర్శిస్తూ వ్యసనపరుడిగా జీవిస్తాడు. అప్పుల్లో కూరుకుపోయాడు. తల్లి పేదరికంలో అద్దె కొంపలో జీవిస్తుంది. ఆమె ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక, తప్పని పరిస్థితుల్లో - ఆ రాజ వంశ వీరాగ్ర గణ్యుల ఖడ్గాన్ని బంగారపు పుంత, కెంపులూ ఉన్న ఖడ్గాన్ని అమ్మేసి అప్పుతీరుస్తుంది. ఆ ఖడ్గాన్ని అమ్మినవైనం, సన్నివేశం, ఆమె మనోవేదనా, ఆనాటి విషాద చరిత్రను మనకళ్లముందు కదిలేలా చేస్తుంది. బ్రిటిషు పాలన దోపిడీకి ఈ కథ అద్దం పడుతుంది.

**పనిలేని న్యాయవాది** ఒ.సీతారామచంద్రరావు (సుజాత-మాసపత్రిక-సెప్టెంబర్, 1929).

హింసాత్మకమయిన ఆర్థిక పతనం వల్ల విద్యావంతులయిన మధ్య తరగతి కుటుంబాలు కూడా ఏ విధంగా ఆర్థిక ఇబ్బందులకు బలైపోయారో ఈ కథ హాస్యవ్యంగ్యధోరణితో అత్యంత వాస్తవికంగా చిత్రించింది. సహాయనిరాకరణ ఉద్యమకాలంలో (1920) పెద్ద న్యాయవాదులు ఉద్యమంలో పాల్గొనడం వల్ల చిన్న న్యాయవాదులకు కాస్తపని దొరికింది. అయితే అది కూడా ఎంతో కాలం కొనసాగలేదు. ఈ కథలోని పనిలేని న్యాయవాది ఏదో మందుల షాపు పెట్టుకుంటే, న్యాయమూర్తి అతడ్ని న్యాయవాద వృత్తినుంచి తొలగించాడు. ఆ విధంగా ఎన్నో

ఇబ్బందులకు గురి అయ్యాడు. విద్యావంతులయిన మధ్య తరగతి కుటుంబాలే ఆ విధంగా ఇబ్బందులకు బలైపోతే, దిగువ వర్గ ప్రజల జీవితం మరీ ఎంత దుర్భరంగా విషాదంగా ఉండేదో, ఈ కథ ఆలోచింపజేస్తుంది.

**డిప్రెషన్ చెంబు : వేలూరి శివరామశాస్త్రి** (కథాభారతి – సంపుటి – 1985) :

విద్యావంతులయిన మధ్య తరగతి కుటుంబాలు కూడా చెంబుపట్టుకుని బిచ్చమెత్తుకునీ క్రూరమైన పేదరికానికే, ఆర్థిక హింసకూ ఏ విధంగా బలైపోయాయో ఈ కథ విశ్లేషించింది. రామారావుకి లిటరేచర్ ఆనర్సు ఫస్టుగా పాసయినా, తగిన ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగానికి అప్లికేషన్లు పెట్టుకోడానికీ, కుటుంబం అర్ధాకలితో నైనా బతకడానికీ అతనితల్లి కాలి మెట్టెలూ, మంగళసూత్రం కూడా అమ్మడానికి ఇచ్చేసింది. భార్య నగలు కూడా అమ్మేశాడు. ఆరోజు ఇంట్లో తిండి గింజలు లేవు. స్నేహితుల్ని అడిగి, అప్పుతెచ్చి, తిండిగింజలు తేవాలనుకున్నాడు. అందరి పరిస్థితీ అదే దుస్థితిలో ఉంది. ప్రిన్సిపాల్ అంబుజం ఇంటికి వెళ్లాడు. ఒక ట్యూటర్ పోస్టుకి 200 అప్లికేషన్లు నెలకి రూ. 40 జీతానికి వచ్చాయనీ, అంతకంటే తక్కువ జీతానికి ఒప్పుకుంటే, ఆ ఉద్యోగం ఇస్తానంటుంది. అంతలో రామారావు భార్య, డిప్రెషన్–చెంబు– మిసెస్ రామారావు ద్వివేది – బి.ఎ.ఆనర్స్– అని తారుతో రాసిన రాగిచెంబుపట్టుకుని, ఆ గుమ్మందగ్గర నిలబడి బిక్షాందేహి అని అరుస్తుంది. ఆమెతో పాటు, రామారావు చెల్లెలు, తమ్ముళ్లూ కూడా బిక్షాందేహి అని కేకవేస్తారు. కథ ముగుస్తుంది. విద్యావంతులయిన మధ్యతరగతి కుటుంబాలే అంతదారుణంగా బాధలు పడుతున్నప్పుడు దిగువవర్గ ప్రజల జీవితం మరీ ఎంత క్రూరమైన హింసకు బలైపోయిందో అని ఈ కథ కదిలిస్తుంది.

**ఒకటే చీర – వేలూరి శివరామశాస్త్రి** (కథాభారతి – సంపుటి – 1985) :


ఆ బస్తీలో నాగరాజు గొప్పధనవంతుడు. భూములు–భవనాలు–మిల్లులు–మున్నగునవి బాగా ఉన్నవారు. బస్తీ అంతా నాగరాజుదే అన్నంత ధనవంతుడతడు. పేదలు ఆకలితో మలమలమాడు తున్నారని నాగరాజు నూకల జావ పేదలకు ఏర్పాటు చేశాడు. ఆ గుంపులో తన మిల్లులో పనిచేయుచున్న కూలీ మాతరమ్మను చూశాడు. ఆమె మంచి చీరకట్టుకొంది. ఆ తరువాత కొంత సేపు పోయాక, అదే చీరలో మరొక ఆమెను చూశారు. అసలు విషయం తెలుసుకున్నాడు. ఆ పాత చీరను నాగరాజు భార్య ఆమెకిచ్చింది. అదొక్కటే చిరుగులు లేని మంచి చీర. అందువల్ల అత్తా–కోడలూ–ఒకరి తరువాత మరొకరు అదే చీరను వీధిలోకి వెళ్లినప్పుడు కట్టుకుంటారని తెలుసుకున్నాడు. ఇంటిలో ఉన్నప్పుడు చిరుగుల చీరలు కట్టుకుంటూ రోజులు గడుపుతారు. పేదల జీవితం ఎంత దుర్భరంగా, ఎంత హింసాత్మకంగా ఉండేదో ఈ కథ చిత్రించింది. పేదరికంలో హింసాత్మకమైన ఆకలి బాధలేకాదు, అవమానాలు కూడా ఎన్నో ఉంటాయని ఈ కథలో తెలుస్తుంది.

సెట్టి ఈశ్వరరావు రచించిన బాంబులు పడ్డనాడు, క్రొవ్విడి లక్ష్మన్న రచించిన విజయోత్సవము, పెమ్మరాజు రాజగోపాలం రచించిన – అక్రమ విభాగం, చింతల పాటి శ్రీరాములు రచించిన –అవి యుద్ధపు రోజులు, మున్నగు కొన్ని కథలు ఈ అంశం మీద వచ్చాయి. ఈ అంశం మీద పది, పన్నెండు కథలు మాత్రమే వచ్చినట్లు తెలుస్తుంది. బ్రిటిషుపాలనలో ఎంత తీవ్రమైన దోపిడీ జరిగిందో, ఎంత హింసాత్మకమైన దోపిడీ జరిగిందో– అంతకంటే తీవ్రమైన, అంతేకాకుండా అంతకంటే హింసాత్మకమైన దోపిడీ ఇప్పుడూ జరుగుతోంది. మేధావర్గం దాన్ని గుర్తించి, విశ్లేషించి, ప్రజల ముందు పెట్టడంలేదు! ఆర్థిక శాస్త్ర నిపుణులు మౌనంగా మునుల్లా జీవిస్తున్నారు! ఇదో విషాద చరిత్ర, ముందు చెప్పుకున్న దాదాభాయ్ నౌరోజీవి ఇప్పుడూ వర్తిస్తాయి. ఈ దోపిడీని అడ్డుకోకపోతే, మనం స్వాతంత్ర్యాన్ని కోల్పోతాం. ఇప్పటికే కొంత కోల్పోయాం. ఆధునిక తెలుగు కథ ఎప్పటికప్పుడు సమాజస్థితి గతులనూ, ప్రజా సమస్యలనూ, ప్రజా ఉద్యమాలనూ కళాత్మకంగా, రసాత్మకంగా చిత్రిస్తూ, చారిత్రీకరిస్తూ, ముందుకి సాగుతూ వస్తుంది.

***ఈ దోపిడీని అడ్డుకోకపోతే, మనం స్వాతంత్ర్యాన్ని కోల్పోతాం. ఇప్పటికే కొంత కోల్పోయాం. ఆధునిక తెలుగు కథ ఎప్పటికప్పుడు సమాజస్థితి గతులనూ, ప్రజా సమస్యలనూ, ప్రజా ఉద్యమాలనూ కళాత్మకంగా, రసాత్మకంగా చిత్రిస్తూ, చారిత్రీకరిస్తూ, ముందుకి సాగుతూ వస్తుంది.***

## నచ్చిన రచన

# కవితా వసంతం





డా॥ బీరం సుందరరావు
9848039080


**మీ** రెప్పల మధ్య విప్పారిన ఆకాశంలో విహరించి "అలౌకిక" ఆనందం పొందాను. మీ గుండె చెట్టు మీద వాలిన కవిత్వం పిట్టల్ని, వాటి రెక్కల్ని మెత్తగా స్పృశించి అపూర్వమైన అనుభూతి చెందాను. అక్షరాల్లో కవి ఆరబోసిన కవితావసంతాన్ని వీక్షించి ఆనందపరవశుణ్ణయ్యాను. అపురూపమైన భావాలను అందమైన భాషలో పండించిన కవి రసరమ్య శిల్పానికి కవిగారి బంగారు కలానికి ఆర్ధ్రనయనాలతో అభినందనలు తెలుపుతున్నాను. హృదయ సంస్కారాన్ని, కవితా పారవశ్యాన్ని కలిపి సుమధుర సుందర, సుశబ్ధ శోభిత కవితగా మలిచే కవి నవనవోన్మేష ప్రతిభకు శుభాకాంక్షలు.

తిలక్‌లోని సౌందర్యాత్మకత, సంజీవదేవ్‌లోని రసాత్మకత ప్రకృతిలోని తాదాత్మ్యత, 'లలిత' కోమలమైన కవి సహృదయత అన్నీ కలిసి విప్పారిన ఇంద్రధనస్సులాంటి పరవశించిన కవితను చదివి, ఆస్వాదించి, ఆఘ్రాణించాలని పారవశ్యంతో రాస్తున్న అక్షరాలివి.

కవిత వెంట కవిత చదువుతూ వుంటే తండ్రి చిటికెన వేలు పట్టుకుని నడిచే పసిపిల్లాడిలా కవి కవితల వెంట పరుగులు తీశాను. పరవశించాను. ప్రవహించాను. పరిమళించాను. ప్రకాశించాను. నిజానికి– మంచి కవిత్వం చదివినప్పుడు కలిగే దివ్యానుభూతిని చాలాకాలం తర్వాత ''అలౌకికం'' అనే ఈ గ్రంథం నాకు అందించింది అందుక్కారణం– ప్రతికవితలోనూ, ప్రతి వాక్యంలోనూ, ప్రతి అభివ్యక్తిలోనూ కవి యెక్క సున్నితమైన హృదయస్పందన వుండటం వలన. అదే స్పందన నాలోనూ వుండటం వలన– 30 పేజీల కవిగారి కవితా ప్రపంచంలో ప్రయాణించాను. జీవితానికి వుండే భిన్న పార్శ్యాలను అభివ్యక్తం చేసేది. ప్రకృతిలోని పరిమళాన్ని ఆస్వాదింపజేసేది. ఫలదీకరణం చెందిన పుష్పంలా విప్పారి, మనస్సును సౌరభంతో నింపేది. పుస్తకాల బీరువా తెరిచినప్పుడు ఒకానొక సువాసన గుప్పుమంటూ ముక్కుపుటాలకు తగిలి, లోపలి ప్రపంచాన్ని ఆవిష్కరించేది. మంచు పత్రం మీద చేసిన ప్రబోధ సంతకంలా తళతళ మెరిసేది, చదివి, మూసేసిన తర్వాత, గుండె తెరిచి, మళ్ళీ మళ్ళీ చదవమని స్వాగతించేది ఉత్తమ కవిత్వమని నా అభిప్రాయం. ఈ లక్షణాలు అలౌకికం కవితల్లో ప్రతిఫలించాయి. ప్రతిబింబించాయి.

"జీవితాన్ని కాలంతో నింపేవాడు మనిషి/ కాలాన్ని జీవితంతో లిఖించేవాడు కవి

శరీరం హిమశిఖర వేదికయినప్పుడు/ చేతిలో కలం కవితా తాండవం చేస్తుంది.

లోపల పూచిన తంగేడు చెట్ల పూలను/ బాహ్యప్రపంచానికి చూపించిన (కవి) అక్షరగవాక్షాలని,

ఓ సరికొత్త కవిత్వ లోకాన్ని వీక్షించాను"

/..../

'నీ పరిమళ ప్రవాహరాగాలే/

మా సృజన, శాస్త్రం, కళలు, తత్త్వం / స్థితి, గతి, ప్రగతి – పురోగతి'

ఇక్కడ అద్భుతమైన క్రమాలంకారం కవితకు అందం ఇచ్చింది.

1. సృజన**(Creation)** స్థితికి సంబంధించింది. ఇది వైచిత్రికి సంబంధించింది.
2. శాస్త్రం**(Science)** గతికి సంబంధించింది.
3. కళలు – ప్రగతికి సూచకాలు
4. తత్త్వం – పురోగతి చిహ్నం.

అంటే స్థితి–గతి–ప్రగతి–పురోగతి క్రమము. ఇవి సృజన , శాస్త్రం, కళలు, తత్త్వం నుండి ప్రభవిస్తాయి.

ప్రగతి–పురోగతి రెండూ ఒకటి కాదు. ప్రగతి వర్తమాన సూచికం. పురోగతి భవిష్యత్తు సంకేతం.

కళలు వర్తమాన సమాజాన్ని ప్రతిబింబిస్తే, తత్త్వం – భవిష్యత్తు సమాజాన్ని నిర్మిస్తుంది.

చాలా గొప్ప భావన ఈ కవితలో పరుచుకుంది.

**"కన్నీటిచుక్కలో పారే కారుణ్యకిరణాలు**

**సృజనాకాశంలో కవిగాంచే ఇంద్రధనుస్సులు"**

కవిత్వం లోతు తెలిసిన కవి మాత్రమే ఇలాంటి పంక్తులను రాయగలడు.

కవి అన్నది నిజం

**కవిత్వం అంత తేలిగ్గా వరించే వస్తువుకాదు / అది కలంతో సాము, హలంతో సాము**

**కోలాహలంతో సాము, హాలహలంతో సాము / కనుకనే కవిత్వం సామాజిక రక్షాకవచంగా నిలుస్తుంది.**

కొన్ని చోట్ల గురువుగారు సంజీవదేవ్ పాదాక్రమం చేశారు.

**"అందరూ చూస్తారు – చదువుతారు పత్రికలు"**

**"వరికుప్పలు/ వూరివెలుపల/ దేవుడి గుళ్ళు"** అన్న అందమైన హైకూలో ప్రాంతీయాభిమానం, ప్రకృతి ఆరాధన, సంక్షిప్తీకరణ మూడుపాదాలు సమన్వయపరిచాయి. వరికుప్పల్ని దేవుడి గుళ్ళు అని అభివర్ణించడం నవీనదృష్టి, నవీన సృష్టికి నిదర్శన.

**"ఎన్నెన్ని చిగురుటాకుల బాల్యాన్ని పాతిపెడితే/ మీ ఇంట ఇంద్రధనస్సులు పుష్పిస్తున్నాయి.**

**"మనిషే మార్కెటవుతున్న జ్ఞానోదయం/ "రాలుతున్న ప్రాణాలు**

**మారుతున్న అర్థాలు" / "చదువుల బరువేమోయలేని భుజాలు**

బ్రతుకు బరువు మోయగలవా?/ 'ఆఫీసుబోయ్!

ముద్రలువేసి, వేసి, తానే ఒక ముద్రయిపోయాడు

"చెమ్మతనం, అమ్మతనం కోల్పోయిన చేను" ఇలాంటి గుండెను తట్టే, తడిపి ముద్దచేసే పాదాలు, పంక్తులెన్నో ఈ అలౌకికంలో అలవోకగా ఇమిడిపోయాయి. వస్తు దృష్టి, భావ సృష్టి వున్న కవి మాత్రమే ఇలాంటి వాక్యాలు రాయగలడు. ఇక కొన్ని కవితలు కవి వ్యక్తిత్వానికి, మనస్తత్వానికి ప్రతీకలుగా వున్నాయి.

గమనం, వీడియో మరణం, దగ్గరిదూరం, పడమటి రాగం, నవవసనమాలి, దీపశిఖ, వసంతంలో గ్రీష్మం,.....వర్తమానం, రైతుకొంగ, రసరేఖ, చెరగని దృశ్యం, వర్షం, అమ్మఒడిలో ఓ రోజు, అక్షర దీపం, పసిభాష, రాగమాలిక, అక్షరాలు వంటి కవితలు కవి అభివ్యక్తికి ఆనవాళ్ళు. ఎలిజీలు గుండెతడికి ప్రతిరూపాల జ్ఞాపకాలను వెలిగించిన దీపాలు.

''ఇప్పుడా ప్రవాహం లేక వీధులు ఎండు కాలువలయ్యాయి.

సి.ఎస్ శాస్త్రిగారికి అక్షర నివాళి. భార్గవి రూపాన్ని కళ్ళముందునిలిపే సజీవ చిత్రకారులు. బీజప్రదాత(ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ గారు) కవితలు ఇంకా గొప్పగా రాయవచ్చు కాని పేలవంగా రాశారు. బహుశా అప్పటికప్పుడు రెడీమేడ్ గా రాసి వుంటారనుకుంటాను. శివలింగప్రసాద్‌కు సమర్పించిన స్మృతిగీత, సంజీవదేవ్ "అక్షర జగత్తులో జీవన రస శిల్పి''. కవిగారి ఆత్మీయతకు, అనుబంధానికి అక్షర సాక్ష్యాలు.

ఇక హైకూలు రెప్పల మధ్య ఆకాశాన్ని మరింత విశాలం చేశాయి. నావంటి పరిమితమైన కవి చూపుకు పాఠాలు చెప్పారు. కొన్ని హైకూల్లో ప్రకృతి, మరికొన్నింట్లో పరామర్శ ఇంకొన్నిట్లో స్పర్శ, పాదాల్లో ప్రవహించి, బొమ్మకట్టి చూపినట్లుగా వున్నాయి. పసివాడి చిరునవ్వులా వున్నాయి. కోయిలమ్మ పాటలా వున్నాయి.

మెత్తగా పరుచుకున్న పచ్చిక బాటలావున్నాయి. ''అల్పాక్షరాల్లో అనల్పార్థరచనకు ఈ హైకూలు నిదర్శనాలు.


కవిత్వంలో ఇష్టారీతిగా భాషను, మాటల్ని ప్రయోగించడం దివాలా కోరుతనం. భావానికి తగిన భాషను

**కవిత**

# భయం గుప్పిట్లో...

- తిరుపతిరావు. జి

9440302484



*నిద్దట్లో*
*త్రుళ్ళిపడి లేచాను*
*చంటిది*
*ఎందుకో*
*గుప్పిళ్లు బిగబెట్టి,*
*గుక్కపెట్టి ఏడుస్తోంది*

*గండుచీమ*
*నెలల పసిగుడ్డును కరుస్తోంది*
*కోపంతో దాన్ని చంపేశాను.*

*బిగించిన చిట్టి గుప్పిటను*
*ఒక్కో వేలును తప్పిస్తూ*
*తన గుప్పిటలోకి*
*నా వేలును జొప్పించాను*
*నిద్దట్లో నే నవ్వుకుంటూ*
*నా వేలుని గట్టిగా ఒడిసి*
*పట్టుకుంది*

*ఇప్పుడు కూడా...*
*తన గుప్పిటను తెరవడానికి*
*ప్రయత్నిస్తున్నాను!!*

*శిఖరాలనధిరోహిస్తుందని*
*ఉన్నత విద్యకు పంపించాను...*
*చీడ పురుగు చావలేదు???*

*రక్షణ కల్పించలేని "పేద" వ్యవస్థ...*
*గుప్పిట తెరవడానికి*
*ప్రయత్నిస్తున్నాను...*

*ఎవరెవరో వస్తున్నారు...*
*ప్రకటనలిస్తున్నారు*
*గుప్పిట తెరవడానికి ప్రయత్నిస్తున్నాను...*

*పత్రికలు... ఛానళ్ళు...*
*ఏవోవో అడుగుతున్నారు...*
*గుప్పిట తెరవడానికి ప్రయత్నిస్తున్నాను...*

*ఎక్స్ గ్రేషియా ప్రకటించారు?*
*ఇప్పుడు*
*ఇరవై ఏళ్ళ నా చిన్నారి*
*మరో నిర్భయ...*
*గుప్పిట తెరవడానికి ప్రయత్నిస్తున్నాను...*
*తెరుచుకోవట్లేదు...*
*భయంతో.... బిగుసుకుపోయింది!!*

---

వస్తువుకు తగిన వర్ణన చెప్పడమే కవితనం కలంతనం కూడా!

"ఎంత తొక్కినా పచ్చటిగరిక పాదాన్ని ముద్దిడుతూనే వుంది". (266)

" ఓ పండుటాకు కొమ్మవీడింది నేల చేరలేదింకా"

కవి మనసులోని పనితనానికి, సజీవ నిదర్శనం.

లలితలలిత సుందరభావ కవితా హృదంచలిత కవితా పరాగాన్ని గుండెల మీద చల్లి సువాసన ఆఘ్రాణించమని "అలౌకికం" సారాంశం. సంజీవదేవ్‌గారి మాటల్లో చెప్పాలంటే ''లలితానంద్‌గారి లాగా రాయడం లలితానంద్‌కు చేతనవుతుందేమోగాని, మరొకరికి కాదు. లలితానంద్‌లాగా రాయాలంటే దృష్టి వుండాలి, సృష్టి వుండాలి. లలితానంద్ దృష్టిని బట్టి సృష్టి చేస్తాడు. సృష్టిని బట్టి దృష్టికి ఆకారం వస్తుంది. సృష్టి, దృష్టిలో ఏముంది అని నన్ను చాలా మంది అడుగుతుంటారు. నేనేమో కుంచెను అడుగుతాను. నాకంటే లలితానంద్‌కు బాగా తెలుసు. దృష్టి ఉన్న కవికనుక నన్ను అభిమానించే కవికనుక! నన్ను అభిమానించడమంటే నా సృష్టిని అభిమానించడం. కనుకనే లలితానంద్‌కు నాకంటే నా బొమ్మల మీద, మాయింటి ముందు పూల మొక్కల మీద ప్రేమ ఎక్కువ. ఎక్కువ కుక్కల్ని ప్రేమించేవాళ్లుంటారు. మా ఇంట్లో మొక్కలు తప్ప కుక్కల్లేవు. కాబట్టి అతడు మొక్కల్ని, ఆ తరువాత, ఆ మీదట సులోచననూ అభిమానిస్తాడు. సులోచన అంటుంది. "అదుగో లలితానంద్ వచ్చాడు. ఓ గుప్పెడు అక్షరాల్ని జేబులో వేసుకొని"! పడక్కుర్చీలో వున్న నాకు ప్రాణంలేచి వస్తుంది. చలం నుంచీ, గోపీచంద్ నుంచీ, జానకీరాం నుంచీ, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య నుంచీ నేను ప్రేమించింది అక్షరాన్నే కనుక. అందుకే అక్షరాన్ని తెచ్చిన లలితానంద్‌నే ప్రేమిస్తాను. అతడికన్నా అతని కవిత్వమే నాకిష్టం. అతడి కవిత్వం ఉన్నంత అందంగా అతను వుంటాడు గనుక! సులోచన కూడా నాతో అంది. ఏవండీ! ఏదో సువాసన వస్తుంది చూడండి! అని రసరేఖ వాకిట్లోకి వస్తాను. ఏముంది? లలితానంద్ కవిత్వమై నడిచి వస్తున్నాడు. నన్నూ నా మొక్కల్ని పలకరించడానికి!"

ఇంత మంచి కవితా సంపుటాన్ని కవిగారి అత్తయ్య, మామయ్యలకు అంకితమివ్వడం వేదవతిగారు, వీరభద్రుడు గారు మంచి మాటలు రాయడం నాపై ప్రేమతో చదవమని ప్రేమతో పుస్తకాన్ని ఇవ్వడం-మాటల్లో చెప్పలేనంత దివ్యానందం, మనసురాయలేనంత మహోదానం...

# జీవ దృశ్యాలు...!

- పెరుగు రామకృష్ణ
9849230443



నాగరికత తెల్సిన వాణ్ని కనక
నడిచే వెళ్తుంటాను...
ద్వేషం మీద నిర్మలత్వపు జెండా నాటి
మనిషిని ప్రేమించే దేవుడికి నమస్కరించి కదులుతుంటాను
విశ్వ మానవ నైతిక బలాన్నివ్వమని ప్రార్థిస్తూ వుంటాను
సామ్రాజ్య వాద రాక్షసత్వానికి రాజకీయంతో ముడిపడ్డాక
ఆధిపత్యపు యుద్ధాల కోసం మనుష్య దేశాలన్నీ కలసి
ఇనుప పాదాల కింద దరిద్ర నారాయణుల్ని
నలిపేయాలనే వ్యూహంతో వున్నపుడు
శవ సమూహాల మధ్య పడుతూ లేస్తూ నడుస్తుంటాను....

కలత నిద్ర నుంచి కన్నును పెగలించి
కడగడానికి పరిశుద్ధ జలం కోసం వెతుక్కుంటూ వుంటాను
గాయపడిన బతుకులు
దగా పడిపోయిన జీవితాలు ఎదురైనప్పుడు
మట్టి మనుషుల చరిత్ర కుండలు పగిలిపోయాక
మనిషి స్వేదంతో నిండిన వొయాస్సిసుల ముందు నిల్చుని
వెన్నెముక విరిగిన వీరుడినై
ఈ దుర్మార్గ వ్యవస్థ చుట్టూ కాస్తంత ప్రేమ విత్తనాలు
చల్లుతాను

యోధులకు మరణం లేదని
రాజకీయ ప్రపంచపు గోడమీద నినాదమై
శిథిలాల నుంచే పునర్నిర్మాణాన్ని కలగంటాను

నాగరికత తెల్సిన వాణ్ణి కనుకనే
తరతరాల మానసిక సంఘర్షణల్ని అక్షరం చేసుకుని
నా మానవ జాతిని రక్షించమని
మరో కొత్త ప్రవక్తను ఆహ్వానించడానికి
మానవ సుగంధపు వృక్షాన్ని కన్నీళ్ళతో బతికించుకుంటాను

పాడై పోయిన ప్రపంచాన్ని
ఇక నడిచి మార్చలేనని తెలిసాక
ఈ ఆకృత్య, అరాచక, అమానవీయ రాజకీయమే లేని
నేలనిరహస్యంగా అన్వేషిస్తుంటాను

నాకు కలం పట్టడం
పిడికిలి బిగించడం తప్ప
పేదల పొట్ట కొట్టడం నేర్పనేలేదు మా అమ్మ
మనిషి కోసం పిడికిలి బిగించి
బతికినంత కాలం ఈ వ్యవస్థ మీద పోరాడుతూనే
వుంటాను

నాగరికత తెల్సిన వాణ్ని కనుకనే
నటించడం చేతకాక..
చైతన్యపు జెండాని కాలం చేతికిచ్చి
మనిషిని నిర్భయంగా నడవమంటాను
పోరాడమంటాను....
దారితప్పిన ఈ దౌర్భాగ్యపు వ్యవస్థ మీద
గెలుపుతీరం చేరేదాకా
వరుస బాణాలు

కథ

# అర్ధజీవి

- మానస ఎండ్లూరి
9160734990



ఈ మధ్య కాస్త ఒళ్ళు చేశాను.

దానికి కారణాలు చాలా ఉన్నాయి. అందులో ప్రథమమైనది పనిమనిషిని పెట్టుకోవడం!

లేకపోతే?శ్రీపాద వారి కథలు చదువుదామంటే అంట్లు గుర్రున చూస్తుంటాయి! విశ్వనాథ గారి రచనలు తిరగేద్దామంటే వంట టంగున గంట కొడుతుంది! తిలక్ తో ఊరి చివరి దాకా వెళ్ళొద్దామంటే గంపెడు బట్టలు బిక్కుబిక్కు మంటుంటాయి! పోనీ తాపీగా ధర్మారావు గారిని పలకరిద్దామంటే, ఊడవమని నా ఇల్లు చీపురు కట్ట తిరగేస్తుంది!

అందుకే, బరువు నేను తీస్కోని బాధ్యతలు పనమ్మాయికిచ్చాను. కానీ ఎక్కడా!? రెండు నెలలు చేసిందో లేదో జీతం పెంచమనీ, కొత్త చీర కొనివ్వమనీ నానా హైరానా చేసింది!

చేస్తే చేసింది.పనిమానేసి వెళ్ళిపోయింది!

మళ్ళీ కథలు కంచికి, బాధ్యతలు నెత్తి మీదకి, బరువు గాల్లోకి! నా భర్తకి ఈ తేడాలేవీ కనబడవు!

రుచులకు వంకలు పెడుతూ టిఫిన్ చేసి ఆఫీస్ కి వెళ్ళడం తప్ప ఏ పాపం పుణ్యం ఎరుగడు!

ఒళ్ళు పెరిగాక ఓట్స్ తినడం ప్రారంభించాను!

'ఎంత తక్కువ తిన్నా, కూర్చుని చదవడం, రాయడం మాత్రమే చేస్తుంటే ఒళ్ళు పెరక్క ఏమౌతుంది!?' మనసులో ఏమీ దాచుకోకుండా నిష్కపటంగా అన్న నా భర్త మాటకి లోబడి కథలు రాయడం కాస్త పక్కన పెట్టాను, గదులు ఊడ్చి, తడి గుడ్డ పెట్టడానికి!

సరిగ్గా అప్పుడే వాకిట్లో ఓ దేవదూత ప్రత్యక్షమైంది! ఆమె పేరు నాగమణి అని తెలిసింది అడిగాక.

'రెండు వేలు!' అనగానే పనిదూత పోయి దగాకోరు వెలిసింది!

"ఏవమ్మా? ఇంత అన్యాయంగా అడుగుతారు? ఉన్నది నాలుగు గదులు, ఇద్దరు మనుషులు!

అంట్లు,బట్టలు, గదులూడ్చి తడిగుడ్డ పెట్టడానికి రెండు వేలా?" గట్టిగా అడిగాను.

ఆమె ముఖంలో ఏ భావనా లేదు. కేవలం నిర్లిప్తత అలుముకుంది. పీలగా, మొహం పీక్కుపోయి, కళ్ళు నిర్జీవంగా, బేల చూపులు, ఎముకలు బయటపడి ఉంది ఆమె శరీరం.



ఏదో కష్టాల్లో ఉన్నట్టు తెలుస్తూనే ఉంది. కానీ ఆమె చీరకున్న పట్టంచు మాత్రం ఆశాజ్యోతిలా వెలుగుతోంది!

'బతికి చెడ్డైనా అయ్యుండాలి లేదా ఎవరో ఆ చీర ఇచ్చుండాలి!

అయినా ఈ మధ్య పనిమనుషులు నెట్ చీరలు లేందే బయటకి రావడం లేదు. వాళ్ళూ బానే సంపాదిస్తున్నారు!' అనుకున్నాను మనసులో.

"ఎంతిస్తారండీ?"

ఆ మాటలో యాసలేదు!

మెళ్ళో తాడు లేదు, చేతులకు రెండు మట్టి గాజులు, ఖాళీ నుదురు, చెవులకి, ముక్కుకి రంధ్రాలు తప్ప లోహాలు లేవు! చర్చికెళుతుందేమో అనుకున్నాను. ఆ విషయం వెంటనే అడక్కుండా ఉండనూ లేను!

"దేవుణ్ని నమ్ముకున్నావా?"

మళ్ళీ సమాధానం లేదు! ఆమె మౌనానికి కారణాలూ, ఆమె కష్టాలూ నష్టాలూ నాకెందుకూ?

ఆ మౌనాన్నే అదనుగా తీసుకుని వెయ్యి రూపాయలకి రమ్మన్నాను. బేరాలు చేయడం రాదో ఏమో! మారు మాట్లాడకుండా రేపట్నుంచీ వస్తానంది!

పనిమనిషికి రెండు వేలివ్వలేని పరిస్థితి కాదు గానీ వాళ్ళడిగినంతా ఇవ్వకూడదు కదా! అసలు రేటు కి ఐదారొందలు ఎక్కువేసి అడుగుతారు! మనం బేరమాడాలి! అదేగా ఏళ్ళ తరబడి నడుస్తున్న ఆచారం!

మరుసటి రోజు నుండీ నాగమణి పనిలోకొస్తుంది.

మాటా పలకరింపు లేకుండా మొహమాటంగా ఇల్లూడ్చి పాత్రలు తోమి బట్టలుతికి, చెప్పకపోయినా సాయంత్రం పూట ఉతికిన బట్టలు మడత పెట్టి ఒద్దిగ్గా పని చేసుకుని వెళ్తుంది. అప్పుడప్పుడు మిగిలిన ఇడ్లీలు, దోశెలు, అన్నం, కూరలు ఇస్తున్నాను. అవి మాత్రం వద్దనకుండా పట్టుకెళుతుంది. నేనిచ్చేవి కూడా కేవలం మేం తిననివేలే!

పాత పనిమనిషి చక చకా పనులు చేస్తూ లొడలొడా కబుర్లు చెప్పేది. వాళ్ల కుటుంబ రాజకీయాలు, బకాయిలు, మొగుడి రంకు వేషాలు, ఇంకా ఏవేవో చెప్పేది. అంతా చెప్పి ఓ పది వేలు అప్పడుగుతుందేమోనని నాకు ఓ పక్క కంగారుగా ఉండేది! కానీ ఈ మణి ఒక్క మాటా మాట్లాడదు. ఈమెనీ కదిలిస్తే కష్టాలన్నీ ఏకరువు పెట్టి ఎక్కడ అప్పడుగుతదో అని చిన్న భయం లోలోపల!

ఏదేమైనా నేను మటుకు ఇప్పుడు సంతోషంగా చీపురు పడేసి కలం పట్టుకున్నాను. చాట వదిలేసి పుస్తకం తీసుకున్నాను. మొన్న రాస్తూ వదిలేసిన ఓ కథ పూర్తి చేసే పనిలో పడ్డాను. కథ ముగింపుకి దగ్గరలో ఉన్నా, సమయం మించిపోతున్నా మణి ఇంకా రాలేదు. గంటన్నర ఆలస్యంగా వచ్చింది.

"ఏం మణి? ఇంత ఆలస్యం ఐతే ఎలా?పనులన్నీ అలాగే నిలిచిపోయాయి!"ఆమె ఆలస్యం వల్ల కొంపలంటుకుపోవని నాకూ తెలుసు, ఆమెకీ తెలుసు!

మౌనంగా వెళ్లి అంట్లు తోమడం మొదలు పెట్టింది. పడగ్గదిలో నేను కథ రాస్తూ తిని వదిలిపెట్టిన ఓట్స్ గిన్నె వేశాను తోమడానికి.

అప్పడిగే వాడికి ఒకే దారుంటే ఇవ్వనని తప్పించుకు తిరిగే వాడికి వంద దార్లుంటాయి. ఆ ధైర్యంతో మణి కుటుంబ విషయాలు అడిగాను. అంతే తప్ప నలతగా ఉన్న ఆమె మొహం చూసి 'ఒంట్లో బాలేదా?' అని మాత్రం అడగలేదు! 'అవునండీ రేపు రాను!' అని రెండ్రోజులు పని మానేస్తుందేమోనని!

"నేనూ, నా ముగ్గురు కూతుళ్ళు ఉంటామండీ. ఈ ఊరొచ్చి నెల రోజులౌతుందండీ" గదులూడుస్తూ చెప్పింది మణి.

"మరి మీ ఆయన..?"

"లేరండి" కచ్చిగా కసిగా కోపంగా చెప్పింది.

అంటే ఆమె నిరాడంబర ఆహార్యానికి కారణం దేవుడు కాదు, ఆమె మొగుడు!

కుతూహలానికి ఆడా మగా తేడాలుండవుగా!

వెంటనే అడిగేశాను.

"ఎక్కడికెళ్ళాడు?"

మొదటి సారి ఓ పనిమనిషి తన భర్తని 'రు' అని సంబోధించడం విన్నానని నా అమర్యాద అలవాటుని నేనెలా మార్చుకుంటాను? అతన్నీ 'రు' అనీ నా మొగుణ్నీ 'రు' అంటే! తేడా ఉండొద్దూ...!? అంటే ఎదురింటి ఆయన్ని కూడా నేను 'రు' అని పిలిచినంత మాత్రాన ఆయనా, నా మొగుడూ ఒకటే కాదనుకోండి!

"చచ్చిపోయారండీ" ఊడ్చిన చెత్త బుట్టలోకి ఎత్తి పోస్తూ

చెప్పింది.

'తాగి తాగి చచ్చుంటాడు వెధవ!

పెళ్ళాం పిల్లల్ని బాధపెట్టడమే వీళ్ళ పని!' అనుకుని

''ఎలా?'' అని అడిగాను సిగ్గులేకుండా.

"అప్పులెక్కువయ్యాయండీ, వరి పంట వరదలో మునిగిపోయింది."



నేను అనుకున్న మాటలు మళ్ళీ గుర్తు చేసుకుంటే పశ్చాత్తాపుడి, మనసు బరువెక్కుతుంది, మనిషినని గుర్తొస్తుంది! ఎందుకొచ్చిందని, ఇవ్వాళ చేసిన నా ప్రియాతి ప్రియమైన గుత్తి వంకాయ కూరను తలచుకున్నాను. ఎప్పుడెప్పుడు మణి వెళుతుందా వేడి వేడి అన్నంలో గుత్తొంకాయ వేస్కొని లాగించేద్దామా అని మనసు ఉవ్విళ్ళూరితే, నోరు నీళ్ళూరుతోంది!

'గుత్తి వంకాయ కూరోయి బావా...కోరి వండినానోయి బావా

కూరలోపల నా వలపంత బావా కూరి పెట్టి నానోయి బావా...'

బసవరాజు అప్పారావు గారి పాట పాడుకుంటుండగా ఏదో గుర్తుకు రావాలన్న విషయం గుర్తొచ్చింది! అదేంటి...ఆ! 'నా బావ కాని మొగుడు ఈ పాటికి భోజనం ముగించి నాకు ఫోన్ చేయాలే!' అనుకుంటుండగానే ఫోన్ చేశాడు...

''ఏంటి! కూర బావుందా?'' వయ్యారాలుపోతూ అడిగాను.

"ముందు ఒట్టి వంకాయల్ని వేయించేసి తరువాత మసాలా కలిపి వండేశావు కదూ!?"

ఏదో క్రిమినల్ ని పట్టుకున్న సిఐడి లా ప్రశ్నించాడు!

"మరి ముందే అడిగాను కదా! ఎలా చెయ్యాలి అని!"

"వంకాయలు కోశాక, పల్లీలు, నువ్వులు, మసాల వగైరా అన్నీ వేయించి, నూరి, కాయల్లో కూరి, అప్పుడు నూనెలో వేయించాలి!ముందెవడూ వంకాయల్ని వేయించడు!"

"ఆ మాటేదో అడిగినప్పుడే ఏడవాలి!"

"ఏడిశావ్!అందుకే మా అమ్మనడగమంటాను!"

"ఎలా ఉన్నా నోర్మూసుకుని తింటానండీ...రుచుల మీద ఆసక్తి లేదన్నావనే కదా పెళ్లి చేసుకున్నాను!!"

"ఇప్పుడు నోర్మూసుకునేగా తిన్నాను! వదిలేయ లేదు కదా!"

"వంకలు పెట్టకుండా ఎపుడు తిన్నావనీ? ఉంటాను!"

వంటకి రుచున్నా లేకున్నా మా మాటల్లో మాత్రం ఆప్యాయతలుండవ్! వాడి ఖర్మ!

ఎంత బాగా చేసినా చచ్చు నాలుక్కి రుచులేం తెలుస్తాయి?!

పనికిమాలిన ఆలోచనలు వదిలిపెడుతూ టీవీ ముందు కూర్చున్నాను.

'ప్రియుడితో కలిసి ఏడేళ్ళ కొడుకుని కిరాతకంగా హత్య చేసిన తల్లి'

వార్త చూసి గుండె పగిలింది!

ఇటువంటి తల్లుల వార్తలు చూడడం ఇది మొదటి సారి కాదు!

ఆ తల్లిని పచ్చి బూతులు తిట్టుకోడం, ఆ చనిపోయిన పిల్లాడ్నో, పిల్లనో మనసులోతుల్లోంచి జాలి పడ్డం కూడా మొదటి సారి కాదు!

అసలు ఆ పసిప్రాణం ఆ మరణబాధను చివరి నిమిషంలో ఎలా భరించిందోనని వీలైనన్ని రకాలుగా ఊహించుకుని, గుండె బరువు చేసుకుని, కళ్ళల్లో నీళ్ళు నింపుకుని దిగ్భ్రాంతిలో ఉండగా "ఆంటీ!" అనే పిలుపుకి ఉలిక్కిపడి గుమ్మంలోకి చూశాను.

తొమ్మిది, పదేళ్ళ పిల్ల నిలబడి ఉంది. బక్క చిక్కి, చింపిరి జుట్టుతో మాసిన గౌనుతో ముఖం లోపలికి పెట్టి

"మా అమ్మొచ్చిందా ఆంటీ గారూ?" అంది.

పుట్టి బుద్ధి ఎరిగిన్నాటి నుంచీ నన్నెవరూ 'ఆంటీ' అని పిలవలేదు!! ఎక్కడ్నుంచూడి పడిందీ పిల్ల?? నన్ను ఆంటీ అని పిలిచి నాకు పెళ్ళైందీ, నేనిక 'స్త్రీ' ని అని గుర్తు చేయడానికే వచ్చిందనిపించింది నాకు!

'లోపల బట్టలుతుకుతుంద'ని చెప్పాను. లోపలికి రాకుండా బయట నుంచే అరుస్తోంది...

"అమ్మా! ఏమీ పెట్టకుండా వచ్చేశావేంటి? చెల్లి స్కూల్ కెళ్ళలేదు. ఆకలితో పడుకుంది."

ఆ మాటలు నా చెవులు వింటున్నాయి...మెదడు

అందుకుంటే పర్వాలేదు.మనసు స్పందిస్తేనే కష్టం! మణికి వయసూ తెలివీ ఉన్నాయి కాబట్టి నా ముందు వారి పేదరికం బయట పడడం నా మోషీగా అనిపించింది ఆమెకు!



''చెల్లినొదిలేసి వచ్చేశావా? ఇంటికెళ్ళు! వచ్చేస్తున్నాను కొంచెం సేపట్లో అయిపోద్ది పని!" బయటకొచ్చి చెప్పింది మణి.

"ఆకలేసేస్తుంది! ఏదోకటి పెట్టు...!"

నా గుండె ద్రవిస్తున్నా ముఖం గంభీరంగా ఉంది. మధ్యాహ్నం ఒంటిగంటన్నర కావొస్తోంది! ఓట్స్ లాంటి తేలికపాటి తిండి తిని ఇంకా భోజనం చేయలేదని నాకు తెలియకుండా ఇందాకటి నుంచీ నా మీద నేనే జాలిపడిపోతున్నాను! ఈ పిల్లలు రాత్రనగా తిని ఇప్పటి దాకా తిండీ తిప్పలు లేకుండా ఎలా ఉండగలుగుతున్నారు?

దారిద్ర్యం ఉండనిస్తుంది!!

"రాత్రి కూడా ఒక ఇడ్లీయే పెట్టావ్! ఐదు రూపాయలివ్వు ఏదైనా కొనుక్కుంటా!"

నేనిచ్చిన మూడు ఇడ్లీలు రాత్రి తలోకటి తిన్నారన్నమాట! అంటే మణి నిన్నటి నుంచీ ఏమీ తినలేదు!

ఆ పిల్ల ఆకలి పలుకులు నా కడుపులో పేగుల్ని మెలిపెడుతున్నాయి...ఇవ్వడానికి కూడా ఏమీ లేవు! రాత్రి అన్నం గానీ పొద్దుటి ఇడ్లీలు గానీ! పోనీ ఓ పది రూపాయలిద్దామంటే రోజూ అలవాటైపోతుందని అదో భయం!

ఇక్కడ కాకపోతే ఆమె పని చేసే వేరే ఇళ్ళల్లో తినడానికి ఏదోకటి పెడతార్లే అనుకున్నాను రాత్రి! వాళ్ళూ అలాగే అనుకున్నారేమో!

ఊరికే అన్నారా గుర్రం జాషువా గారు! 'పేదరికం పెద్ద వింత విశ్వవిద్యాలయం, అందులో లజ్జ కనబడదనీ! లజ్జ ఉండనిది పేద వారికే కాదు. నాలాంటి పిసినారులకు కూడా! ఏ మాత్రం సిగ్గు పడకుండా ఉన్నవి దాచి పెట్టుకుని ఒట్టి చేతులు చూపించడంలో మేం ఆరి తేరిన వాళ్ళం!!

ఆ పిల్ల గౌను మాసిందని గమనించాను గానీ దాని ఎందుకుపోయిన డొక్కల్ని చూడలేకపోయాను! చింపిరి జుట్టుని చూశాను గానీ లోతు కళ్ళని పసిగట్టలేకపోయాను.

"నువ్వెళ్ళు! నేనొచ్చేస్తాను!" అని లోపలికొచ్చింది మణి. పిల్ల గుమ్మం బైటే నిలబడి ఉంది. అది ఎదురు చూసేది అమ్మ కోసం కాదు అన్నం కోసం!

ఆ పిల్ల రాకపొయ్యుంటే రెండో ఆలోచన లేకుండా ఖాళీ చేతుల్తో పంపేదాన్ని మణిని. కానీ రెండు నిమిషాల్లో పని ముగించుకుని వెళ్ళిపోయే మణికీ ఆమె ముగ్గురు పిల్లలకి తినడానికీ ఏం ఇవ్వాలి?ఉన్నదల్లా అన్నం, గుత్తొంకాయ కూర!

కొడుకు పీక కోసి చంపిన తల్లినీ,ఆమె ప్రియుడ్నీ, పసిపిల్లోడి శవాన్నీ పదే పదే పోటీలు పడి చూపిస్తున్నాయి ప్రసార మాధ్యమాలు! శవాన్ని తెరపై చూసి కళ్ళ నిండా నీళ్ళు పెట్టుకున్న నేను, రెండడుగుల దూరంలో ఆకలికి ఏడుస్తున్న పిల్లను చూసి ఎన్ని విధాలుగా ఆమె ఆకలి తీర్చకుండా వెనుకంజ వేయాలా అని ఆలోచిస్తున్నాను!

ఆకలికి ఏడుస్తున్న పిల్ల బతికే ఉంది! స్వార్థంతో ఉన్న నేనే పది రూపాయలివ్వడానికి ఆలోచించిన క్షణంలోనే చచ్చిపోయాను!! ఇష్టపడి చేసుకున్న గుత్తి వంకాయ కూర మీద ప్రేమను పెంచుకుని వాళ్ళకివ్వడానికి సంశయించినప్పుడే మనిషిగా మరుగున పడ్డాను! తండ్రి లేని పిల్లలని తెలిసీ కనీసం ఎంగిలి చేయి కూడా విదల్చలేక పోతున్నాను! నాకు అన్నం పెట్టిన రైతు బిడ్డలకే అన్నం పెట్టాలా వద్దా అన్న మీమాంసలో పడ్డప్పుడే నేను నీచురాలినయ్యాను!

నేనా ఒక రచయిత్రిని? నేనా ఇన్ని పుస్తకాలు చదివి మేధావిలా ప్రముఖులతో ఫోటోలు దిగి పత్రికల్లో వచ్చేది?! నేనా అనర్గళంగా ఆకలిపోరాటాలు గురించి అరపూట సేపు గొంతు చించుకుని వేదికపై మాట్లాడింది? అయితే మాత్రం..? రచయితలకు స్వార్థాలు, పిసినారితనాలు ఉండవా ఏంటి! రచన వేరు జీవితం వేరు!! కానీ...ఆ అమ్మాయి ఆకలి చూపులు నా పిసినారి నరాల్ని నిద్రలేపుతున్నాయి!

జీవితంలో ఎన్ని కోట్ల కోళ్ళు, లక్షల రొయ్యలూ తిన్నా, జ్వరం వచ్చినప్పుడు తినకూడని ఆ ఒక్క కోడి కూర ఊరించినంతగా ఏ పులస కూరా ఊరించదు కదా!

వారానికోసారి గుత్తొంకాయ వండుకునే స్థితి గల నేను ఏదో ఈ రోజు మాత్రమే అరుదైన అవకాశం వచ్చినట్టు

**కవిత**

# చివరి కొడుకు


- కృష్ణ మణి
9866767875




వీడు
ఏ ధర్మాన్ని ఆచరించాలో చెప్పు
ఏ బట్టకట్టాలో
ఎలాంటి తిండి తినాలో
అదీ ... ఎలా తినాలో చెప్పు

సమాజంలో ఇప్పుడు వీడు
ఒక అనాథలా కంటతడి
పెడుతున్నాడు
వాడు రాలుతున్నాడు
కరెంటు తీగలపై ఒంటరి పిట్టలా !

మనషుల మధ్య మమతల కోసం
వాడు
గుండె మండి గుడి గంట
కొడుతున్నాడు
దర్గా మెట్లెక్కి "యా అల్లా"
అంటున్నాడు
చర్చికెళ్ళి రోదిస్తున్నాడు "జీసస్" అని

వాడిప్పుడు పరాయివాడు
ఎవడూ మావాడనరు వాన్ని
వాడు
బూతద్దంలాంటివాడు

వానిలోంచి చూస్తే
మన మనసు పెద్దగా దర్శనమిస్తుంది
పక్కవాడు నవ్వుకునేలా

వాడు
పరిగెడుతున్నాడు
మనం మనుషులమని
ఒలంపిక్ కాగడలా చేతిలో
దివిటీని చేతబూని
అంధకారాన్ని తరిమేద్దామని

మానవత్వానికి చివరి కొడుకు వాడు
వాడు చస్తే లోకం చచ్చినట్లే
మనిషిని బూతద్దం పెట్టి వెతకాలప్పుడు

---

హైరానా పడిపోడం నా లోభి బుద్ధికి పరాకాష్ట! వంకాయ తొడిమ పట్టుకుని అమాంతం నోట్లో వేసుకుని తినడం నాకో అభిరుచి. కానీ వాళ్ళకది ఓ పూట ప్రాణం నిలబెడుతుంది!

గొప్ప వాడి గంజి నీళ్ళే కదా ఓట్స్ అంటే! రెండో పూటా ఓట్సే తింటే ఎవడన్నా నన్నిప్పుడు కొరడా దెబ్బలు కొడతాడా!?

వెంటనే లేచి అన్నం, గుత్తొంకాయ కూర డబ్బాలో సర్ది మణికిచ్చాను. ఓట్స్ ఒక గిన్నెలో వేసి పాలు పొయ్యి మీద పెట్టాను.

బయటకెళ్ళిన మణి చేతిలోంచి డబ్బా లాక్కోబోయింది కూతురు. దాని చేతి మీద చిన్న దెబ్బ వేసింది మణి.

"మొత్తం నేనే తినేస్తాను!"

"తప్పు! చెల్లికీ, అక్కకీ పెట్టాలి!"

ఆ మాటలు వింటూ సంతృప్తిగా ఓట్స్ కలుపుకుంటూ హాల్లోకొచ్చి కూర్చున్నాను.

రోజూ కంటే ఈ వేళ ఓట్స్ మంచి సువాసన వెదజల్లుతున్నాయి! బహుశా అది నా మానవీయతా గర్వం వల్ల కాబోలు! స్పూన్ నోటి వరకూ తెచ్చుకొని వేడి వేడి ఓట్స్ ఊదుతున్నప్పుడు ఎందుకో ఆ సువాసన రాలేదు!

'ఎందుకనా?' అనుకుంటుండగా నా మెదడు నా మనసుకేదో చెబుతోంది...

నేను అన్నం వండిందే ఇద్దరికి! అందులో సగం నా మొగుడికి పెట్టాక మిగతా సగం మణికిచ్చాను. ఒక్కరు తినే అన్నం నలుగురి కడుపులు నింపడానికిచ్చాను!

దుర్మార్గురాలిని!! రెండో పూటా ఓట్స్ తిని ఏదో వీర త్యాగం చేస్తున్నట్టు విర్రవీగాను కానీ నా అర్ధశాస్త్రం వాళ్ళ కడుపుల పరిణామాల్ని అంచనా వేయనివ్వలేదు! కాస్తాగమని చెప్పి ఓ పావు సేరు బియ్యమన్నా వండనివ్వలేదు!

నా లాంటి అర్ధజీవి జీవితంలో ఓ రోజు మరీ ఇంత అర్ధరహితంగా గడుస్తున్నందుకు నా జన్మ మీద నాకే సిగ్గనిపించింది.

స్పూన్ తిరిగి గిన్నెలోకి జారి పడింది!

బయటకెళ్ళి చూస్తే మణి ఆలోచనలతో నిండిపోయిన నా మనసు తప్ప ఆమె కనిపించలేదు!

## విశ్లేషణ

# సీత పాత్రను తీర్చిదిద్దిన ఓల్గా




- డా॥ అయ్యగారి సీతారత్నం
8912712179

***కొంతమంది రచనలో రాముడ్ని దేముడ్ని మాత్రమే చూస్తే మరికొందరు వారివారి దృక్కోణాలలో సీతా రాముల సంబంధాలలోని నిజానిజాల నిగ్గు తేల్చడానికి ప్రయత్నించారు. మేధావి, ఆలోచనాపరురాలు, సృజన శీలియైన ఓల్గా రామాయణంలో బాధితులైన శూర్పణఖ, అహల్య, ఊర్మిళ, రేణుక, పాత్రల ఆధారంగా సీతపాత్రని ఆవిష్కరించారు.***

***"అచ్చమయిన యమృత మమరులు త్రావినా***
***రోయి! దానికే నసూయపడను***
***పరమ మౌనియైన వల్మీకి కృతరామ***
***సత్కథాసుధా రసంబు ద్రావి....."*** అన్నారు విశ్వనాథ సత్యనారాయణ. 'వాల్మీకి రామాయణ కావ్యామృతం అమరులు త్రాగిన అమృతముకన్నా గొప్పది. వాల్మీకి రామాయణం ఆలోచనామృతం.' నిజానికి సంగీతం ఆపాతమధురం. సాహిత్యం ఆలోచనామృతం అంటారు. ఆలోచింపజేసేదే ఉత్తమ సాహిత్యం. రామాయణం తెలిసినదే అయినా... ఎందరో అన్నికాలాల్లోనూ, ఆలోచనాపరులు, సృజనశీలురు... ఎందరో రామకథని వారికి నచ్చిన రీతిలో, ప్రక్రియల్లో వారు రాస్తూనే ఉన్నారు. భారత భాగవత, పురాణాలలో రామాయణమేగాక, ద్విపద కావ్యంగా, ద్వర్థికావ్యాలుగా, శతకాలుగా, దండకాలుగా, యక్షగానము, హరికథ, కీర్తనలు, నాటకంగా ఎందరో రచించారు. వచనంలో కూడా అందించారు.

కొంతమంది రచనలో రాముడ్ని దేముడ్ని మాత్రమే చూస్తే మరికొందరు వారివారి దృక్కోణాలలో సీతా రాముల సంబంధాలలోని నిజానిజాల నిగ్గు తేల్చడానికి ప్రయత్నించారు. మేధావి, ఆలోచనాపరురాలు, సృజన శీలియైన ఓల్గా రామాయణంలో బాధితులైన శూర్పణఖ, అహల్య, ఊర్మిళ, రేణుక, పాత్రల ఆధారంగా సీతపాత్రని ఆవిష్కరించారు.

కథకి ప్రధానమైనది వస్తువు. కథకి జీవితమే ముడిసరుకు. కానీ కావ్యపాత్రలు ఇక్కడ వస్తువు. అయితే రామాయణం ఒక నమూనా జీవనం. ఒక సంప్రదాయం. అందరికీ తెలిసినదే కానీ కొత్తగా కథని అల్లడంలో ఆసక్తిదాయకంగా, ఆలోచనాత్మకంగా మార్పుకి దోహద పడేలా నడిపారు ఓల్గా.

ఋషి అవడం వలనేమో వాస్తవికతకే పట్టం గట్టారు వాల్మీకి. దుష్యంతుడికి లేని గొప్పతనాన్ని ఆపాదించడానికిగానూ, కాళిదాసు అభిజ్ఞానాన్ని, అంగుళీయకాన్ని కల్పించారు. వాల్మీకి అలా చేయలేదు. దాన్లో న్యాయాన్యాయాల్ని ప్రతివొక్కరిచేత ఆలోచింపజేసారు.

వాల్మీకి 'మొనోగమీ' అనే ఆనాటికి ఒక నూతన విధానాన్ని అన్ని కోణాల నుండీ పరిశీలించారు. ఒక నియమం సమాజ అవసరానికే వస్తుంది. కానీ అది అందరికీ లబ్ధి నివ్వకపోవచ్చు. ఆ నియమం వలన ఎవరు నష్టపోతున్నారో, ఎవరి జీవన విధానం ఎలావుంటుందో, ఏ ఘర్షణలకి

లోనవుతోందనే దానిమీద కచ్చితంగా సాహితీ వేత్తల దృష్టి పడుతుంది.

వాల్మీకి కూడా ఒక స్త్రీ ఒక పురుషుడు... అనేదాన్ని నిశితంగా పరిశీలించారు. దీనికోసం పాతివ్రత్యమేగాక ఏకపత్నీ వ్రతం కూడా ప్రతిపాదించారు. మొనోగమీకి ప్రధానమైనది లైంగిక బంధమనుకొనే వీటిని ప్రతిపాదించారు. అన్ని కోణాలనుండీ నిశితంగా స్త్రీ, పురుష బంధాన్ని పరిశీలించారు. దీని పరిశీలనార్థం మన ముందు కొన్ని పాత్రలనుంచారు.

*బాధిత స్త్రీలని గుర్తించారుగానీ ఆ బాధలనుండీ వారికి విముక్తి ఎలా? అనేది వాల్మీకి స్పృశించలేదు. ఒక నియమం, ఒకప్పటి ప్రయోగం తర్వాత సంప్రదాయంగా మారుతుం దంటారు. సైన్సు అభివృద్ధిచెందని రోజుల్లో ఫేమలీప్లేనింగ్ లేని రోజుల్లో, ఏంటీబయటిక్స్ లేని రోజుల్లో స్త్రీల లైంగికత ఇబ్బందిదాయకమే.*

రావణుడు – శూర్పణఖ – ఇద్దరూ వివాహితలే. ఏ మాత్రం మొనోగమీని అంగీకరించని వాళ్లు. భౌతికంగానే తిరగబడ్డారు. ఇద్దరూ శిక్షకి గురయ్యారు.

అహల్య – గౌతముడి వేషంలో వచ్చిన ఇంద్రునితో సంగమించింది. ఆమెకి ఇష్టమా, కాదా అన్నది పక్కన పెడితే – మోసం వలన కూడా పాతివ్రత్యం దెబ్బతింటుందనే దానికి ఉదాహరణ. ఆమెనీ శిక్షించారు.

శారీరకంగానే కాదు, మానసిక నియమోల్లంఘున

ఉందని అనుకోవచ్చు. దానికి ఉదాహరణ రేణుక. సైకత కుంభం ఏకాగ్రతలేక బద్దలయితే పాతివ్రత్యం పోయిందని పర పురుషుడిని చూసిందని కొడుకు చేత చంపించబూనాడు భర్త.

ఊర్మిళ– భర్తని ఎంతగానో నమ్మి పాతివ్రత్యంతో

ఉన్నప్పటికీ అసలు ఏమాత్రం పట్టించు కోకుండా నచ్చిన రీతిని పురుషుడు వెళ్లిపోయే అవ కాశం ఉందని తెలుస్తుంది.

రుమ – సుగ్రీవులు – వారిద్దరూ అన్యోన్యంగా ఉన్నా బలవంతుడైన వాలి రుమని ఎత్తుకుపోయి తన భార్యగా అనుభవిస్తాడు. ఇక్కడా మొనోగమీ దెబ్బతింది.

సీతారాములు పూర్తిగా మొనోగమీని నమ్మి సమాగమంకన్నా ప్రణయానికే విలువ ఇచ్చారు. అయినావారిని ఎలా ఒకరి నుండి ఒకరిని ఎంత పెత్తనం చేసి సమాజం దూరం చేసిందో, శీలపరీక్షలతో విసిగించిందో, దాన్లో ఉండే డొల్లతనాన్ని బయటపెట్టారు వాల్మీకి. అందుకే సీత రెండోసారి సభలో శీలవతిని అని చెప్పుకో మంటే – భూమాత దగ్గరకి ...ళ్లిపోయినట్టుగా చిత్రించారు. ...మ్మకంలేని సంబంధం ఎన్నాళ్లో ...నసాగదని వాల్మీకికి తెలుసు. ...ధితురాలు సీత అనీ తెలుసు. ...ాయానం చరితమ్ అన్నారు.

ధర్మాలుగా పాతివ్రత్యం, ...కపత్నీవ్రతం అనుసరించినా కూడా ఆచరణలో సీతారాముల బంధం విచ్ఛిన్నమయింది.

సమాజ భయంతో అగ్ని పరీక్ష, అడవులపాలు మిగిల్చాడు రాముడు. ఇలాంటి స్త్రీల పరిస్థితి ఏంటి? గర్భవతియైన స్త్రీని అడవులపాలు చేస్తే రక్షించేదెవరు? వాల్మీకి ఆశ్రమం రక్షించింది.

పాతివ్రత్యం అనే ముసుగులో స్త్రీలే బాధితులు. నియమాన్ని పాటించనివాళ్లు బాధపడడమే కాదు, నియమోల్లంఘున చేయకున్నా సీతకి మిగిలిందేమిటి? అనేది కడు కరుణాత్మకంగా చిత్రించారు వాల్మీకి.

బాధిత స్త్రీలని గుర్తించారుగానీ ఆ బాధలనుండీ వారికి విముక్తి ఎలా? అనేది వాల్మీకి స్పృశించలేదు. ఒక నియమం, ఒకప్పటి ప్రయోగం తర్వాత సంప్రదాయంగా మారుతుం దంటారు. సైన్సు అభివృద్ధిచెందని రోజుల్లో ఫేమలీప్లేనింగ్ లేని రోజుల్లో, ఏంటీబయటిక్స్ లేని రోజుల్లో స్త్రీల లైంగికత ఇబ్బందిదాయకమే. బహుశా ఏనాడో ఏకపత్నీవ్రతం, పాతివ్రత్యం నియమాలుగా పెట్టుకొని వుంటారు. కాలక్రమంలో స్త్రీలని అణచివేసే దిశగా సాగి స్త్రీలపై ఆధిపత్యంగా మారింది పాతివ్రత్యం. దానిని గుర్తించే స్త్రీల స్థితి విముక్తమవ్వాలని ఎంత ఇరుకుగా ఉన్నా, ఎంత అహేతుకంగా ఉన్నా ఆ చట్రంలోనే ఉండడం అవివేకమని సీతని విముక్తం చేసారు ఓల్గా. వాల్మీకి సీతని బాధితురాలిగా మాత్రమే గుర్తిస్తే, సీతని బాధల నుండి విముక్తం చేసారు వోల్గా.

స్త్రీలు నిజంగా అన్ని సహజలక్షణాలు చంపుకొని పతివ్రతలుగా ఉందామన్నా దాన్ని పురుషులు సాగనివ్వరని రామాయణమే సుస్పష్టంగా చెప్తుంది. అనసూయని కూడ పరీక్ష పేరుతో త్రిమూర్తులే వదలలేదు. పాతివ్రత్యాన్ని ఆదర్శంగా స్త్రీల నియమంగా పెట్టి అడుగడుగునా అడ్డంకులు కలిగిస్తూ – నిందలపాలు చేస్తూ బలహీనురాలిగా అపరాధిగా గుర్తిస్తుంటే

– దీనినెదుర్కొందుకి ఏమీ చేయలేక నిస్సహాయంగా, రోదిస్తూ వుంటే బోల్డంత జాలికురిపిస్తుందీ పితృస్వామ్య సమాజం. నిజానికి సీత మళ్లీ మళ్లీ శీలాన్ని ఋజువుచేసుకొనే ఈ అపనమ్మక బంధమే నాకువద్దని భూమాత దగ్గరకి వెళ్లిపోయింది. శీలపరీక్షలు పెడితే భార్యలు కాపురాలు చేయరనే విషయాన్ని ప్రచారం చేయకుండా పతివ్రత, సాధ్వి... మాతృమూర్తి ఇలాంటివి మాత్రమే ప్రచారం చేసారు. పురుషాధిపత్యం పోకుండా ఉండే విషయాలకే ప్రాధాన్యమిచ్చిందీ సమాజం నేటివరకూ. దానిని గుర్తించిన ఓల్గా సీతని... తోటి బాధిత స్త్రీలతో కలిపి వారి అనుభవజ్ఞానం తన అనుభవంతో మిళితం చేసుకొని ఒక నూతన మార్గాన్వేషిగా చిత్రించారు. కుటుంబ సమాజాలు ఆమె చుట్టూ విధించిన పరిమితుల్ని తుడిచిపెట్టి ఒక ఆనందమయిగా, ఆస్తిత్వసహితగా, విశ్వమానవిగా, స్థిత ప్రజ్ఞగా, సాధితగా సీతపాత్రని విముక్త కథల ద్వారా మనముందుంచారు ఓల్గా.

> ***మాతృత్వ పరిధి కూడా చిన్నదే అని తెలుసుకొని భూదేవి ఆశ్రయంలో ఉంటానంటుంది సీత. అప్పటిదాకా పాతివ్రత్యం, మాతృత్వం మాత్రమే లక్ష్యాలు. వాటిని దాటి సీతపాత్ర విశాల ప్రపంచంలో వ్యక్తిగా జీవించే యోచన చేసేదిగా ఎదిగింది.***

సీతతో శూర్పణఖ అనుభవాన్ని పంచుకోవడమే మొదటి కథ 'సమాగమం'.

వాల్మీకి రామాయణంలో శూర్పణఖ వివాహిత. కానీ ఆమె భర్త, అన్నదమ్ముల దగ్గరకన్నా అడవిలో స్వేచ్ఛా విహారానికే ఇష్టపడుతుంది. రామలక్ష్మణులని కాంక్షించి సీతమీదదాడి చేయగానే ముక్కు చెవులు కోస్తాడు లక్ష్మణుడు. ఖర, దూషణాదుల్ని, రావణుడిని యుద్ధానికి ప్రేరేపించిన తర్వాత ఆమె ప్రస్తావనుండదు. ఆ పాత్రకి కొనసాగింపుగా వోల్గా చక్కని ఊహ చేసి, ఆసక్తిదాయకమైన సన్నివేశకల్పనలతో ఆమె అనుభవం నుండీ పొందిన జ్ఞానాన్ని సీతతో పంచుకోవడం – దానినుండి సీతపాత్రను మరికొంచెం ఉన్నతీకరించడం కన్పిస్తుంది.

లవకుశులు అరణ్యంలో ముక్కు, చెవులు లేని ఆమెని, ఆమె సుందర ఉద్యానవనం... సీతకి తెలియజేస్తే ఆమెని చూడడానికి వెళ్లి శూర్పణఖ విజయాన్ని గ్రహిస్తుంది. సౌందర్యాన్వేషణ చేయడాన్ని బాగా చిత్రించారు ఓల్గా. "నాకు సౌందర్యంకావాలి, ప్రేమకావాలి. ఈ రెండూ లేకుండా నేను బ్రతకలేను. నేను కురూపినయ్యా... ఎందుకీ బతుకు అనుకొన్నాను. సౌందర్యకాంక్ష, సౌందర్యవతులపై అసూయగా మారింది..." అంటుంది శూర్పణఖ.

ప్రతి వ్యక్తికి తనకి నచ్చినది పోగొట్టుకొంటే బాధే. అది అందం, డబ్బు, వ్యక్తి... వస్తువు... ఏదైనా కావచ్చు. అలాంటి సమయాల్లో అది పొందిన వారిని చూసి అసూయ పడడానికి అవకాశం ఉంది. అసూయిచ్చే వికృత ఆలోచన బరువేగానీ ఆనందం వాళ్లకీ ఇవ్వదు. పక్కవాళ్ళకీ ఇవ్వదు. దాని నుండీ ంతతాను యుద్ధంచేసైనా యటకి రావాలి. శూర్పణఖ కృతికి రూప, కురూప అనే తేడా దని గ్రహించడానికి చాలా పడ్డాను... తర్వాత ప్రతిదాన్నీ మించసాగాను....!' అని స్తుంది. ఇది అందం, ఇది కాదు. తెలుపు అందం. నలుపుకాదు చేతులు వేలాడితేనే అందం. వెనక్కి వంగితే కాదు ఇవన్నీ మనం పెట్టుకొన్నవి. రోజూ అలవాటయినదాన్నీ, అధికారంలో ఉన్నవాళ్లవి మాత్రమే అందంగా పరిగణించడంలో ఉన్నడొల్లతనం వోల్గా బయటపెట్టారని ఆలోచిస్తే తెలుస్తుంది. నిజానికి ఆలంకారికులు ఎంతోమంది సౌందర్యం వ్యక్తి నిష్టమా, వస్తు నిష్టమా అని తరచి తరచి తర్కించి వ్యకి నిష్టమే అని తేల్చారు. దీనినే ఓల్గా సృజనాత్మకంగా వ్యక్తిలో నైపుణ్యం, సేవ... భావాలతో అద్భుత ప్రేమని పొందగలుగుతారని తెలిపారు. శూర్పణఖ ప్రేమించడం, సేవించడం, శ్రమించడం నేర్చు కొని అద్భుత ఉద్యానవనాన్ని పెంచి ఆనందంగా ఉంది. అదే జీవనయాన సత్య సౌందర్యంగా తెలిపింది.

ఇందులో మరో ముఖ్య విషయం – శూర్పణఖకి సుధీరుడు అనే పురుష సాహచర్యం వలన జీవితం సఫలమయిందనుకొన్న సీతకి నిజం తెలుపుతుంది. సాఫల్యానికి అర్థం పురుషుని సాహచర్యంలో లేదని గ్రహించాను అంటుంది.

సీత పాత్రను ఇక్కడే తీర్చిదిద్దారు ఓల్గా. రాముడితో ఉండడమే సాఫల్యమనుకొని అడవికి వెళ్లింది. తర్వాత పరిత్యజించాడు. పురుషుడితో లేకున్నా జీవితం మాతృత్వంలో ఉందనుకొంది. శూర్పణఖ రామపుత్రులని తెలిసాక వాళ్లుంటారా అని వాళ్లుండరని స్పష్టం చేసింది. అక్కడ రాజ్యం ఉంది. ఇక్కడేముంది? అనుకొని మాతృత్వ పరిధి కూడా

చిన్నదే అని తెలుసుకొని భూదేవి ఆశ్రయంలో ఉంటానంటుంది సీత. అప్పటిదాకా పాతివ్రత్యం, మాతృత్వం మాత్రమే లక్ష్యాలు. వాటిని దాటి సీతపాత్ర విశాల ప్రపంచంలో వ్యక్తిగా జీవించే యోచన చేసేదిగా ఎదిగింది.

'మృణ్మయనాథం' కథలో అహల్యతో సీత సంభాషించి నూతన జ్ఞానిగా మారుతుంది. జనకుని రాజభవనంలో సీతారాముల పరిణయమైన మూడోరాత్రి సీతారాముల ఏకాంతంలో ఆరణ్యంలోని ఒక అద్భుతంగా సౌందర్యరాశిగా అహల్య గురించి చెప్పి సౌందర్యం మాటున సౌశీల్యం లేదని... ఆమెగురించి ఆలోచించవద్దని చెప్పడం మొదటి సన్నివేశం.

తర్వాత సీతని అహల్య అందంతో పోల్చినపుడు ఆమె గురించి కౌశల్య చెప్తుంది. 'స్త్రీలను భోగవస్తువులను కొంటారు గదా, పురుషులు, భర్తవేషంలో ఇంద్రుడు కోర్కె తీర్చుకొంటే... మహర్షి ఆమెను పరిత్యజించాడు.. అని చెప్పి బాధపడిన సీతని మరచిపొమ్మని ఊరడిస్తుంది.

భర్తతో అడవికి వెళ్లినపుడు అహల్యని కలుస్తుంది సీత. 'చెయ్యని తప్పుకి దోషిగా నిలబడ్డారు' అని జాలిపడుతుంది. రాముడు అందరి మగవాళ్లవంటి వాడు కాదంటుంది. పైగా ఇంద్రుడని తెలుసా ఆమెకి తెలియదా అని తెలుసుకొందా మనుకొన్న సీతకి చెప్పిన మాటలు నిజంగా మానవజాతి ఉన్నన్నాళ్లూ గుర్తుంచుకోవలసిన విషయం. ''నేను తప్పుచేసానని ఒప్పుకొంటే భరిస్తారు. పాపానికో ప్రాయశ్చిత్తం ఉంటుంది. తప్పుచేయలేదని వాదిస్తే నామీద జాలి పడతారు. అన్యాయంగా దోషం ఆరోపించారని నా పక్షం వహిస్తారు. కానీ నా తప్పొప్పులతో మీకేమిటి సంబంధం. అది విచారించే హక్కు, అధికారం మీకెవరిచ్చారంటే మాత్రం ఎవరూ సహించరు".

గౌతమునికి కూడా ఆ అధికారం లేదన్న ఆమె మాటలు సీత వొప్పుకోలేదు. సత్యం మారుతూ ఉంటుందంటే వొప్పుకోక

> ***"నేను తప్పచేసానని ఒప్పకొంటే భరిస్తారు. పాపానికో ప్రాయశ్చిత్తం ఉంటుంది. తప్పచేయలేదని వాదిస్తే నామీద జాలి పడతారు. అన్యాయంగా దోషం ఆరోపించారని నా పక్షం వహిస్తారు. కానీ నా తప్పొప్పులతో మీకేమిటి సంబంధం. అదివిచారించే హక్కు, అధికారం మీకెవరిచ్చారంటే మాత్రం ఎవరూ సహించరు".***

రాముని ప్రేమ సత్యం అంటుంది సీత. అగ్ని పరీక్ష సమయంలో 'లోకం ముందు రాముడు నిస్సహాయుడు అని సరిపెట్టుకొంటుంది.

వాల్మీకి ఆశ్రమంలో కలిసిన సీత సత్యం తెలుసుకొంటుంది. "పురుషుల అహం ఆస్తులలో ప్రతాపాలలో, విద్యలో, కులగోత్రాలలో వుంటే స్త్రీల అహం పాతివ్రత్యం, మాతృత్వంలో వుంటుంది. ఈ అహంకారాన్ని దాటాలని స్త్రీలకెవ్వరూ చెప్పరు. అహాన్ని జయించడం పురుషులకు ఆధ్యాత్మిక గమ్యమవుతుంది. అహాన్ని పెంచుకోవడం, ఆ అహంలోనే కాలిబూడిదైపోవడం స్త్రీల గమ్యమవుతుంది. నిన్ను నువ్వు తెలుసుకో. ఈ మొత్తం ప్రపంచంలో ఉన్నావు. ఒక్కరామునికే కాదు...." అని అహల్య స్పష్టం చేసి ఇంద్రుడి విషయంలో సత్యం చెప్పనా అని అడిగితే వద్దు దానికి ఏ అర్థమూలేదు. అని నిశ్చయంగా చెప్తుంది సీత.

లవకుశులని అంగీకరించిన తర్వాత సీతని పిల్లలకోసం రమ్మంటే "ఈ విశ్వంలోని అనంత ప్రాణశక్తి ప్రతీకలు వారు. విశ్వానికంతా చెందినవారని తెలుసు కొన్నాను.. అనీ భర్తా పిల్లలూ లేక ఏమవుతావు అంటే... ఈ విశ్వమంతా నాదే. నేను భూపుత్రిని. అని దృఢంగా చెప్పగలిగే ధీశాలిగా కనబడుతుంది. ఇలా మాతృత్వం, పాతివ్రత్యం.. అనే చిన్న పరిధి నుండీ సీతని చాలా సృజనాత్మకంగా బయటకి తీసుకువచ్చి 'విశ్వమానవి'గా నిలబెట్టారు వోల్గా.

'సైకత కుంభం' కథలో రేణుకాదేవి శిల్పాలయం గురించి తెలుసుకొన్న సీత – ఆమెని కలుస్తుంది. "ఆర్య ధర్మాలను అరణ్యాలలో విస్తరించడానికి బయల్దేరిన రాముడి భార్యవా అంటుంది రేణుక" తిరస్కారంగా. "పితృవాక్యపాలన కోసం వచ్చారంటుంది. అదీ ఆర్య సంస్కృతే..." అని ఆశ్రమానికి రమ్మంటే భర్త అనుమతితో వస్తానంటుంది. 'నీ భర్త వొప్పుకోడు.. అంటుంది రేణుక.' మీభర్తా, కుమారుడు మీకు అన్యాయం చేసి ఉండవచ్చు. అంతమాత్రాన అందరూ అలాంటి వారేననుకోవడం న్యాయంకాదు అని చాలా చక్కగా సీతచే చెప్పించి సీత ఎలాంటి నమ్మకాల నుండీ విముక్తమవ్వాలో తెలియజెప్పడానికి బీజం వేస్తారు ఓల్గా.

శిల్పరహస్యం తెలిసిన గొప్ప స్త్రీ రేణుక. తనంతట తాను సహజంగా నేర్చుకొంది. 'సైకత కుంభం' ఇచ్చి సీతకి తమ పాతివ్రత్యాలు ఈ సైకత కుంభాల వంటివేనని తెలుసుకొంటే వాళ్లు నిశ్చింతగా బ్రతుకుతారు అంటుంది. రేణుకది విద్య

> ***నిజానికి నేటివరకూ ఉన్న రామాయణాలన్నీ సీతపట్ల బోల్డంత జాలిని నింపి పెట్టాయేగానీ ఈ విధంగా చిత్రీకరించలేదు. ఈ కథలు సీతపట్ల జాలిని కలిగించవు. బాధిత స్త్రీలందరి సామూహికశక్తితో మహిళలు బాధలనుండీ విముక్తమయి శాంతిని పొందే మార్గం కనుక్కొన్నారనిపిస్తుంది.***

అని అంగీకరించరు. కేవలం పాతివ్రత్యం వలనే అంటారు. సైకత కుంభం బద్దలవడానికి కారణం వరపురుషుడిని చూసిందనడం ఎంత బాధాకరమో "తపస్సుద్వారా ఎంత జ్ఞానం సంపాదించినా భార్య పాతివ్రత్యం పై పట్టువదలని ముముక్షువులు" అని వ్యంగ్యంగా తెలుపుతుంది.

స్త్రీకి భర్తే ప్రధానమన్న సీతకి కాదని విద్యే ప్రధానమని తెలుపుతుంది. "భర్త తప్ప వేరే ప్రపంచం లేదనుకొంటారు స్త్రీలు నిజమే. కానీ ఏదో ఒక రోజు భర్త తన ప్రపంచంలో నీకు చోటు లేదంటాడు. అపుడు మనకు ఏ ఆధారం ఉంది. పుత్రులే జీవితగమ్య మను కొంటే వాళ్లు తండ్రి ఆధీనం లోకి వెళ్తారు. కఠోర సత్యం తెలిసాక చెప్పడం నావిధి..."

స్త్రీలకి పరాధీన బ్రతుకు వద్దని విప్పిచెప్పారు. 'నీ బలమే నీకు రక్ష... అని తెలుపుతుంది' రేణుక.

తర్వాత బిడ్డలకి విలువిద్య నేర్పి లవకుశులను తండ్రికి అప్పచెప్పడానికి సిద్ధపడుతుంది. సభలోకి వచ్చి సత్యం పలకమంటే 'నాకంత అవసర ముందంటారా? ఆ ప్రయాసకు అర్థముందంటారా?' అని సీత స్థిర, స్థిత అంతరంగంతో పలుకుతుంది.

'విముక్త' కథలో ఊర్మిళ పాత్ర ద్వారా సీతని బంధాలనుండీ, భ్రమలనుండీ విముక్తం చేసారు ఓల్గా. 14 సంవత్సరాలు అరణ్యవాసానికి వెళ్తున్న లక్ష్మణుడు ఆమె ఉన్నదనే స్పృహని కూడా చూపించనపుడు నిస్సహాయ ఆగ్రహం వచ్చి సత్యా గ్రహం మొదలెట్టింది. క్రమంగా భావాన్వేషిగా శాంతిని పొందింది. "సర్వదుఃఖాలకూ మూలం అధికారమే.... నేను ఎవరి అధికారానికీ లొంగను అపుడు నన్ను నేను విముక్తం చేసుకొన్న భావన నాలో ఇక ఒకే ఆనందం. గొప్పశాంతి. అని చెప్తూ నీ మీద అధికారాన్ని నువ్వే తీసుకో ఇతరులపై అధికారాన్ని ఒదలుకో. అప్పుడు నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు. అనే సత్యాన్ని చెప్తుంది. సీతకి శాంతినిస్తుంది.

వాల్మీకి ఆశ్రమంలో రాముడి ...శ్వమేథ యాగ వార్తవిన్న తర్వాత ...ర్మిళ సీతని కలుస్తుంది. 'నేను ...కుండా యాగం ఎలా?' ...డుగుతుంది. రాముడు వదిలినా ...ముడి చుట్టూ ఆమె ఆలోచనలు ...నవసరమైన ప్రశ్నలతో అశాంతి ...డడం అవివేకం కాదా? నువ్వు రాముడి నుంచి విముక్తం కావాలి. అని ఊర్మిళ బోధిస్తుంది. క్రమంగా రాముడిపై ప్రేమవద్దు, ద్వేషం వద్దనుకొంటుంది. విముక్తమవుతుంది. తర్వాత పిల్లల నుండీ కూడా విముక్తమవుతుంది. వాల్మీకి స్వర్ణ సీతని దర్శింపజేసి శాంతినిస్తాడు గానీ ఆమెని విముక్తం చేయలేక పోయాడు. బంధాల నుండీ విముక్త మవ్వాలని చెప్పే ఆధ్యాత్మిక పరులుకూడా వోల్గా సీతలో చూపిన స్థిత ప్రజ్ఞతని చూపలేకపోయారు.

మొదటి అనుభవ రాహిత్యంతో తన పాతివ్రత్యం, మాతృత్వం చాలా గొప్పవనుకొని... అనంతరం అనుభవంతో ఒక్కొక్కరి బాధని, భావనల్ని అర్థం చేసుకొంటూ విముక్తమ యిన సీతపాత్రలో క్రమోన్మీలనం, మార్పు తర్కబద్ధంగా సాగింది. నిజానికి నేటివరకూ ఉన్న రామాయణాలన్నీ సీతపట్ల బోల్డంత జాలిని నింపి పెట్టాయేగానీ ఈ విధంగా చిత్రీకరించలేదు. ఈ కథలు సీతపట్ల జాలిని కలిగించవు. బాధిత స్త్రీలందరి సామూహికశక్తితో మహిళలు బాధలనుండి విముక్తమయి శాంతిని పొందే మార్గం కనుక్కొన్నారనిపిస్తుంది.

అసలు ఏ పాత్రనయినా పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఆ పాత్రకి రెండు లక్షణాలుండాలంటారు. అవి (1) విశ్వసనీయత **(Credibility)** (2) సహేతుకత **(Motivation).** వాల్మీకి విడిచిపెట్టిన దానికి కొనసాగింపుగా సహేతుకతతో పాఠకుడిలో నమ్మకం కలిగేలా పాత్ర చిత్రణ చేసి ఊర్మిళ నుండీ బంధ విముక్తం, రేణుక నుండీ విద్యావశ్యకత, అహల్యనుండీ అధికార స్వభావం, శూర్పణఖ నుండీ శ్రమైక సౌందర్యానందం... సీత పాత్రకి అందించి విశ్వమానవిగా చూపారు ఓల్గా.

కవిత

# నిర్బంధంలో

- అనంతోజు మోహన్ కృష్ణ
8897765417

ఇప్పుడు మనుషులంతా
అంగవైకల్యంతో
భావరహితంగా ఉండాలి
గుడ్డి వాళ్ల లాగా నిత్యం
శూన్యంలోకే చూస్తుండాలి
ధ్యానంలో నిమగ్నమైనట్లు
అజ్ఞానంలో నిద్రనటిస్తుండాలి
మేధావులైతే కావచ్చు
కానీ,
వెర్రిబాగుల వాళ్లగానే ఉండాలి
బంధాలు,
అనుబంధాలు
తెగిన పూల తీగలా వాడిపోవాలి
సుఖ ధు:ఖాలు, పరామర్శలు
ఫేస్‌బుక్, ట్విట్టర్ లకే పరిమితమవ్వాలి.
ఉద్యమాలు అటకెక్కిన పిల్లిలా
వెలుగు మొహం చూడకూడదు.



ఇప్పుడంతా
ఊపిరిపై నిషేధాజ్ఞలు
మనుషులపై నిర్బంధాలు
లేని తిండి మీద ఆంక్షలు
ప్రశ్నిస్తే కేసులు
సోదాలు...గాలింపులు

అరెస్టులు...వేధింపులు
వారెంటులు...
అయినా బెదరకపోతే
హత్యలు...
విద్రోహం కానిదేది లేదు
నిందితులు కాని ప్రజలే లేరు
పాలకుల కళ్లకు పట్టిన
పొరలు
తొలగనంత వరకు
మన చుట్టూ అంతా
గాఢాంధకారమే!
కన్నీళ్ల దిగ్బంధాలే
లబ్ డబ్ గుండె సైతం
గప్ చుప్ నిర్బంధంలో...

# గజల్

శ్రీ నాగాస్త్ర
9640317108



ఈ అక్షరాలే దీపాలయ్యీ ఇంటిలో నన్ను గెలిపించాయి
ఈ అక్షరాలే తారకలయ్యీ వీధిలో నన్ను గెలిపించాయి

కనిపించని శక్తులేవో చీకటిదారుల్లో కూల్చేస్తుంటే
అక్షరాలే ఆయుధాలై బతుకుపోరులో నన్ను గెలిపించాయి

నాలుగు పడగల పామూ పగబట్టి కసికసిగా కాటేస్తుంటే
అక్షరాలే కావ్యశంఖాలై గురుసభలో నన్ను గెలిపించాయి

దరిద్ర పిశాచి పాదాలూ కట్టుబానిసగా తొక్కేస్తుంటే
అక్షరాలే పెన్నిధులై విజ్ఞానవేటలో నన్ను గెలిపించాయి

దుష్టగ్రహాలు ఏకమయ్యీ విషాన్ని చిమ్ముతుంటే ఓ నాగూ !
అక్షరాలే అమృతాలై ప్రజాగుండెలలో నన్ను గెలిపించాయి

## నచ్చిన రచన

# ఒక మేలుకొలుపు పాట





- కోసూరి రవికుమార్
9491336488


"వేట కుక్కలకు దొరికిపోయిన నెమలిపిల్ల" ఇప్పటీ.. రేపటీ.. పల్లెను నిన్నటితో ఇంత గొప్పగా పోల్చగలగటం గొప్ప భావుకుడో లేక ఆ నొప్పి అనుభవించిన లేక అనుభవిస్తున్న వాడో అయిన వ్యక్తి వల్లే సాధ్యం.

ఏ వాన చినుక్కో తడిసిన పచ్చగా పొటమరించాల్సిన పల్లెనేల, రెక్కలు విప్పాల్సిన నెమలి లాంటి నేల, వేటకుక్కల దాడికి వొరిగిపోతున్న వైనాన్ని పాయల మురళీకృష్ణ మేలుకొలుపుగా మనకు పాట కడుతున్నాడు.

'అస్తిత్వంవైపు' పేరిట నూట పదిహేను పుటల్లో జనజీవన వైషమ్యాల్ని చిత్రిక పట్టి చూపించాడు. ఈ సంపుటిలోంచి అలా అలవోకగా అక్షరాల మీదుగా ఏమీ పట్టనట్లుగా నడిచెళ్ళటం అస్సలు వీలుగాని పని. కొన్ని కవితలు మనల్ని అస్థిరతకు గురిచేస్తాయ్. మనోవ్యధ పడి మన నుంచి మనం బయటికి వచ్చి మనల్నే గుచ్చి గుచ్చి చూచుకుంటాం. మన అస్తిత్వంలోకి మనమే తొంగిచూచుకుంటాం. అదే 'అస్తిత్వం వైపు' గొప్పదనం.

ఇప్పుడు కొత్తగా రాష్ట్రమై... ముక్కుతో రెక్కల్ని దువ్వుకుంటూ పావురాయి పిల్లలా కనపడుతుందేమోనని ఎదురుచూస్తున్న జనం ముఖాల మీదకు ఇనుపరెక్కల్ని విదుల్చుకుంటూ పంటచేలను చదును చేసుకుంటూ వస్తున్న డేగను "పంట చేల్లేని పల్లెనుంచి" శీర్షికగా ఇలా చెబుతాడు.

*"ఓ సూర్యాస్తమయానికి ముందు*
*ఆ అమాయకపు పాటగాడు*
*ఒకానొక అస్తిత్వాన్ని జానపదపు*
*నాటుబండి ఎక్కించి*
*వీధిలోకి తీసుకొచ్చాడు*
*కొంగ రెక్కతో నింగిని విహరించడం*
*తుమ్మపూలు తురుముకుని*
*కొమ్మ కొమ్మకూ చెమ్మగా ప్రవహించడం*
*పంట కాలువగా మారి*
*పచ్చని మొలకల్లోకి*
*జీవజలమై చొచ్చుకు పోవటం"*

ఇన్ని చేసిన జనపథికుడు గళం వేగుచుక్క కాంతగా మారుతున్న వేళ అప్పుడెప్పుడో 2008లో తను అక్షరాల్లోకి వొంపిన ప్రతి చిత్రమూ ఇప్పుడు అమరావతిలో కళ్ళముందు కనిపిస్తుంటే కవి ఎంతగా మధనపడి చూపు సారించాడో కదా అనిపించక మానదు.

పల్లె అరచేతుల్లోకి గాజుగ్లాసుల్లోంచి ప్రవహించే

## కవిత

# ఎండమావి

- ఎస్.ముర్తుజా
9985543523



ఎన్ని ఉదంతాలు?
ఎన్ని దృష్టాంతాలు?
కన్నీటి పర్యంతాలే దృగంతాలు
అతివల హాహా కారాలతో
ఘూర్ణిల్లుతున్నాయి దిగంతాలు
జుగుప్స మేర మీరి సిగ్గుతో
చచ్చిపోతున్నాయి హృదంతాలు
స్వదేశీ లేదు
విదేశీ లేదు
తనా లేదు
మనా లేదు
కన్న కూతురు లేదు
తోబుట్టువు లేదు
ఆడదైతే చాలు
ఉచ్ఛనీచాలు
వావి వరుసలు గంగపాలు
ఇంగిత జ్ఞానం
ఎక్కడ ఇంకింది?
సభ్యతా సంస్కృతి
ఏ మూలనక్కింది?
మగపుట్టుకకు అర్థం మృగత్వమా?
నైచ్యం రూపుదాల్చిన
పైశాచిక తత్వమా?!
ఏమిటీ దారుణం?
ఎందుకీ మగతనం?
ఎటుపోతున్నాం మనం?
పసి మొగ్గల్ని
ముది వగ్గుల్ని రోగుల్ని
నిస్సిగ్గుగా నిర్లజ్జగా
నిర్భీతిగా నిర్నిమిత్తంగా
కబళిస్తూనే ఉంటారా
కర్కోటకుల కన్న ఘోరంగా?
నరభక్షకుల కన్న హీనంగా?
అత్యాచారాలు
హత్యాచారాలు
కొనసాగాలా ఇలాగే ఏళ్ళుగా పూళ్ళుగా?!
ఎండమావేనా ఈ గడ్డన అతివల భద్రత?
ఎక్కడ చచ్చిందీ లోకంలో ఆర్ద్రత?
చట్టాలున్నాయ్
సభావేదికలున్నాయ్
రక్షకభట నిలయాలు
సైనిక వలయాలు
ఎన్నో ఎన్నెన్నో ఉన్నాయ్
ఐనా ఒరిగిందేమిటి?
జరుగుతోందేమిటి?
ఆడది బలికాని రోజులేదు
ఆర్భాటాలు తప్ప
పరిష్కారం కానరాదు
ఎండమావుల్లో నీరు
ఎన్నడూ ఊరదు.

---

నులివెచ్చదనాన్నందించే ఆప్యాయపు కుంపటి 'అమ్ములు' ను ఎంత గొప్పగా రాజేశాడు మురళి. తను శూన్యంగా మిగిలిన క్షణాలను ఇలా అంటాడు. "ఓ సూర్యాస్తమయం వేళ అర్థాంతరంగా మరణించిన అమ్ముల్ని ఒడిలో పెట్టుకుని ఆ గుడిశె అలా స్థాణువైంది" అన్నట్టుగా అక్షరాల్తో పాటు మనమూ ఘనీభవించి పోతాం. తన జ్ఞాపకాల కన్నీటి సెగకు మనమూ కరిగి కన్నీరవుతాం.

"నీకు గుర్తుండే ఉండి ఉంటుంది. సగం భోజనం చేసి నువ్వెళ్లిపోవటం, తినిపించిన నా చేతులు నాకిప్పటికీ సగమే తినిపిస్తున్నాయి. " ఒక కోల్పోయిన భావపు నిలువలేని తనాన్ని కవిత్వంగా ఎలా మలుపుకోవచ్చో ఈ మలుపుల్లో పాయల గొప్పగా బొమ్మ కడతాడు. అతడితో పాటు మనమూ మన జీవితాల్లోని దొర్లిపోయిన ఏ అరుదైన క్షణాలనో గుర్తుచేసుకుంటాం.

ఇలా ప్రతి కవితలోనూ అంతర్లీనంగా ఒక నొప్పి లోలోపల్నించి ఏదో సల సల మని కాగుతున్న సెగలు పారేసుకుంటున్న వాటిగురించి... మరచిపోతున్నవాటి గురించి, కరిగిపోతున్న వాటి గురించి, కవిత్వ మంతా కనిపిస్తుంది. ఒక్కడిగా మొదలైన వేదన సామూహికంగా అనుభవిస్తున్నట్లుగా అనిపిస్తుంది. తెలీకుండానే వేలుకు వేలు బిగుతుగా చుట్టుకుని పిడికిలిగా అనాలోచితంగానే పైకి లేస్తాం.

అదీ పాయల మురళీకృష్ణ అస్తిత్వం వైపు ప్రభావం. ఛిద్రమైపోతున్న వాటినీ, దూరమవుతున్న వాటినీ శీర్షిక నుంచే గొప్ప ఎత్తుగడతో కవిత్వీకరిస్తాడు ఈ కవి.

అతిశయోక్తులు కావివి. అతిశక్తివంతంగా అక్షరీకరించటమెలాగో తెలిసిన వాడి గురించి నాలుగు మాటలు అంతే... చదువుదాం కన్నీటితో తడుద్దాం. పెరపెరలాడుదాం. 'అస్తిత్వం వైపుగా' అడుగులు వేద్దాం.

కథ

# పుష్కర కెరటం

- చల్లా సురేష్ కుమార్
8500174354



**చా**లా రోజులకి దూరపు ప్రయాణం చేయాలని మనసులో కోరిక పుట్టింది. అత్త, మామ, భర్త, పిల్లలు ఇదే లోకం. విశాలమైన లోకం బయట ఉంది. ఎదురింటి పిన్ని గారిని ఉసిగొలిపాను. వస్తుందో రాదో? నిర్ణయం రాకమునుపే, ఆమెనే అడ్డం పెట్టుకుని, ప్రయాణపు దరఖాస్తుని భర్తకి విన్నవించాను. తను లేకుండా అంత దూరం ప్రయాణమా? అన్న సంశయం పక్కన పెట్టి, పిన్ని గారితో అనే సరికి పది శాతం బెంగతో నా భర్త ఒప్పుకున్నాడు. పిన్ని గారికి సుమారు యాభై ఐదు సంవత్సరాలు ఉంటాయి. దైవ భక్తి ఎక్కువ. నిత్యం పూజలు పునస్కారాలు చేస్తోంటోంది. ఆమెకీ ఇల్లే లోకము. అచ్చం నాలాగే నన్ను అడ్డం పెట్టుకుని భర్తని ఒప్పించిందట. ప్రయాణానికి పుణ్యకాలం చూసింది.

స్నేహితురాలు వసంతకి ఫోన్ చేశాను. నేను, వసంత యూనివర్సిటీలో కలిసి చదివాం. ఒకే మంచం, కంచం. అది అనుమతి తీసుకో అక్కర్లేదు. మాలాంటి సాంప్రదాయ భార్య కాదది. భర్త రాకమునుపే అన్నం తినేస్తుంది. దీపం పెట్టదు. వ్రతాలు చెయ్యదు. అందుకే ఫోన్ చేసీ చేయగానే నా మాట కాదనక, భర్త అనుమతి సంబంధం లేకుండా వస్తానంది. తనకి శ్రీకాకుళం, మాకు విజయనగరం నుండీ పుష్కర స్పెషల్ ప్రత్యేక రైలులో టికెట్స్ బుక్ చేసింది. అలా ముగ్గురుమూ పుష్కర యాత్రకి బయలుదేరాము.

ఉదయం తొమ్మిది గంటలకి మా ప్రయాణపు కాలం దగ్గర పడింది. ఎనిమిది గంటల కల్లా ఎస్5 పెట్టె ఆగేచోట ఫ్లాట్‌ఫాం పైకి చేరుకున్నాము. పిన్నిగారు ప్రయాణపు సరంజామాతో బిగించిన పెద్ద బ్యాగు పట్టుకుంది. నేను మాత్రం, కాలేజీకి వెళ్ళే అమ్మాయిలాగ ఒక చిన్న బ్యాగు పట్టుకున్నాను. రైలు పదకొండు గంటలకి ఫ్లాట్ ఫాం చేరింది. కిక్కిరిసిన పెట్టెలోకి ఇద్దరమూ ఎక్కాము. రిజర్వేషన్ పెట్టెనా

జనరల్ పెట్టెలా ఉంది. మా రిజర్వ్ బెర్త్‌ల దగ్గరకు చేరుకున్నాము.

వసంతతో పాటు మరో పది మంది దగ్గర ఆడవాళ్ళు సదురు కున్నారు. అభివాదం చేస్తూ వసంత చేయి ఎత్తింది. పక్కవారిని చూశాము. ఎవరూ లేవలేదు. లేకుండానే జరుగుతూ కూర్చోవడానికి స్థలం చూపించారు. “నెల రోజుల క్రితం రిజర్వ్ చేసుకున్నాము. మా బెర్త్‌లవి! లేవండని” పిన్ని గారు అనేసరికి అతి కష్టం మీద ఒకటి ఖాళీ చేశారు. చేయి పట్టుకు లాగి వసంత తన పక్క కూర్చోబెట్టుకుంది. మొత్తానికి రైలు రెండు గంటల ఆలస్యంగా బయలు దేరింది.



వసంతకి పిన్ని గారిని పరిచయం చేశాను. పిన్ని గారూ, వసంత రెండు విభిన్న ధృవాలు. మధ్యలో నేను నలిగిపోతానని ముందు నుండీ నాకు తెలుసు. పిన్నిగారు లేకపోతే ఈ ప్రయాణమే నాకు లేదు. అలాగని ఆ ఒక్క ఆమెతోనే ప్రయాణం చేయలేను. అందుకే వసంత! ఇదీ నా పరిస్థితి.

పక్క వారితో పిన్నిగారి తగువులూ, మా ఇద్దరి సంసార విశేషాలతో మొత్తం ప్రయాణం పూర్తయింది. దిగాక ఇళ్ళకి క్షేమ సమాచారం అందించాం. నదిపై రెండు వంతెనలు విద్యుత్ తీగలతో అలంకరించారు. లేజర్ షోతో ఆకాశంలో వెలుతురు చీకటని రంధ్రాలు చేస్తోంది. అప్పటికే పుట్టలోకి చేరిన చీమల్లా పుష్కర స్నానాలకి జనాలు చేరుకున్నారు. పుష్కర ఘాట్ పైనే పడుకుని ఉన్నారు. మా కోసం పూల పాన్పులు లేవు. పిన్నిగారు పుష్కర స్నానానికై అగ్ని గుండంలో దూకమన్నా దూకేస్తారు. ఆమె పర్వాలేదు. వసంతే! సముదాయించడానికి ముందస్తుగా పెట్టే ముఖ కవళికలు అప్రయత్నంగా తెచ్చుకుని వసంతని చూశాను. చిరునవ్వు నవ్వింది. ఆమెలో నచ్చే విషయం అదే. అర్థం చేసుకోగలదు. ప్రతీ విషయానికి సముదాయించక్కర్లేదు. నిశ్చింతగా చీమలలో చీమలమై మేమూ ఒళ్ళు తెలియక ఘాట్ మీదే నిద్రపోయాము.

ఎప్పుడు లేచారో, పిన్ని గారు ఉదయం 4.30కి నిద్రలేపారు. శుచిగా స్నానం చేశాకనే నదీ స్నానం అంటారు. వసంత చిరాగ్గా మొహం పెడుతూ లేచింది. స్నానం చేసీ మూడు మునకలేద్దామే అంటే ఎలాగూ చేస్తాం కదా మళ్ళీ ఎందుకు అంది. వసంత వెటకార ప్రశ్నలు వేస్తూంటే పిన్నిగారు ప్రతీరోజు టీవిలో భక్తి సమాచార జ్ఞానంతో చిటపట పేలుతూ జవాబులివ్వడం మొదలెట్టింది. ఇద్దరి మధ్య లేచిన దగ్గర నుండీ మొదలైంది యుద్ధం. రంజాన్ మాసపు ఆఖరి రోజు. నెలవంక రూపాన చంద్రుడు మమ్మల్నే చూస్తున్నట్టున్నాడు. రేపొద్దున్న సూర్యుడూ అంతటినీ చూస్తాడు. ఎవ్వరొచ్చినా ఏమీ చేయరు. ఒడ్డుని ప్రజలు తాకకుండా ఇనుప కంచె వేశారు.

“నదిని జైలులో పెట్టినట్టుంది!” అని పిన్ని అంది.

“ఉరకలేస్తూ సాగిపోతున్న నదిలో ఏ మార్పూ లేదు. సాగిపోతోంది. మనుషులనే పిలిచి జైలులో పెట్టినట్టు లేదూ?” వసంత అంది.

సిబ్బంది స్నానాలకు ఘాట్‌ను సమాయత్తపరచడంలో తలమునకలవుతున్నారు. చినచిన్నగా తెల్లవారవుతోంది. జనం కొంచెం కొంచెం చేరుతున్నారు. ఫ్లోరోసెంట్ లైట్ల రంగు, సూర్యుడి లేత వెలుతురులో కలిసి ఘాట్ సరికొత్తగా ఉంది.

ఒక ముసలామె మా ముందర చేరింది. మామ్మా ఎక్కడ నుండీ వచ్చారని అడిగాను. ఏలూరంది. ఆమె బంధువులను వెతుకుతూ మీ వాళ్లేరని అడిగాను. వయసొచ్చినప్పటి నుండీ.. ప్రతీ పుష్కరానికి వస్తున్నానంది. భయమే లేదట. వసంతలా స్వేచ్ఛా జీవి అనుకున్నాను.

మరో ప్రక్క పంచెకట్టు, భుజంపై టర్కీ తువ్వాలు, సన్నగా రివటలా ఒక పల్లెటూరాయన ఉన్నాడు. మీ దేవూరండీ అంటే శీకాకొలం అన్నాడు. భార్య కూతుళ్ళను రెండు చేతులతో బంధించి, జనంపైన పడకుండా కాపాడుతున్నాడు. బస్సులో వచ్చేసరికి నడుములు ఇరిగిపోనాయని అతని భార్యంది. వాళ్ళ యొక్క సుమారు పన్నెండేళ్ళ కూతురు ఖాళీ వాటర్ బాటిల్ పట్టుకుని ఉంది.

సుమారు ఇరవై ఆరు సంవత్సరాలు ఉంటాయి. చామనఛాయ రంగు మరీ సన్నం కాదు. జిడ్డోడుతున్న మొహంలో అపుడే ఉదయిస్తోన్న సూర్యుని వెలుతురు జిగేల్‌మనిపిస్తుంది. నా వెనుక ఒక అమ్మాయి, ఆమె ప్రక్కన అంతే వయసుగల అబ్బాయి ఉన్నాడు. ఆమె మెడలో హారం గిల్టు నగని చూసీచూడగానే తెలిసిపోతోంది.

జనాలందరూ కలిస్తే భలే సరదాగా ఉంటుంది. ఎవరి పండగని అనవసరం. పిన్నిగారిని చూస్తూ, వివిధ రకాల

మనుషులను కలుసుకోవచ్చని వసంత అంది.

"పండగంటే సరదా ఉండదూ?.. మీ దోస్తు ఏమిట్లు?" జవాబిస్తూ చెవిలో పిన్నిగారు అడిగారు. వినబడనట్టు మొహం పెట్టి, ఏమిటన్నట్టు కళ్ళతో అడిగాను. ఎక్కడో ఎవరో బాధపడుతో ఉంటే మన ఆనందాన్ని ఎందుకు వదులుకుంటాం. నది సాగిపోతున్నట్టే అందరమూ.. బాధ సంతోషం ఎలా ఉన్నా ఖచ్చితంగా ఏదో ఒక రోజు ఒకానొక అందరి స్థితి ఒకటేనని నదిని చూస్తే అనిపించడం లేదా అండీ.. పిన్ని గారూ! వసంత దీర్ఘం తీసింది.



అదెలా అవుతుంది పిల్లా.. చేసుకున్నోళ్ళకి చేసుకున్నంత పుణ్యం, పాపం! మూడు మునకలు వేసుకుని, పాపం చేసినట్టే నిశ్చయపరచి, వసంతని కడుక్కోమంది. అందరూ కడుక్కోవాలని తీర్మానం చేసింది.

ఆ ముసల్దాన్ని చూడు కళ్ళు లేవు. ఆవిడేం పాపం చేసుంటాదని వసంత అంది.

"ఆమె బంధువులకు ఎంత పుణ్యమో తల్లికి గొప్ప సేవ చేస్తున్నారు" పిన్నిగారన్నారు.

సంభాషణ దారి మళ్ళించడానికి ఖాళీ వాటర్ బాటిల్ ఎందుకీ అమ్మాయి పట్టుకుని వదలట్లేదని ప్రక్క పల్లెటూరామెను అడిగాను. నదినీళ్ళు పట్టుకెళ్ళి దాని అప్పజెళ్ళల్లకి సిలకరించడానికిని భార్యను చూస్తూ ప్రక్కాయన అన్నాడు. భార్య చిరునవ్వుకి ఆయనకి కోపం వచ్చింది. డబ్బులు తీయరు, పుణ్ణెం మూడు మునకలెయ్యకుండా కొట్టేడానికని ఆమె అప్పజెళ్ళళ్ళని ఎగతాళి చేశాడు. నవ్వు మాయమయిపోయి, గుంతలాగుండి. పిసరంత కొవ్వులేని భర్త బుగ్గపై భార్య పొడిచింది. అందరమూ నవ్వాము. వసంతైతే పగలబడి మరీ నవ్వింది.

పగలబడి నవ్వుతోన్న వసంతని చూసీ పిన్నిగారి నుండీ మూల్గులు ఎక్కువయ్యాయి.

''అటు చూడండి.. ఐఫోన్, చేతికి నాలుగు ఉంగరాలు, ప్రియతమ నాయకుడికి స్వాగతమట!... దారి పొడుగునా చూస్తూనే ఉన్నాను. మోనాలిసా చిరునవ్వులా.."

ఒక రాజకీయ నాయకుని కట్ అవుట్ ఉంది. అందులో వింత ఏముందన్నట్టు అందరమూ చూశాము.

"ఒక్కటి చాలదా? స్వాగతానికి పబ్లిసిటీ కోసం అదంతా.. ఆ చిరునవ్వుకి అర్థం చెప్పనా పిలిస్తే పనీపాటా లేకుండా వచ్చీసారీ ఈ అమాయకు లన్నట్టు అనిపించలేదూ? "అందరి మధ్యలో ఒక అణుబాంబు పడేసింది వసంత.

"నీకనిపిస్తుందా?... అతనికా? నీ దృష్టిలో మేమంతా అమాయకులమా?" పిన్నిగారు కోపంతో అన్నారు. నాకూ కోపం వచ్చింది.

"నిన్న మనతో పాటూ వచ్చారు చూడు వాళ్ళు– దీనికోసం పదివేలు అప్పు చేసుకొచ్చారంట!.. ఇన్ని ఏర్పాట్లు ఎలాగూ చేస్తున్నారు. వేరే మాపనం అక్కర్లేదు ప్రజల స్థితి గతులను ప్రభుత్వం ఇప్పుడే అంచనా వేసేస్తే బావుణ్ణు ఖర్చులు తగ్గుతాయి." వసంత అంది.

ఎవ్వరికీ వసంత ఆంతర్యం అర్థమవ్వలేదు. మౌనం చేదిస్తూ "అయితే..?" అని నేను ప్రశ్నించాను. "ఒక్కసారి అటు చూడండి. ఎవ్వడైనా ఒక్క పెద్దమనిషైనా అందులో ఉన్నాడా? వాళ్ళు వేచుండాల్సిన అవసరం లేదు. వాళ్ళకి ప్రత్యేక ఘాట్లు ఉన్నాయి. డబ్బు తెలివి తేటలూ ఉండాలి ఆ ప్రత్యేకతకు. "వసంత అంది. ఎవ్వరమూ ఆమె వివరణని వినలేదు. ఏమ్రోయ్ మీరెందుకొచ్చారు.. ఏం మాట్లాడుతున్నారు. అమాయకులు అన్న జనం మధ్యా మీరూ ఉన్నారు. ఇన్ని తెలివి తేటలుండి మీరెందుకొచ్చారు? పిన్ని ప్రశ్నించింది.

"మిమ్మల్ని కాదండీ.. పిన్ని గారూ!" వసంత అంది.

"గొప్ప దోస్తుని తీసుకొచ్చావమ్మ" పిన్నిగారనీసరికి నువ్వూ వెళ్ళిరా అని వసంతని విసుగ్గొని పంపించేశాను.

"బాధలు లేని మనుషులు ఎవరుండరు? తలలు పండిన నాయకులు, పీఠాధిపతులు నుండి సామాన్యులు వరకూ వారి యొక్క సమస్త బాధలను దైవత్వం, ఆధ్యాత్మిక తరంగాలు తీర్చుతాయని వస్తే అమాయకత్వం ఎలా అవుతుందని పించింది. మీరేమీ దాన్ని పట్టించుకోకండి." పిన్నిగారిని సముదాయించ మొదలుపెట్టాను.

చుట్టూ జనం మా వాదననే చూస్తోన్నారు. అందరి ఆలోచనలను దారి మళ్ళించడానికి మీకు తెలుసా.. "ఈసారి మంగళ హారతికి ప్రపంచ స్థాయి గుర్తింపు కోసం ఒక ప్రముఖ

దర్శకుడు పర్యవేక్షణ వహిస్తున్నాడు.” అన్నాను.

అపుడే ఒక పెద్దమనిషి ప్రత్యేక ఘాట్ విడిచి సాధారణ ఘాట్లో పూజలు ప్రారంభించారని మాట్లాడుకుంటొన్నారు. ఘాట్ విద్యుత్ అలంకరణ గుర్తింపు తగ్గిపోయింది. ఆపుజేశారు. సమయం భారంగా గడుస్తోంది. వసంత ఎంతకీ రాలేదు. పిన్నిగారిని అక్కడుంచి విచారణా కేంద్రం దగ్గరకు వెళ్ళాను. ఒకవైపు నదీస్నానపు గొప్పతనాన్ని మైక్‌లో వివరిస్తున్నారు. ఘాట్‌ను పరిశుభ్రంగా ఉంచమని, హెచ్చరికలు ఇస్తున్నారు.



సూక్ష్మజీవులకి పండగలంటే సరదా కాబోలు! ఈ కొలీ బ్యాక్టీరియా బారిన పడకుండా మూడు నిమిషాల్లో స్నానం ముగించమని ముందు రోజు పేపర్లో మరో హెచ్చరికను చదివాను. వసంత కోసం ఎనౌన్సుమెంట్ ఇచ్చి యదాస్థానానికి తిరిగి వచ్చాను. చూస్తే పిన్నిగారూ లేరు. ముగ్గురుమూ విడిపోయాము.

ప్రముఖ వ్యక్తుల కాన్వాయ్‌లు నేరుగా ఘాట్‌కు దగ్గరకొచ్చి నిలిపివేశారు. అప్పటికే రాత్రి నుండీ వేచివున్న జనాలు, తండోపతండాలుగా వస్తోన్న జనాలతో ఊరంతా కిక్కిరిసింది. వంతెనపై నిలిచిపోయిన రైలు నుండి జనాలు అక్కడే దిగిపోయి ఘాట్‌కు చేరుకుంటున్నారు.

సుమారు రెండువేల కోట్ల ప్రజాధనం పుష్కరాలకై కేటాయించారట. సి.సి కెమెరాలు పట్టనంత జనం! మీద నుండి డ్రోన్‌లు తిరిగి అంతటినీ పర్యవేక్షిస్తున్నాయి. అక్కడక్కడ వెనక కొంతమంది ఎస్సైలతో ఐపిఎస్‌లు తళుక్కుమంటున్నారు.

వాళ్ళిద్దరిని వెతుకుతూ వెళితే వాళ్ళు ఇక్కడకే తిరిగి రావొచ్చని ఊహించాను. ఎక్కడైతే విడిపోయామో అక్కడే కదలక ప్రతీ ముఖాన్ని పరిశీలించడం మొదలెట్టాను. వెనకున్న యువతీ యువకుడు, ఎదురున్న ముసలామె ప్రక్కనున్న భార్య భర్త కూతురూ కుటుంబమూ, ఒక సమూహం అయ్యి కొంతసేపు కష్టమూ, సుఖమూ మాట్లాడుకొన్నాము.

ఎంత నెమ్మదిగా మాట్లాడినా చెవిలో వినబడినట్టే మాట్లాడుతోన్న వెనుక అమ్మాయి అబ్బాయిల మాటలు పరిశీలిస్తే అమ్మాయి తల్లిదండ్రులను పుష్కరాల్లోనే ఎక్కడో వదిలేసి వచ్చింది. బొంబాయి పారిపోయి రెండు నెలలు పోయాక వచ్చి పెళ్ళి చేసుకుందామన్న అబ్బాయితో వాదించింది. చివరకు ముందు భద్రాచలం పోయి పెళ్లైన తర్వాత ఎటైతే అటుపోదామన్న అమ్మాయి మాటే నెగ్గింది. ఒక నిర్ణయానికి వచ్చారు.

బ్యాగులో వెయ్యి రూపాయలు ఒట్టుకొచ్చి, మూడు మునకలయ్యాక తుర్రుమందామని అమ్మాయి అబ్బాయితో అన్నప్పుడు వాళ్ళతో పాటు నేనూ నవ్వుకున్నాను. వసంత ఉంటే బావుణ్ణు.

ముసలమ్మ ఈ వయసులో రామా క్రిష్ణా అనుకోకా ఎందుకీ బాధలని వెనుకమ్మాయి అంది. మరి పుణ్యం? మీరెందుకొచ్చారని నవ్వుతో ముసలామె తిరిగి ప్రశ్నించింది. ఆ నవ్వుకి అర్థం వాళ్ళు ఎందుకొచ్చారో తెలిసినట్టు ఇద్దరూ ఒకరినొకరు చూసుకొని నవ్వుకున్నారు. సమాధానం ఇవ్వలేదు.

మీరెందుకోసం వచ్చారని భార్యని ప్రశ్నించాను. అందరూ వచ్చారని వచ్చామని భర్త జవాబిచ్చాడు.

ఒక్కొక్కరివి ఒక్కొక్క కారణాలు. అసలు సిసలైన భక్తితో పిన్నిగారు. నా కోసం వసంత. నేనెందుకోసం అని ప్రశ్నించుకొంటే విశాలమైన ప్రపంచం చూడడానికీ!

ఊపిరికై ఎగసీ ఎగసీ అరికాలు నొప్పులు పుట్టి, సప్పబడి ఒకరిమీద ఒకరు సోలిపోతున్నారు జనాలు. ప్రత్యేక ఘాట్‌లు విడిచి సాధారణ ఘాట్‌కొచ్చిన పెద్దమనిషి పూజలు ఇంకా పూర్తవ్వలేదు. గాలి స్తంభించిపైన ఎండ సుర్రుమం టోంది. వెనుక వీపుపై అమ్మాయి వెచ్చని ఊపిర్లు తగులుతున్నాయి. ప్రక్కాయన భార్య కూతుర్లుపై పడుతున్న జనాల్ని తోపుతోసి బూతులు తిడుతున్నాడు.

ముందటి ముసలామె పూర్తిగా నాపై సోలిపోయింది. వసంతా, పిన్ని ఎక్కడ ఉన్నారో అన్న ఆందోళన బయలు దేరింది. అందరూ నలభై, యాభై సంవత్సరాల వయసు వాళ్ళే. భుజాలపై చిన్నారులను అటూ ఇటూ మార్చుకుంటున్నారు. కాలి వేళ్ళు నులిపేస్తనవంటూ ఎక్కడో ఎవరో తగువాడుకుంటున్నారు. ఎటుచూసినా కొవ్వు పేరుకుపోయిన చేతుల దండలు, బాణెడు పొట్టలు, ఆ వయసులో మిగిలేది అవే వాళ్ళకి. ఏదయినా ఐతే తప్పించుకోలేని పరిస్థితి.

ఇంతకి ముందటి మీద ఇప్పుడు పరిస్థితి మరీ బిగుతైంది. నీటిలో తరంగాలలా ఏ ఒక్కరు నదురుకున్నా తూలుతూ తూగుతూన్నాము. బయట పడదామా అంటే ఇసకేస్తే రాలనంత జనం. అందరమూ ఇరుక్కుపోయాము. గుండెలు గడగడా కొట్టుకుంటున్నాయి. సరదా తీరిపోయింది.



మూల్గుతో రొప్పుతో, ఆయాసపడి, సహనం కోల్పోయి, కోప్పడుతో, తిట్టుకుంటోన్న సామాన్య జనాల బాధలు కనిపించాయి. మూడు మునకలు ప్రక్కనుంచితే ఎలా బయట పడతామో అన్న స్థితికి వచ్చేశారందరు.

ఏదో తెలియని శక్తి కట్టి పడేసింది. నిలవడానికి సత్తువ లేదు. అసహనం కట్టలు తెంచుకుంది. ఊపిరాడని పరిస్థితి. జరగబోవు ప్రమాదం కళ్లముందు కదలాడుతోంది. చిన్నగా తోపులాట ప్రారంభం అవడానికి సూచనలు కనిపిస్తున్నాయి. వసంత పిన్నితో వాదించిన వాదంలో కొంత నిజం కనిపించింది. పిన్నిని సమర్థించిన నా అభిప్రాయం కొద్దిసేపటికే మారిపోయింది. దౌర్జన్యం, అజ్ఞానం, అసహనం, మూఢనమ్మకం, కనిపించాయి. సొమ్మసిల్లిపోతున్నారు. అమ్మో బాబోయ్ హాహాకారాలు మిన్నంటాయి.

ఘాట్‌కి మొత్తం మూడు ప్రధాన ద్వారాలున్నాయి. రెండులోపలికి, ఒకటి బయటకు పోవడానికి ప్రత్యేక పూజలు అయిపోయాయి. ఎంత తొందరగా మునకలేద్దామా అన్న ఆదుర్దా ఒకవైపు. పేరుకుపోయిన జనాలును ఎలా నిర్వహించాలో సిబ్బందికి ఒక ప్రణాళికలేదు. ఇనుప గేటు గొళ్ళెం శబ్ధం అయ్యింది.

అంతే.. అదుపు పూర్తిగా తప్పిపోయింది. "రాకాసి కెరటం!" ఏదో తెలియని శక్తి నేలకి పడకొట్టింది. నా కింద ఎవరో? మీద ఎవరో? ఊపిరాడని గదిని కట్టారు. పై నుండి తొక్కుతున్నారు. ఎముకలు ఫట్ ఫట్‌మని విరుగుతున్నాయి. ఊహించని పరిణామం. బలమైన మానవ కెరటం విరుచుకుపడింది. రోదనలు ఆకాశాన్నంటాయి. ఎముకలు పిండయిపోయి ఎర్రటి శరీర ముద్దలు మిగిలాయి. కొంతసేపటికి కెరటం చల్లారింది.

ఇంకా ఎక్కడో మిగిలిన శక్తి, మేల్కొలిపింది. కాళ్ళు, చేతులూ స్పృహ కొచ్చాయి. చూసేసరికి వెనుకున్న అమ్మాయి తన అమ్మానాన్నలను వెతుకుతోంది. అబ్బాయి కెరటం మీద పడకమునుపే ఆ అమ్మాయి మెడనే పట్టుకుని, విచక్షణా రహితంగా గుంపుని తొక్కుకుంటూ బయటపడ్డాడు. నా కింద నలిగిన ముసలమ్మని సిబ్బంది స్ట్రెచర్‌పైకి ఎక్కించారు. ప్రక్కనున్న పల్లెటూరాయన, కూతురుతో జీవం లేని భార్య శరీరాన్ని పట్టుకు రోదిస్తున్నాడు.

చుట్టూ జనంలో నిస్సహాయస్థితి ఏదో శక్తికి బదలాయించబడి మోసుకొచ్చిన అమాయకపు శరీరాలు నిర్జీవమై కనిపించాయి. పాపం వాళ్ళలో ఏ పొరపాటు లేదని చూసిన ఎవరికైనా అనిపిస్తుంది. అందులో ఏ ఒక్క పెద్ద మనిషి కనిపించినా నేనన్నది తప్పయ్యేదేమో!

ప్రభుత్వానికి ప్రజలక్కర్లేదు. ప్రజలకు మరో దిక్కులేదు. గాలికి ఎగిరిన ఎంగిలాకు, నిప్పుకి మిగిలిన బూడిద, నీటికి కొట్టుకుపోయిన ఎండుటాకు, పల్లానికి దిగజారిన నీరు, కెరటానికి కొట్టుకొచ్చిన అమాయక జనం. ఎదురొడ్డి నిలబడే శక్తి, తెలివి ఎవరిస్తారు? కొట్టుకుపోని మహామహులు ఐశ్వర్యం.. పదవీ కలిగిన అసామాన్యులు.

ఘాట్ కొంతసేపటికి అదుపులోకి వచ్చింది. రక్తంలో మునిగిన ఘాట్‌ను పట్టించుకోకుండా గంభీరంగా నది సాగిపోతుంది. అదృష్టవశాత్తు పిన్నిగారిని ఆమె భక్తి బతికించినట్టుంది. నా దగ్గరకొచ్చింది. నా పరిస్థితిని కనీసం కనుక్కోకుండానే నువ్వు, వసంత ఇద్దరూ కలిసి వచ్చేయండి నేను వెళ్ళిపోతున్నానని ఘాట్ నుండి పరిగెట్టింది.

ఆ తర్వాత వసంత కూడా వచ్చింది. గుండెలను అదిమింది. కృత్రిమ శ్వాసని అందించింది. ప్రాణాలొచ్చాయనగానే గోడకి ఆనించి జనంలోకి పరుగు తీసింది. నన్ను పట్టించుకోకుండా మరింత మందికి ప్రథమ చికిత్స అందిస్తోంది. సుమారు అరగంట వరకూ వైద్య సహాయం, కిక్కిరిసిన జనాల వలన అందలేదు. వేడెక్కిన వసంత శరీరాన్ని నదిలో చల్లబర్చుకుని వచ్చాక ఆసుపత్రికి అటు నుండి ఇంటికి పయనమయ్యాము. పుష్కరాలు ప్రారంభమయ్యాయి. మానవత్వం మనిషి నుండి ఒక పక్షిలోకి దూరి బాధపడుతూ ట్వీటింది.

# మహిళను అష్టావక్రంగా చూపిస్తున్న దృశ్య మాధ్యమాలు

- ప్రొ॥ చందు సుబ్బారావు
9441360083



మహిళల పట్ల నీకెటువంటి అభిప్రాయాలున్నాయో అవి నీలోని ఆధునిక సంస్కారానికి కొలబద్దలని ప్రపంచ మేధావులు అంగీకరించారు. అందుచేతనే ప్రఖ్యాతులు చాలా మంది ఉదారవాదులూ, ప్రతిభావంతులూ అయివుండి కూడా మహిళల పట్ల 'సొంత' అభిప్రాయాలు కలిగి వుండి అవి చెప్పలేక మౌనం వహిస్తారు. తమను 'వెనుకబడిన వ్యక్తులు'గా చూస్తారేమో, అంచనావేస్తారేమోనన్న భీతి...న్యూనతా భావం...!, అలాంటిది మహిళలను చిత్ర విచిత్రంగా రూపొందించి సాహిత్యంలో గాని, నాటకాది కళాస్వరూపాల్లో గాని చలామణి కావటం కష్టం. అభివృద్ధి నిరోధక, యధాతథవాధ వెనుక చూపు వారంటారన్న దుగ్ధ. అలాంటిది, అన్నింటికంటే శక్తివంతమైన దృశ్యమాధ్యమాలైన టీ.వీ, సినిమాలు మహిళలను వికృతంగా రూపొందించి, వాళ్ళ వికార వ్యాపార అవసరాలను తీర్చుకుంటున్నాయి. అవతల సమాజం ఎంతో ముందుకు పోతున్నా, స్త్రీవాద, దళితవాద, ప్రగతిశీల మహిళా శక్తులు కదిలి కదం తొక్కుతూ సాగుతున్నా ఇలా భయంకర రూపాల్లో మహిళలను చూపించటం ఎంతటి సాంస్కృతిక ద్రోహం... సామాజిక నేరం...వీరెందుకిలా చేస్తున్నారు..?

*శక్తివంతమైన దృశ్యమాధ్యమాలైన టీ.వీ, సినిమాలు మహిళలను వికృతంగా రూపొందించి, వాళ్ళ వికార వ్యాపార అవసరాలను తీర్చుకుంటున్నాయి. అవతల సమాజం ఎంతో ముందుకు పోతున్నా, స్త్రీవాద, దళితవాద, ప్రగతిశీల మహిళా శక్తులు కదిలి కదం తొక్కుతూ సాగుతున్నా ఇలా భయంకర రూపాల్లో మహిళలను చూపించటం ఎంతటి సాంస్కృతిక ద్రోహం... సామాజిక నేరం...వీరెందుకిలా చేస్తున్నారు..?*

"మహిళలకు ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో సమాన ప్రతిపత్తి లభించాలనీ, తమ జీవితాన్ని తాము నిర్ణయించుకున్న విధంగా గడిపే స్వేచ్ఛ కావాలనీ, స్త్రీకి తన శరీరంపై పూర్తి అధికారం తనదేననీ, పురుష దురహంకారం నశించాలనీ, పితృస్వామ్య భావజాలం నిర్దేశించే సామాజిక వత్తిడి అంతరించాలనీ, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి అనువైన వాతావరణం ఏర్పడాలనీ స్త్రీవాదం కోరుతోంది. సాహిత్యరంగంలో కూడా స్త్రీవాదానికి సమగ్రరూపం యివ్వబడింది. పుంఖాను

పుంఖంగా రచనలు వెలువడ్డాయి. స్త్రీవాదాన్ని తూలనాడి తిరస్కరించే రచయితలనూ, రచయిత్రులనూ మహిళా ప్రగతికి శత్రువులుగా భావిస్తారు. స్త్రీవాద శత్రువులు కేంద్రమంత్రులుగా, ప్రఖ్యాత సంపాదకులుగా, ముఖ్యమంత్రులుగా వుండవచ్చును. వారి కంటే ప్రజలపై ఎక్కువ ప్రభావం చూపించగల శక్తి దృశ్యమాధ్యమాలకు వున్నది.

సాహిత్యమూలికలైన కథా, సంభాషణా, పాటలను మిశ్రమం చేసి దృశ్య మాధ్యమంగా మార్చి రంగులకలగా చూపించే సినిమాలు, అంతంలేని భట్టి విక్రమార్క కథల్లా తీగెలు సాగి దినవారీ సాక్షాత్కారాలు కురిపించే టీవీ సీరియళ్ళూ కళా ప్రక్రియలుగానే చలామణీ అవుతున్నాయి. ప్రభావానికీ, ప్రచార స్వభావానికీ పతాకస్థాయి నేటి సినిమాలూ, టి.వీ ఛానళ్ళూ! సాంకేతిక శక్తితో, పెరిగిన పరికరాల ప్రభావంతో, సంగీతంతో, నృత్యగానాలతో , ఊహలకందని యితివృత్తాలతో మిళాయించి, కనీవినీ ఎరుగని "అద్భుత" రూపాలుగా సినిమాలు రూపొందుతున్నాయి. ఆ కథలు రాస్తున్నవారూ, ఆ పాటలు రాస్తున్నవారూ, "ఏమండీ మీ పాదాల చెంత నా కింత చోటు" వంటి సంభాషణలు లిఖిస్తున్నవారూ అంతా రచయితలే కదా! దర్శక, సంగీత, నృత్య గాన కళాకోవిదులు యీ రచనలకు మరింత మసాలా దట్టించి సినిమాలు విడుదల చేస్తున్నారు. అవి ఏం చూపిస్తున్నాయి.....?

> ***"ఏమండీ మీ పాదాల చెంత నా కింత చోటు" వంటి సంభాషణలు లిఖిస్తున్నవారూ అంతా రచయితలే కదా! దర్శక, సంగీత, నృత్య గాన కళాకోవిదులు యీ రచనలకు మరింత మసాలా దట్టించి సినిమాలు విడుదల చేస్తున్నారు.***

ప్రతి కథానాయికుడికీ ఆ భుజం మీద ఒక స్త్రీ, యీ భుజం మీద ఒక స్త్రీ వ్రేలాడుతుండగా ఆయన మగతనానికి జోహార్లు అర్పిస్తూ, 'మగసిరి'కి బానిసలై వారు అల్లాడిపోతుండగా కథనం సాగుతుంది. పురుషుడు వీరవిక్రముడు. ఇద్దరు, ముగ్గురు స్త్రీలకు సమానుడు. వారు కేవలం అబలలు. ఆయన విశాల వక్షంపై చోటు కోరుకునే అమాయకులు. ఆయనకిద్దరు...ఇంట్లో యిల్లాలు – వంటింట్లో ప్రియురాలు, నావాడే...ఆయన... కాదు నా వాడే..' అని స్త్రీల గానగంధర్వ కోలాహాలాలు...ఏమిటీ నాన్సెన్సని అడిగే వారులేరు!

పోనీ సమాజంలో వున్న రుగ్మతను చూపిస్తున్నారనుకుందామా...ఏ మగవాడికండీ యిద్దరు స్త్రీల ముద్దుల వర్షంలో మునిగిపోయే శోభనభాగ్యం వున్నదీ...? ఏ పురుషపుంగవుడి కండీ 'నేనంటే నేన'ని ఎగబడి కురిపించే ప్రేమామృతధారలుంట..? వ్యభిచారమూ, శరీరం అమ్ముకునే అభాగ్యుల కథలూ వున్నమాట నిజమే. ఇవి అవి కావే...వాటిని సృష్టించే సినిమా రచయితల దర్శకుల నిర్మాతల ధనవాంఛా తత్వ దారుణ మేధల్లో తప్పు ఎక్కడ వున్నాయో వాస్తవాలు...? సమాజంలో లేని గొప్ప అవాస్తవాల్ని అంతటి శక్తివంతమైన దృశ్యమాధ్యమాల్లో చూపిస్తే – కళ్ళు తప్ప అక్షరం చదవలేని కోట్లాది ప్రజలు ఏ విజ్ఞతతో వాటిని తిరస్కరించగలరు...?శతశతాధిక తద్దినాలు జరుపుకొనే యీ 'ఇద్దరు పెళ్ళాల ముద్దుల మొగుళ్ళ' కు యావత్తు ప్రజలూ ప్రేక్షకులు... అందులోని అద్భుత రసానంద పారవశ్యానికి కోట్లాది మంది యువకులూ, యువతులూ తన్మయులైతే రేపటి వారి జీవితాల్లో ఏ విలువలు నాటుకొంటాయి.....స్త్రీ కేవలం బొమ్మ...ఎత్తువల్లాల శిల్పం....పురుషుడి ఆనందానికి పనికి వచ్చే సాధనం...అతని అహంకారాన్ని సేవించే అల్పురాలు. అతడి అనుగ్రహంతో ధన్యురాలయ్యే అబల ఆడది.. అని చూపిస్తుంటే, ఎంతమంది స్త్రీవాదులు – మల్లాది సుబ్బమ్మలు, ఓల్గాలు – నిర్మలలు – పద్మలు – జయప్రభలు – రంగనాయకయమ్మలు – ఛాయాదేవులు ఎన్ని పుస్తకాలు కవిత్వాలు రాస్తే ఒక్క సినిమాకు సమానమవుతాయి. ఎంతమంది మహిళా సంఘనాయకులు ఘోషిస్తే మాత్రం అవి (పురుషుల్లోనా పుంగవా....పులకింతొస్తే ఆగవా – ఆసినీ, యింకాస్త ముందుకెళ్ళు– చట్టిలో సరుకేదో వంపుకెళ్ళు) ప్రసిద్ధ సినిమా పాటలు లయహేషల, పీయూషధారలకు సమానమవుతాయి..?

ఆధునిక స్త్రీలకు కనీసం తెలియని పాతివ్రత్య ప్రభావాలు, వ్రతమహత్యాలు, నోముల పంటలూ, కార్తీకదీపాలూ, వసంతోత్సవాలూ నేర్పుతున్నారంటే ఏమిటి కర్తవ్యం.. ఒక వేళ స్త్రీని ధైర్యశాలిగా, పోలీసు ఆఫీసరుగా, భర్తను ఎదిరించి బ్రతికే భార్యగా, రౌడీలను తన్నీగల(!) బలశాలిగా, కష్టాలనెదిరించగల పోరాటశీలిగా కాసేపు

చూపించినా...'ఆమె కన్నీళ్ళ సెంటిమెంటు లేనిదే మన పెట్టుబడికి లాభాలపంట కుదరదని'..నటీమణుల చేత కడవల కన్నీళ్లు కురిపిస్తుంటే అర్థమేమిటి...."ఆడది బరితెగించి ఎదిరించినా, రోడ్డున పడినా, సమాజాన్ని నిందించినా చివరకు "పరాజయం తప్పదని" సూచించటమే గదా!

పైగా స్త్రీలను ఎలా లొంగతీయాలో, ఎలా బొమ్మలను చేసి ఆడించాలో, ఎలా మానభంగాది అత్యాచారాలు చేయాలో వైనవైనాలుగా నేర్పుతుంటే తస్లీమాల రచనలూ, కమలాదాస్ కవితలూ , శోభాడే నిట్టూర్పులూ, అరుంధతీరాయ్ ఆవేదనలూ ఎవరిని ప్రభావితం చేయగలవు..? కథానాయకులకు లేని ధీరోదాత్తతలూ, నాయికలకు సౌశీల్యతలూ అంటగట్టి, మంటపెట్టి పరమకిరాతక కుళ్ళును మోస్ట్ గ్లామరస్‌గా చూపిస్తుంటే స్త్రీ విముక్తి ఉద్యమాలు కరెంటు లైట్ల ముందు నూనె దీపాల్లా వెలవెలపోవా?

*టి.వీ ఛానళ్ళకు అన్నీ సినీ మేనత్త పోలికలే. అత్త మూడు గంటలే వేధిస్తుంది. ఈమె రోజుకు అరగంట చొప్పున ఏళ్ళతరబడి సతాయిస్తుంది.*


టి.వీ ఛానళ్ళకు అన్నీ సినీ మేనత్త పోలికలే. అత్త మూడు గంటలే వేధిస్తుంది. ఈమె రోజుకు అరగంట చొప్పున ఏళ్ళతరబడి సతాయిస్తుంది. పైగా బుల్లి తెర బుల్లికి డబ్బులివ్వం గనుక, డజన్ల కొద్దీ ఛానళ్ళూ, సీరియళ్ళూ గనుక యింటిల్లిపాదీ తిని కూర్చుని తీరిగ్గా "ఆ సీరియల్లో ఆనంది ఏమయిందో, యీ సీరియల్లో సంధ్యాగారు, సూర్యాగారితో పెళ్ళయి ఆరేళ్ళయినా ఒక్క రాత్రి కూడా కాపురం చేయలేదు పాపం, అల్లా ఆ సీరియల్లో భర్త భార్యను మర్చిపోయి 'పాము'లా మారిపోయాడు. యిల్లా యీ సీరియల్లో అత్తగారు కోడలు గోపికా గార్ని యింటినుంచి బహిష్కరించింది – ఏమయిపోతుందో'' అని కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఈ 'గార్లు' ఉత్తరాది ఫ్యూడల్ రిచ్ కుటుంబాల్లో భార్యా భర్తల మధ్య ఉన్నాయట. వాటిని డబ్బింగ్ చేయగా తెలుగులో మొగుడూ పెళ్ళాల గార్లు దిగుమతి అయ్యాయట. మంచిదే కానీ యీ అత్తగార్ల పెత్తనాలు, మా సూర్యకాంతం అత్తమ్మ నుండి చూసి చూసి మర్చిపోయి కూడా మూడు దశాబ్దాలు గడిచాయే! ఇప్పుడు మళ్ళీ కొత్త అత్తయ్యలకు నేర్పుతున్నారా..? ఐ.పి.యస్.కు సెలక్టయిన కోడల్ని వేధించి ఎలాగైనా 'కుటుంబ సాంప్రదాయాన్ని' కాపాడమని ట్రెయినింగ్‌కు వెళ్ళకుండా చేసే పవిత్ర అత్తగారి చెత్త ఉపన్యాసాలు వారాలు, నెలలు, సంవత్సరాలూ వినిపించి వినిపించి విషం తినిపిస్తున్నారా? భర్త చచ్చిపోతే, ఆ ఇరవైఏళ్ళ యువతి వారి కోసం ఏళ్ళతరబడి ఏడ్చి ఏడ్చి సమిష్టి కుటుంబాన్ని మొత్తం విషాద విధ్వంసకాండ చేస్తే....అది చూస్తే ఏ యువతి అయినా ఏమి నేర్చుకుంటుంది...? మూడేళ్ళ పిల్ల జమిందార్ల, పెట్టుబడిదార్ల, భూస్వాముల హత్యాకాండ నెదిరించి పోరాడుతుంది. ఏళ్ళతరబడి చూసారా!! ఆడవారికి యీ సీరియళ్ళు అన్యాయం చేస్తున్నాయంటే తప్పుగదూ! అన్నట్లు జోక్....సీరియల్ నాలుగేళ్ళు అయినా ఆ పిచ్చిపిల్లకు వయస్సు మూడేళ్ళే సుమండీ! ఆగిపోయి వుంటుంది. డైరెక్టర్ కోరిక మేరకు..!! తెలుగులో స్వంతంగా తీసిన ఒకానొక మహాసీరియల్లో కొత్తగా పెళ్ళయిన కోడలుకు ఆరుగురు అత్తలుంటారు..సీరియల్ పేరే 'కొత్త కోడలు .. ఆరుగురు అత్తలు"!!! అంటే ఒక అత్తగారి చెల్లెళ్ళంట..! అందరూ కలిసి యీ కొత్త జంటను వేధిస్తుంటే, భాధిస్తుంటే ఆ చవట మొగుడు చూస్తూ అమ్మ + పిన్ని గార్లను సహించి భరించి పవిత్ర కొడుకుగా ఉంటాడన్నమాట! వెరసి మినీ తెర కోడళ్ళు, సినీఅత్తలకు తీసిపోకుండా, లేని అత్తా – కోడళ్ళ పాత చెత్తకుండీ కంపును తిరిగి ప్రవేశపెడుతున్నారు. సమిష్టికుటుంబాలే తక్కువై పోయి "మేమిద్దరం మాకిద్దరు" కుటుంబాలు వచ్చేస్తే యీ లేని రోగాలకు మందులేమిటి? లేని సమస్యలకు పరిష్కారాలేమిటి?

సినీమాయకు మరో కోణం కూడా వున్నది. స్త్రీకి లేని సుగుణాలు అంట గట్టడం...ఆమె విప్లవనేతగా మారి అపర సత్యభామలా కిరాతకుల్ని వధించడం...ఆమె సౌశీల్య శక్తికి పురుషుడు అగ్నిలోని శలభంగా మాడిపోవటం..పతిభక్తికీ – మాతృత్వ శక్తికీ, తాళిధారణా పతివ్రతానురక్తికీ – సర్వసామాజిక దుర్మార్గ సమూహము మసి అయిపోయినట్లు చూపించటం...! ప్యాంట్లు, షర్టులువేసి కళ్ళజోళ్ళు పెట్టి, కళాశాలల్లో చదివి, కారుల్లో కలెక్టరు మొగుడితో తిరిగే

## కవిత

# మనిషి కాలిపోతున్నాడు

- పొత్తూరి సుబ్బారావు
9490751681




మనిషి కాలిపోతున్నాడు
నిట్టనిలువునా దహించుకుపోతున్నాడు
ఖాండవ వన దహనంలా
ఏ అగ్నిదేవుడూ ఇక్కడకొచ్చి
ఆకలి తీర్చుకోవడంలేదు
మనిషే తనకుతాను తనువును కాల్చుకుంటూ
తనకున్న కీర్తిదాహాన్ని తీర్చుకుంటున్నాడు
అమరుడిని చేసి ఆకాశానికెక్కిస్తారని ఆశిస్తున్నాడు
అయినా ఆశలన్నీ ఆశయాలదిశగా సాగిపోవు
ఆరిపోని మంటల్లో ఆవిరవుతాయి
ఏ కొంపైనా, గిడ్డంగైనా కాలిపోతుంటే
ఆర్పటానికి ప్రయత్నిస్తుంటారు
ఫైరింజన్లు హడావిడి చేస్తుంటాయి
అదేమిటో! మనిషి నడిరోడ్డుమీద
కాలిపోతుంటే కాలయాపన చేస్తుంటారు
ఛానళ్ళవాళ్ళకి శాన్నాళ్ళకి మంచివార్తొచ్చిందని
పరుగుపరుగునక్కడికి చేరుకుంటారు
మంటలారిపోతే తమ రేటింగూ ఆరిపోతుందని
ఆదరాబాదరగా ఆ దృశ్యాలన్నిటినీ
కెమెరాలల్లో నింపుకుంటుంటారు
అదృశ్య శక్తుల హస్తమేదన్నా ఉందేమోనని
ఆరాలు తీస్తుంటారు
కాలిపోయే మనిషిమీద కాసిని నీళ్ళెవరైనా పోస్తే
ఆగ్రహజ్వాలతో అడ్డుకునేవారే అక్కడుంటారు
ఏ హోదాలేని మనిషి ప్రత్యేక హోదా కోసమో!
ఏ దాతల సాయమందని అన్నదాతలో!
ఎవ్వరైతేనేం! ఎవరికోసమైతేనేం!
పవరుకోసం పాకులాడేవారికి ఊతమిస్తారు
సహజంగా మరణిస్తే స్మశానం దాకా
ఊరేగించి కాల్చేస్తుంటారు
కావాలని కాల్చుకున్న దేహాన్ని
ఊరంతా ఊరేగించి అందలమెక్కుతారు
మనిషి మానవత్వాన్నెప్పుడో కాల్చేసుకున్నప్పుడు
కాలిపోయిన మనుష్యుల కన్నీటి చరిత్రమటుకు
కలకాలమెందుకు నిలబడివుంటుంది?

---

యువతులు సైతం పాదాభివందనాలతో పతిని కొలిచే అవాస్తవ దుర్మార్గ లక్షణాలను ఎదిరించే దాకా స్త్రీవాదం ముందుకు అడుగువెయ్యలేదు. మహిళల బాధల్ని, ఆమెకు ఎదురవుతున్న సమస్యల్ని చూపించి, తనను పురుషునికి స్నేహితురాలిగా, సమాన ప్రతిపత్తి గల వ్యక్తిగా, గొప్ప సామాజిక చైతన్య శక్తిగా చూపించడం వాళ్ళకు చేతకాదు...అలా చైతన్యం రగిలితే, యీ సీరియళ్ళ దర్శక, నిర్మాత, హీరో, తదితర జీరోలకు ఆడపిల్లలు అతి చౌకగా ఆనందమకరందాలు ఎలా కురిపిస్తారు. వారి విలాసాలకు, వినోదాలకు తెరవెనుక భాగోతాలకు ఆడపిల్లలు కీలు బొమ్మలుగా మారిపోవాలంటే, వారిని తెర మీద సైతం తోలు బొమ్మలుగా చూపించాలి. అలా కాకుండా వారిని 'స్వయం సిద్ధ'లుగా, 'డర్టీపిక్చర్'లోని నాయికల్లా, కర్తవ్యంలోని ఆడ ఆఫీసర్‌లా నిజంగా సామాజిక కోణాలుగా చూపించారనుకోండి వాళ్ళ లాభాల మాట అలా ఉంచి మహిళాలోకం మారిపోతే కొంపలంటుకుంటాయోచ్. ఈ రహస్యం వాళ్ళకు తెలుసు గనుగనే దృశ్యమాధ్యమాలు వాళ్ళను అష్టావక్రులుగా చిత్రించి మన దగ్గర్నుండి ధనాన్ని, సమయాన్ని, ఆలోచనా శక్తిని లాగివేస్తున్నాయి. మారుతున్న సమాజంలో, ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలో, బహుళ వైరుధ్యాల కుంపటి అయిన బ్రతుకుల్లో యీ 'కళాత్మక ద్రోహం' సంగతి యువతీ యువకులకు తెలియచెప్పటం మన కర్తవ్యం...! పితృస్వామ్య ధోరణిని పరోక్షంగా సమాజానికి సరఫరా చేస్తున్నట్లు చెప్పటం మన ధర్మం.!

## స్వీకారం

### బ్రేకింగ్ న్యూస్ కవిత్వం




**- కోట్ల వెంకటేశ్వరరెడ్డి**


వెల : 150/- పేజీలు: 183

ప్రతులకు : 94402 33261

'కాలంతో కలవరపడుతున్న కవీ, కలెబడుతున్న కవీ కోట్ల వెంకటేశ్వరరెడ్డి. 'గుండెకింద తడి' కవిత్వమైన కోట్ల కొత్త కవిత 'బ్రేకింగ్ న్యూస్' మార్పును కోరుకున్న ఆశాస్వప్నం. మార్పుల పట్ల తీవ్ర కలవరం, తెలంగాణ సమకాలీన జీవన సంఘర్షణ అన్నింటి పట్టింపు కోట్ల వెంకటేశ్వరరెడ్డి కవిత్వం.

**- నందిని సిధారెడ్డి**

### గాలిలో తేలిపోతున్నాం




**అమెరికా అనుభవ కథలు**

**కూతురు రాంరెడ్డి**

వెల : 100/- పేజీలు: 137

ప్రతులకు : 9000415353

మెదటిసారిగా అమెరికా వెళ్ళేవారికి కరదీపికగా ఉపయోగిస్తుంది. అమెరికాలో చూడాల్సినవి, చేయాల్సినవి, చేయకూడనివి, జాగ్రత్తపడాల్సినవి, అజాగ్రత్తగా ఉండకూడనివి,గ్రహించాల్సినవి, ఆనందించాల్సినవి- తెలుసుకోడానికి అవసరమైన ఫస్ట్‌హ్యాండ్ ఇన్ఫర్‌మేషన్ ఇందులో వుంది.

**- సింహప్రసాద్**

### వేదన




**- హిందీ మూలం: జయశంకర్ ప్రసాద్**

**- అనుసృజన: జలజం సత్యనారాయణ**

వెల : 100/- పేజీలు: 93

ప్రతులకు : 9849444944

జయశంకర్ ప్రసాద్ గీతాలలోని సంస్కృత పదాలను చాలాచోట్ల తత్సమాలుగా వాడుకోవటం మూలంగా జలజం సత్యనారాయణ గారు ఆ సంగీతాన్ని కూడా అనువదించారు. హిందీ భాషలో 1925 ప్రాంతంలో వచ్చిన భావకవిత్వాన్ని ఇప్పటికి పాఠకులకు అందించాలన్న అనువాదకుల సంకల్పం నెరవేరింది.

**- డా. అమ్మంగి వేణుగోపాల్**

### తెలుగు సాహిత్యం




**పరిణామాలు - ఒక పరిశీలన**

**అజ్మీరు వీరభద్రయ్య**

వెల : 70/- పేజీలు: 148

ప్రతులకు : 9290879849

సాహిత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేసిన అజ్మీరు వీరభద్రయ్య గారు ఆనాడు సాహిత్యంలో వచ్చిన ఉద్యమాలను కూడా ఈ పుస్తకంలో చర్చించటం అనివార్యమైంది. ఎందుకంటే ఏ ప్రజా పోరాటాన్ని, ప్రజా ఉద్యమాన్ని, ప్రజా సాహిత్యాన్ని వదిలివేయకుండా ఆ నాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య, కళలను వీరభద్రయ్య గారు ఈ రచనలో చర్చించటం జరిగింది.

**- దోసపాటి నాగేశ్వరరావు**

### కన్నీటి కట్ట




**గుండెలయ తడి ఆరని అలల పాటలు**

**- బోల యాదయ్య**

వెల : 60/- పేజీలు: 66

ప్రతులకు : 9912206427

ఈ యువ కవి గాయకుడు ఏ మాటల బాటలో ఉన్నాడో, వెతికి పట్టుకోవడం మనం చేయవలసిన పని. బహుశా బాధల గనిలో పాటలు తొవ్వుతున్న ఈ కవి కార్మికుడు, నూతన మానవుడి బాటకు పాటై గొంతు ఎత్తుతాడని, రేపటి స్వప్నానికి అక్షర క్రాంతి దర్పణం అవుతాడని ఆశిద్దాం.

**- జనజ్వాల**

### ఆకాశం అందుతోంది




**- డి. కె చదువుల బాబు**

వెల : 80/- పేజీలు: 75

ప్రతులకు : 0866-2430302

ఏ భావాన్ని చెప్పాలన్నా అందరికీ పరిచయం ఉన్న పదసముదాయంతోనే చెప్పడానికి ప్రయత్నిస్తారు. ఈ కవికి తనదైన స్వైరవిహారం లేదు. పాఠకుడనే గూటానికి కమ్యూనికేషన్ అనేతాడు పట్టుకుని సంచరించే కవి చదువులబాబు. రౌద్రం, బీభత్సం ఈయన కవితలో కనిపించవు. కరుణ, వాదం ప్రవహిస్తూ ఉంటాయి.

**- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

## నివేదిక




# సంక్రాంతి బాలల కవి సమ్మేళనం

- పాయల మురళీకృష్ణ
9441026977

విజయనగరం జిల్లా దేవుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జనవరి 8న సంక్రాంతి అంశంగా బాలల కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు టి. సన్యాసిరాజు అధ్యక్షత వహించారు. సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, కవులు సిరికి స్వామినాయుడు, ఎస్. బాలసుధాకర్ మౌళి అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల సీనియర్ సహాయకులు కె.ఎస్. రామారావు గారు, మిగిలిన ఉపాధ్యాయ సిబ్బంది హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఒక మంచి సందర్భానికి పాఠశాల వేదిక కావడం ఆనందదాయకమని, మన ఆచార సాంప్రదాయాలకు 'సంక్రాంతి' ఒక సూచిక లాంటిదని ఇందుకు విద్యార్థులు కవిత్వంలో తమ సృజనాత్మకతను చూపడం గొప్ప విషయమని కొనియాడారు.

చీకటి దివాకర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించవలసిన అవసరం ఉందని, విద్యార్థుల్లో కవిత్వం రాసే అలవాటు చేయిస్తున్న పాయల మురళీకృష్ణ అభినందనీయుడని అన్నారు. ముందు ముందు కొన్ని పాఠశాలలను కలిపి ఒక చోట కవిత్వం, కథ, కార్యశాల నిర్వహించాలని సూచించారు.

మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో కవిత్వం రాసేందుకు ప్రేరణగా 'సంక్రాంతి' అంశం తెలిసిన విషయంగా భావించి ఇవ్వడం జరిగిందన్నారు. సుమారు 46 కవితలు వచ్చాయని అవన్నీ చదివాక స్వామినాయుడు, బాల సుధాకర్ మౌళి ఉత్తమమైనవి ఎంపిక చేస్తారని తెలియజేశారు. స్వామినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఇంతమంచి కవిత్వం రాయడం గొప్ప విషయమన్నారు. మురళికి సహకరిస్తున్న ప్రధానోపాధ్యాయులు టి. సన్యాసిరాజుగారికి ధన్యవాదాలు తెలిపారు. స్వీయ కవిత చదివి వినిపించారు. బాలసుధాకర్ మౌళి తన స్వీయ కవిత 'తరగతి గది' చదివి వినిపించారు. తర్వాత పిల్లలు 46 మంది తమ కవితలు చదివి వినిపించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కె. మహేశ్వరరావు తను రాసిన పాటను ఆలపించారు.

పిల్లల కవితల్లో ఉత్తమమైన వాటిగా 'జామి పూజిత, తుంబ దేవుడమ్మ, జగ్గినేని రాధ, సావిత్రి, అఖిల, తుంబ అలేఖ్యల కవితలు ఎంపికయ్యాయి. ఎంపికయిన కవితల్లోని కొన్ని చరణాలు –

**'ఆకాశంలో నక్షత్రాల్లా చెదిరిపోయిన వాళ్ళంతా/ సంక్రాంతి రోజున ఇంటికి వస్తారు'– జామి పూజిత**

**'గాలిపటాలు ఎగరేస్తుంటే చంద్రుణ్ణి/ సంక్రాంతికి రమ్మని శుభలేఖ పంపినట్లుంది'– తుంబ దేవుడమ్మ**

**'అమ్మ నూనెలో నుంచి అరిసెలు తీస్తుంటే/ జాలరులు చేపలు తీసినట్లుగా ఉంది' – జగ్గినేని రాధ**

**'తెగిపోయిన గాలిపటం తెచ్చి మళ్ళీ ముడివేసి ఎగరేసాను/ ఈ సంక్రాంతి మన బంధాన్ని ముడివేస్తోంది'– తుంబ అలేఖ్య**

**'ద్వార బంధానికి కట్టిన తోరణాలను చూస్తే/ పచ్చని పంటపొలాలు గుర్తుకు వస్తాయి' – ఉప్పల సాయిలక్ష్మి**

**'భోగిమంటలో కాలుతున్న రంగ బిళ్ళ కర్ర/ మందార పువ్వులో ఎర్రని కీలాగ్రంలా ఉంది'– సూర్యప్రకాష్**

ఇలా ఎన్నో రూపకాలతో పిల్లల కవిత్వం చక్కగా ఆకట్టుకుంది. కవులు, ఉపాధ్యాయులు వీరిని మనస్ఫూర్తిగా అభినందించి అందరికీ బహుమతులు అందజేశారు.

## నివేదిక



# డాక్టర్ అద్దేపల్లి సాహిత్య దర్శనం

- గనారా

కాకినాడలో పి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భాషా విభాగం, సాహితీస్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో డా॥ అద్దేపల్లి సంస్మరణ సభ జరిగింది. అద్దేపల్లిపై స్మృతి గీతాన్ని రామకృష్ణ శ్రీవత్సవ ఆలపించారు. ఈ కార్యక్రమానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు డా॥ ఎండ్లూరి సుధాకర్ అధ్యక్షత వహించారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం(తిరుపతి) ఆచార్యులు డా॥ మేడిపల్లి రవికుమార్ 'ప్రపంచీకరణ నేపథ్యంలో అద్దేపల్లి కవిత్వం' అంశంపై, కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ రెంటాల శ్రీవేంకటేశ్వరరావు 'అద్దేపల్లి సాహితీ విమర్శ' అంశంపై, సాహితీస్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొరప్రసాద్ 'అద్దేపల్లి సాహిత్యోద్యమం' అంశంపై ప్రసంగించారు.

అద్దేపల్లి సంప్రదాయ కవులతో, ఆధునిక కవులతో కూడా స్నేహం చేశారని, స్త్రీవాద కవిత్వాన్ని, దళిత సాహిత్యాన్ని కూడా ఆదరించారనీ, ఆయన కవిత్వం కన్నా, వ్యక్తిత్వం మరీ విశాలమైనదనీ ఎండ్లూరి సుధాకర్ కొనియాడారు. ప్రపంచీకరణ వలన ప్రమాదం ఏమిటనేది అద్దేపల్లిని ఒక్కడిని చదివితే అర్థమైపోతుందని మేడిపల్లి రవికుమార్ అన్నారు. సాహిత్యం యొక్క విరాట్ స్వరూపం అద్దేపల్లి అన్నారు. అక్షరాన్ని పదునుగా, ఒడుపుగా ప్రయోగించారని, అక్షరాన్ని ప్రేమించాడనీ, జీవితాన్ని ఇంకా ప్రేమించాడనీ మేడిపల్లి అన్నారు. ప్రగతిశీలమైన భావజాలంతో జీవించారనీ, యుగస్ఫూర్తిని ఎప్పటికప్పుడు అందుకునే వ్యక్తి అద్దేపల్లి అని రెంటాల శ్రీ వేంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. కవిత్వాన్నీ, విమర్శనీ నిరంతరంగా కొనసాగించే కవులు చాలా అరుదనీ అద్దేపల్లి రెండింటినీ సమాంతరంగా చేయగలిగారనీ అన్నారు. అద్దేపల్లి సాహిత్యాన్ని అధ్యయనం చేయడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు.

వొరప్రసాద్ మాట్లాడుతూ అద్దేపల్లిని తీవ్రంగా ప్రభావితం చేసినది శ్రీశ్రీ, గుర్రం జాషువా అని, విశ్వనాథ సత్యనారాయణ నుండి ప్రేరణ పొందారని అన్నారు. సంప్రదాయ ఆధునిక సాహిత్యాల మధ్య వారధి కట్టిన వాడు అద్దేపల్లి అని అన్నారు. సిద్ధాంతాల పేరుతో సృజనకారులకు పరిధి విధించకూడదని, అద్దేపల్లి విశాల భావనతో ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించారని అన్నారు. ఆ భావనతోనే సాహిత్యోద్యమాన్ని విస్తృతం చేయాలని, అదే అద్దేపల్లికి నిజమైన నివాళి అని అన్నారు. సాహిత్య కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్ళమని తనను నిత్యం ప్రోత్సహించేవారనీ, చివరి నిమిషం దాకా తన పేరును పిలుస్తూనే ఉన్నారనీ సాహితీస్రవంతి బాధ్యులు గనారా అద్దేపల్లిని స్మరించుకున్నారు.

అనంతరం జరిగిన అద్దేపల్లికి అక్షర నివాళి సభకు వుయ్యపు హనుమంతరావు అధ్యక్షత వహించారు. పి.ఆర్. కళాశాల అధ్యాపకులు బొల్లోజు బాబా, వలవల శ్రీనివాసరావు, పి.వి. కృష్ణారావు, హరిరామప్రసాదు, ఇవిఎస్ సుబ్రహ్మణ్యం, ఎర్రమిల్లి శారద, కళాశాల విద్యార్థులు మురళి, మూర్తి, సత్యనారాయణ, నాగభార్గవి, శివరంజని తదితరులు ప్రసంగించారు. డా. విశ్వనాథరావు, పద్మజావాణి, డా. సీతారామస్వామి, మన్మధరావు, శశికాంత్ శాతకర్ణి, మద్దాలి సత్యనారాయణ, శిరీష, కోసూరి గాంధీ, గెడల శివప్రసాద్, గరికిపాటి మాష్టారు, మేడిశెట్టి శ్రీరాములు, వివిఎస్ఆర్ సోమయాజులు, వక్కలంక రామకృష్ణ, కంభంపాటి సుశీల, అద్దేపల్లి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అద్దేపల్లి ముఖచిత్రంతో, ప్రత్యేక వ్యాసాలతో వెలువరించిన 'సాహిత్య ప్రస్థానం' మాసపత్రికను ప్రముఖ కవయిత్రి, విమర్శకురాలు వాడ్రేవు వీరలక్ష్మీదేవి ఆవిష్కరించారు. అద్దేపల్లి పై వెలువరించినప్రజా సాహితి ప్రత్యేక సంచికను కూడా ఈ వేదికపై ఆవిష్కరించారు.

నివేదిక

# ప్రకాశం జిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవాలు



ప్రకాశం జిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవ వేడుక జనవరి 8,9,10 తేదీలలో ఒంగోలులో టిడిటి కళ్యాణ మండపంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతో పాటు, రాష్ట్రేతర ప్రాంతాల నుండి వచ్చిన 1200మంది కవులు, రచయితలు, భాషాభిమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రారంభ సభలో ఒంగోలు యం.యల్.సి మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఈదర హరిబాబు, బూచేపల్లి సుబ్బారెడ్డి దంపతులు, మాజీ యం.ఎల్.ఏ దారా సాంబయ్య, గ్రానైట్ అధినేత శిద్ధా వెంకటేశ్వరరావు, బిజేపి నేత బత్తిన నరసింహారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఐ.వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా రచయితలు సంఘం ప్రచురించిన 1050పేజీల స్వర్ణోత్సవ సంచిక "తెలుగు లోగిలి" ని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. తెలుగు భాషా వికాసానికి ఇతర రాష్ట్రాలలో విశేష సేవలందించిన ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు (బెంగుళూరు), డా. పుల్లూరి ఉమ (చెన్నై), ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి(కడప), డా. తుర్లపాటి రాజేశ్వరి (బరంపురం), డా. రామాచంద్ర మౌళి (వరంగల్), సంగినేని రవీంద్ర (ముంబాయి), కె. అనీల్ కుమార్ రెడ్డి (చెన్నై) లను స్వర్ణోత్సవ పురస్కారాలతో సత్కరించారు. అనంతరం జరిగిన డా. గజల్ శ్రీనివాసరావు" గజల్ గానవిభావరి " ప్రేక్షకులను అలరించింది.

"సమకాలీన సామాజిక కవిత్వధోరణులు" అంశంపై ప్రముఖ కవి కె. శివారెడ్డి ప్రసంగించారు. ప్రఖ్యాత సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి "ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్రలు – పునుర్మూల్యాంకనం" అంశంపై ప్రసంగించారు. ప్రముఖ సాహితీ వేత్త డా. గుమ్మా సాంబశివరావు "ప్రబంధ సాహిత్యం – సామాజిక ప్రభోదం" అంశంపై ప్రసంగించారు. "అమ్మనుడి" పత్రికా సంపాదకులు డా. సామల రమేష్ బాబు జీ.వో నెం 86 ప్రకారం తెలుగు భాషా పరిరక్షణ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యా సంస్థల్లో తెలుగును విధిగా బోధించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. ప్రజల భాషలో రచనలు రావాల్సిన అవసరాన్ని కవులు, రచయితలు గుర్తించాలన్నారు. సాయంత్రం జరిగిన ద్వితీయ సదస్సుకు కథా విశ్లేషకులు వాసిరెడ్డి నవీన్ అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య మాతృభాషా పరిరక్షణ అవసరంపై, విమర్శకులు, కవి డా. పాపినేని శివశంకర్ "తెలుగు సాహిత్య విమర్శ" అంశంపై, "తెలుగు రుబాయిలు" అంశంపై కవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్, "ఆధునిక పద్యకావ్యాలు" అంశంపై డా. మొవ్వా వృషాద్రిపతి ప్రసంగించారు.

10వ తేదీ ఉదయం తెలుగు జాతీయ కవి సమ్మేళనం జరిగింది. వివిధ ప్రాంతాల నుండి 20మంది ప్రముఖ కవులు కవితాగానం చేశారు.కె. శివారెడ్డి అధ్యక్షతన డా. రాధేయ, పెరుగు రామకృష్ణ, శ్రీనివాస వాసుదేవ్(బెంగుళూరు), డా. తుర్లపాటి రాజేశ్వరి(బరంపురం), విజయచంద్ర(బరంపురం), రసరాజు (తణుకు), అడిగోపుల వెంకటరత్నం, యం.వి రామిరెడ్డి (గుంటూరు), యస్.ఆర్ భల్లం (తాడేపల్లి గూడెం), యం.బి.డి. శ్యామల (తెనాలి), పి. లక్ష్మణరావు (విజయనగరం), పి.వి సుబ్బారావు (చిలకలూరిపేట) తదితరులు కవితా గానం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం కోశాధికారి వై. కొండారెడ్డిని, ప్రకాశం జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులను అందరూ అభినందించారు. అనంతరం కార్యవర్గ సభ్యులనూ, ప్రతినిధులనూ జ్ఞాపికలతో సత్కరించారు.

## డైరీ

# అంపశయ్య నవీన్ పుస్తకాల ఆవిష్కరణ



అంపశయ్య నవీన్ 74వ జన్మదినోత్సవం సందర్భంగా డిసెంబర్ 24న ఆయన రచనల ఆవిష్కరణ సభ హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్ సభకు అధ్యక్షత వహించారు. ప్రముఖ విమర్శకుడు ఎస్.వి. రామారావు "తెలుగులో ఆధునిక నవల, ఇతర సాహిత్య వ్యాసాలు" గ్రంథాన్ని, ప్రముఖ రచయిత్రి డా॥ అమృతలత "అంపశయ్య నవీన్ కథలు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆచార్య బన్న అయిలయ్య "నవీన్ సాహిత్య వ్యాసాలను", నెల్లుట్ల రమాదేవి నవీన్ కథల్ని సభకు పరిచయం చేశారు. కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి సభకు స్వాగతం చెప్పారు. అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు కార్యదర్శి డి. స్వప్న నివేదికను సమర్పిస్తూ ఈ సంవత్సరం నవీన్ లిటరరీ ట్రస్టు ప్రదానం చేసే ప్రథమ నవలా పురస్కారానికి యు.ఎస్.ఏ లో ఉండే గొర్తి బ్రహ్మానందం రచించిన 'అంతర్జ్వలన' నవలను ఎంపిక చేశామని, ఈ సంవత్సరం నుండి ద్వితియ బహుమతి కూడా ఇస్తున్నామనీ, ద్వితియ బహుమతికి వరంగల్ వాస్తవ్యులైన శుక్తిమతి రచించిన "మళ్ళీ పల్లె ఒడిలోకి" అన్న నవలకు ప్రదానం చేస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో నిర్మించబడిన "అంపశయ్య" సినిమాలోని కొన్ని దృశ్యాలను సభికులకు చూపించారు. చివర్లో అంపశయ్య నవీన్ తన స్పందనను తెలియజేస్తూ సాహిత్యం తన జీవితంలో ఒక అంతర్భాగమనీ, చివరి క్షణం వరకు తను సాహిత్య సృజన చేస్తూనే ఉంటానని చెప్పి ఈ సభకొచ్చిన సాహిత్యాభిమానుల కందరకూ కృతజ్ఞతల్ని తెలియజేశారు.



**నిజామాబాద్‌లో జనవరి 3న జరిగిన ఇందూరు అపురూప అవార్డు - 2015-2016 అభినందన సంచిక ఆవిష్కరణ. చిత్రంలో డా॥ అమృతలత, బి. నర్సింగరావు, శ్రీమతి నెల్లుట్ల రమాదేవి, అవార్డు గ్రహీతలు నాళేశ్వరం శంకరం, తదితరులు**

## కవితల పోటీ ఫలితాలు

పల్లంటి ఆదిలక్ష్మి ఛారిటుబల్ ట్రస్ట్, విశాఖపట్నం వారి దశమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితల పోటీ ఫలితాలను ట్రస్ట్ ఉపాధ్యక్షులు మహర్షి ఒక ప్రకటనలో తెలిపారు. నిర్భయ భారత - మామిశెట్టి శ్రీనివాసరావు, ప॥గో జిల్లా, - ప్రథమ బహుమతి - రూ. 1000, సత్సంకల్పం - ఎరుకలపూడి గోపీనాథరావు, విజయవాడ - ద్వితీయ బహుమతి - రూ. 900, పరకాయ ప్రవేశం - సి.హెచ్.వి. బృందావనరావు, కృష్ణాజిల్లా - తృతీయ బహుమతి -రూ. 800, ప్రోత్సాహక బహుమతులు (5) ఒకొక్కటి 500 రూపాయలు.ఓ రైతన్న - పెరుమల కైలాష్ - మెదక్, వృద్ధాంగన్ - రాంమోహన్ - కడప, - మృత్యుంజయుడు రాయప్రోలు వామనమూర్తి - విశాఖపట్నం, చితికి పోతున్న క్షితి - కిలపర్తి దాలి నాయుడు - విజయనగరం, అచ్చంగా ఆమెకే తెలుసు - శ్రీమతి సుజనాదేవి, కరీంనగర్.

# అమర అక్షర హిందీ త్రైమాసిక పత్రిక ప్రారంభ సంచిక ఆవిష్కరణ



*అక్షర సాహితీ సాంస్కృతిక సేవా పీఠం - రాజమండ్రి, కె.బి.యన్ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు **22-23** తేదీలలో విజయవాడ, కెబియన్ కళాశాల, సెనిమార్ హాలులో హిందీ విభాగం, నాగార్జున విశ్వవిద్యాలయం సహకారంతో "సమకాలీన సాహిత్యం - ఉద్దేశాలు అంశంపై జరిగిన **2** రోజులు జాతీయ సదస్సు. హిందీ త్రైమాసిక పత్రిక అమర అక్షర ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, పూర్వ హిందీ విభాగాధ్యక్షులు ఆచార్య చౌథీరామ్ యాదవ్, డా॥ పి. కృష్ణబాబు, ఆచార్య శశి ముదిరాజ్ , డా. పేరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు.*



*విజయవాడలో ప్రెస్‌క్లబ్‌లో జనవరి **26**న రమ్య భారతి సాహిత్య త్రైమాసపత్రిక ఆధ్వర్యంలో సోమేపల్లి సాహితీ పురష్కారాల ప్రధానోత్సవ సభ జరిగింది. చిన్నకథల పోటీలో విజేతలు సి.ఎన్. చంద్రశేఖర్ (చిత్తూరు), రాచమళ్ళ ఉపేందర్ - ఖానాపురం (హవేలి), మొలుగు కమలాకాంత్ (విజయవాడ), కె. రామమోహన్ (ప్రొద్దుటూరు). ఈ సభలో గజల్ శ్రీనివాస్, గుమ్మా సాంబశివరావు, పెనుగొండ లక్ష్మీనారాయణ, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, అంబటి మధుమోహన కృష్ణ, చలపాక ప్రకాష్, కోసూరి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.*

## పుస్తక పఠనాసక్తిని ప్రోత్సహించండి!

పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచడానికి - పంచడానికి కొంతమంది రచయిత(త్రు)ల సహకారంతో 'నా పుస్తకం' అనే ప్రణాళికను శ్రీ కృష్ణదేవరాయ గ్రంథమాల - సాహితీసంస్థ; నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి రెండు వందల మంది సభ్యులతో ఏడాదికి 12పుస్తకాలు పోస్టుద్వారా అందజేస్తున్నట్లు, ఈ ప్రణాళికలో సాహితీ ప్రియులు సభ్యులుగా చేరి మంచి పుస్తకాలు పొంది, ప్రణాళికను మరింత ప్రోత్సహించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఇతర వివరాలకు మేనేజింగ్ ఎడిటర్, శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల, హిందూపురం - 515201 చిరునామా ద్వారా తెలుసుకోవచ్చు. ఫోన్ నెం. 9493271620 ద్వారా సంప్రదించవచ్చును.

## గమనిక

**సాహిత్య ప్రస్థానం చిరునామా మారింది.**

రచనలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు

ఈ దిగువ చిరునామాకు పంపగలరు


సాహిత్య ప్రస్థానం

27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు

ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002

ఫోన్: 0866-2577248, సెల్: 9490099059

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com

www.prasthanam.com




విశాఖపట్నంలో జనవరి *2*న మార్క్సిస్ట్ అధ్యయన వేదిక, అరసం విశాఖ ఆధ్వర్యంలో డా॥ దేవరాజు మహరాజుకి జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న దృశ్యం. చిత్రంలో సిపిఐ నాయకులు మన్నం ఆంజనేయులు, జెవియస్‌యన్ మూర్తి, కవులు ప్రొ॥ చందు సుబ్బారావు, ఎవిఆర్ మూర్తి, ఉప్పల అప్పలరాజు, పి. అనంతరావు తదితరులు.



విజయవాడలో, మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో సంగమం, సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి *13*న జరిగిన అరుణ్‌సాగర్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న జర్నలిస్టు వడ్లమూడి పద్మ. చిత్రంలో సంగమం ప్రతినిధి వెంకట్.



తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఖమ్మంలో మంచికంటి భవన్‌లో ఫిబ్రవరి *18*న జరిగిన అరుణ్‌సాగర్ సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కె. ఆనందాచారి. చిత్రంలో కన్నెగంటి వెంకటయ్య, మువ్వా శ్రీనివాసరావు, కొండపల్లి పావన్, రౌతురవి.


### FORM IV

(Rule 8)

UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867
STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS
ABOUT MONTHLY -SHAITYA PRASTHANAM

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | V. Krishnaiah |
| 1 (a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 4. Publisher's Name | : | V. Krishnaiah |
| 1 (a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 5. Editor's Name | : | T. RAVI |
| Nationality | : | INDIAN |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |
| 6. Name and addresses of owner | : | V. Krishnaiah |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin | : | - |
| Address | : | H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020 |

**I, V. KRISHNAIAH, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

Sd/
V. KRISHNAIAH
Publisher

Date: 01.03.2016

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# వల్లంపాటి వెంకటసుబ్బయ్య

15.03.1927 - 02.01.2006




'కథా శిల్పం', 'నవలా శిల్పం' వంటి గ్రంథాలు వెలువరించారు. విమర్శకులుగా పేరు గడించారు. అనువాదకులు. కథలు కూడా రాసారు.

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/16-18
Date of Posting : 01.03.2016 ▪ Date of Publication: 26.02.2016



# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు





వెల : రూ.40/-





వెల : రూ.100/-





వెల : రూ.45/-




వెల : రూ.100/-





వెల : రూ.125/-





వెల : రూ.150/-





వెల : రూ.150/-





వెల : రూ.35/-




వెల : రూ.30/-




వెల : రూ.35/-




వెల : రూ.45/-

ప్రజాశక్తి బుక్‌హౌస్, డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి, గవర్నరుపేట, రాఘవయ్య పార్కు వద్ద, విజయవాడ - 520 002, ఫోన్ : 9490099202


If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059